13-09Pg1fO ONG_13-09Pg1fO.qxd 9/13/2025 1:03 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఒంగోలు : fb.com/vaartha Digital

Published from Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 223 పేజీలు: 12 వెల: 6.50




**SHOWROOM: ANDHRA PRADESH:** RENAULT **ONGOLE** Ph: 9582547709.

13-09pg2exHMNWJQER 2nd_13-09pg2exHMNWJQER.qxd 9/13/2025 12:47 AM Page 1





కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మశ్రీ, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

## సముద్ర తీర ప్రాంత గ్రామాలకు రక్షణ గోడ

## రూ. 323 కోట్లు అంచనా: కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా ఉప్పాడ కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామంలో సముద్రపు అలల తీవ్రత పెరిగి, గ్రామంలోకి నీరు చేరిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్,ఎమ్మెల్యే వర్మ పద్మశ్రీ ఉప్పాడ శివారు సుబ్బంపేట గ్రామాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షి ంచారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్తులకు తాత్కాలిక సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామంలో నిలిచిపోయిన నీటిని బయటకు పంపించడం ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తక్షణ పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన తెలిపారు. అలల తీవ్రతకు దెబ్బతిన్న ప్రస్తుత రక్షణ గోడలోని రాళ్లను యుద్ధప్రాతిపదికన తిరిగి ఏర్పాటు చేయడంతో పాటు, అదనంగా కొత్త రాళ్లను వేసి గోడ ఎత్తును పెంచడం ద్వారా అలల ప్రభావాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చన్నారు. సుబ్బంపేట సహా తీర ప్రాంత గ్రామాలకు శాశ్వత రక్షణ కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో రూ.323 కోట్లతో పటిష్టమైన రిటైనర్ వాల్ (రక్షణ గోడ) నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయబడ్డాయన్నారు. ఈ రక్షణ గోడ నిర్మాణం పూర్తయితే, సుమారు 3040 సంవత్సరాల పాటు తీర ప్రాంత గ్రామాలకు పూర్తి రక్షణ లభిస్తుందన్నారు. సుమారు 10 కిలోమీటర్ల మేర తీరం పొడవునా అలల ఉధృతి ఉన్నప్పటికీ, ప్రస్తుతం సుబ్బంపేట గ్రామం ఎక్కువగా ప్రభావితమైందని, మాయాపట్నం వద్ద పరిస్థితిని కూడా పరిశీలించామని,గతంలోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఈ అలల ఉధృతికి కారణమైన సాంకేతిక అంశాలను సమీక్షి ంచి, యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, డీపీవో వి.రవికుమార్, ఏడి కరుణాకర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణన్ పదవీ స్వీకారం

>> 152 ఓట్ల మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ పదవినుంచి దిగిపోయిన కారణంగాజరిగిన ఎన్నికలో రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకారానికి ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా, మాజీ ఉపాధ్య క్షులు హామీద్ అన్సారి, వెంకయ్యనాయుడు, జగదీప్‌ధన్‌కడ్ వంటిప్రముఖులు హాజరయ్యారు. పదవినుంచి వైదొలిగిన తర్వాత మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్‌దన్‌ఖడ్ తొలిసారిగా బయటకనిపించారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ఎంపి లోక్‌సభలో ఇండియా కూటమి నాయకుడు రాహుల్‌గాంధీ హాజరుకాలేదు.

ఆయన ప్రస్తుతం గుజరాత్ పర్యటనలో ఉన్నట్లు తేలింది. ఇదిలా ఉండగా ఉపరాష్ట్రపతి ఎన్నిక ఎన్డీయే అభ్యర్థినే వరిస్తుందని ముందునుంచీ ఊహించినదే. బిజెపిఆధ్వర్యంలోని ఎన్డీయేకు 427మంది ఎంపిలు ఉంటే అదనంగా వైఎస్ ఆర్‌సి ఎంపిలు 11 మంది ఉన్నారు. దీనితో మెజార్టీ మార్కు 377 ను అధిగమించింది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడంతోనే ప్రస్తుతం కొనసాగుతున్న మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాధాకృష్ణన్ రాజీనామాచేసారు. కోయంబత్తూరునుంచి రెండుపర్యాయాలుఎంపిగాఉన్న రాధాకృష్ణన్, బిజెపి తమిళనాడు చీఫ్‌గాకూడా పనిచేసారు. జనసంఘ్ నుంచి ప్రజాజీవితంలోకి వచ్చిన రాధాకృష్ణన్ ఆర్‌ఎస్‌ఎస్‌కు ముందునుంచి విధేయునిగా ఉన్నారు.



శుక్రవారం గుజరాత్‌లోని కేశోద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

# బిసిల రక్షణ చట్టం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

>> రాష్ట్రంలోని శెట్టి బలిజ సామాజికవర్గాన్ని ఓసిల్లో చేరుస్తున్నారంటూ వైసీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కులాల మధ్య చిచ్చు రేపుతూ జగ్గిరెడ్డి అవగాహన రాహిత్యంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. వైసీపీ జిల్లా అధ్యకుడిగా ఉన్న వ్యక్తికి కనీస అవగాహన లేకుండా మాట్లాడడం శోచనీయమన్నారు. శెట్టి బలిజల గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని సుభాష్ స్పష్టం చేశారు. బిసిల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకు రావాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. బీసీల రక్షణ చట్టంపై ఇప్పటికే పలుమార్లు బిసి మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ నేడు బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చిన పార్టీ తెలుగుదేశమని, బార్లు, వైన్ షాపుల్లో శెట్టిబలిజలకు 10 అవకాశం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ బంపర్ హిట్ కావడంతో వైసీపీ నాయకులకు దిమ్మతిరిగి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని దుయ్య బట్టారు. యూరియా పై కూడ రైతుల్లో అనవసరం భయాందోళనలు కల్పించి దుష్ప్రచారానికి వైసీపీ తెర తీసిందని మంత్రి సుభాష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనదక్షత వల్ల రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందనడం పూర్తిగా అవాస్తవమన్నారు. కేవలం రైతులను భయాందోళనలకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ విష ప్రచారానికి తెరలేపిందని సుభాష్ వెల్లడించారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏటా సగటున 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే రైతులకు అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. ఇప్పటికే ఆగస్టు నెలాఖరు నాటికి 5,69,712 టన్నులు, ఈ నెలలో మరో 94,482 టన్నులు సరఫరా చేశారని తెలిపారు. వాస్తవాలు తెలియకుండా వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు కథనాలతో కృత్రిమ కొరతను సృష్టించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. గత ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని జగన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను అడ్డుకునేందుకే వైసీపీ తప్పుడు ప్రచారాలు, డ్రామాలకు తెరలేపింది, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలిపే విషయమై మంత్రి స్పందిస్తూ ప్రజాభిప్రాయాన్ని స్వీకరించి అధిష్టానానికి తీసుకెళ్తానన్నారు. బీసీల ఉన్నతి కోసం ప్రవేశపెట్టిన ఆదరణ పథకాన్ని గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని తిరిగి రూ.1000 కోట్లతో పునరుద్ధరించామన్నారు. బీసీలను అన్ని రంగాల్లో రాజకీయంగా సామాజికంగా, ఆర్థికంగా అణగతొక్కి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. అలాగే గత వైసిపి కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. డూప్లికేషన్ పేరుతో కార్మికులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు అందకుండా చేసిందన్నారు. కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అన్ని జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటుకు కృషి చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కుడిపూడి సత్తిబాబు, కూటమిపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు భాగస్వామ్యం

>> తెలుగువారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నాఖ అని చంద్రబాబు వెల్లడించారు. ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపిన చంద్రబాబు.. ఈ సంవత్సరం డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగామని చెప్పారు.2028-29 నాటికి రూ.29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలం.. 2029-2034 నాటికి రూ.57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు ఉన్నాయి. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుందిఖ అని చంద్రబాబు స్పష్టం చేశారు.2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5,42,985కి సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 2029-2034 నాటికి తలసరి ఆదాయం రూ. 10,55,000కి సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు.. నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. మెగా డ్రీమ్స్ ఉండాలి సంకల్పం ఉండాలి.. అప్పుడు సాధ్యమే అని చంద్రబాబు అన్నారు. విజన్ 2020 డాక్యుమెంట్ సాకారమయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదని చంద్రబాబు అన్నారు.ఖ భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా చేయాల్సిన అవసరం ఉంటుంది.సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నాం.. అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు ముఖ్యమే కానీ.. సమాజం గురించి కూడా ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావుఖ అని చంద్రబాబు అన్నారు. హైటెక్ సిటీ రాకముందు హైదరాబాద్ ఎకరం రూ.లక్ష ఉండేది.. ఇప్పుడు రూ.100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, అభివృద్ధితో భూమి విలువ పెరుగుతుంది. అమరావతి రైతులకు అన్యాయం జరగదు. అమరావతి అభివృద్ధి అనేది కంటిన్యూగా ఉంటుంది. అభివృద్ధిని కొంత మేరకే పరిమితం చేస్తే,అమరావతి ఓ చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుంది. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా మహానగరంగా మారుతుంది. గుంటూరు-విజయవాడ- తెనాలిగ్రామాలు కలిస్తేనే మహానగరంగా మారుతుంది. భూములిచ్చిన వారిని ఆదుకుంటాం..విస్తరణ విషయంలోనూ ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తాం. ఇప్పుడు ఉండే భూమి ఇప్పటికే సరిపోతుంది.. అవసరమైన మేరకు రైతులతో మాట్లాడి అమరావతిని అభివృద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీకి శ్రీకారం చుట్టాం... క్వాంటం కంప్యూటింగ్ కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టడానికి పలు సంస్థలు ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి... ఇంకొన్ని రాబోతున్నాయి.ఒకప్పుడు రాయలసీమలో 10 ఏళ్లల్లో 8 ఏళ్లు కరవు ఉండేది. ట్యాంకర్లల్లో నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి రాయలసీమలో ఉండేది. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం... కానీ నీళ్లను ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారింది. కోస్తా జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్డీపీలో టాప్ పొజిషన్లో ఉంది. హార్టికల్చర్ సాగు వల్లే ఇది సాధ్యం.నీళ్లు లేకపోయినా ఫర్వాలేదు.. రోడ్లు లేకపోయినా ఫర్వాలేదంటే..మనం ఇక్కడే ఉంటాం. పైగా వృధా జలాలను మాత్రమే బనకచర్లకు వినియోగించుకుంటామని చెబుతున్నాం. పెద్ద పెద్ద సంస్థలన్నీ సొంత డబ్బులతో పెడుతున్నారా? బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకుంటున్నారు.పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వం కూడా అదే తరహాలో ప్రాజెక్టులు చేపడుతోంది. చిన్న చిన్న విషయాల్లో ఆలోచనలతోనే ఆపేస్తే ఇక్కడితోనే ఆగిపోతాం. ఇంజనీరింగ్ కాలేజీల విషయంలో నాడు నేను తీసుకున్న నిర్ణయాల వల్లే రైతు కూలీల పిల్లలు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు అయ్యారు. పలు అంశాలపైన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

# వచ్చే మూడేళ్లలో అన్ని ఇళ్లకు మంచినీరు

>> అమలు చేస్తున్న చెత్త నిర్వహణపై అమలు చేస్తున్న విధానాలు ఇక్కడ కూడా అమలు చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. అందులో భాగమే రాష్ట్రంలో పెద్ద నగరాల్లో డంపింగ్ యార్డులు లేకుండ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి చెత్తను బర్న్ చేసి విద్యుత్ ను ఉత్పత్తి చేయగలుగుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. మృత స్కీం టెండర్లను త్వరలో పిలవనున్నామని మంత్రి నారాయణ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర డైరక్టర్లు తమ శక్తి మేర పనిచేయాలని, నూతన డైరక్టర్లు వారి ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్ మెంట్‌పై దృష్టి సారించాలని, చెత్త నుండి సంపద సృష్టి పై అవగా హన పెంచుకోవాలని సూచించారు.స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త మీద సైతం పన్ను వేసిందని, కాని కూటమి ప్రభుత్వం చెత్త పన్ను తొలగించి ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికే ఉందని నిరూపించిందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం,మంత్రి నారాయణ కృషితో దేశంలోనే అత్యంత ఉత్తమ నగరాలుగా మన రాష్ట్రంలోని ఐదు నగరాలు టాప్ లో నిలిచాయన్నారు. దీంతో జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న మన రాష్ట్ర పౌరులను 48 గంటలపాటు శ్రమించి మన రాష్ట్రానికి విజయవంతంగా తీసుకురాగలగటంలో మంత్రి లోకేష్ చేసిన కృషి మహోన్నతమైనదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్రకు పెద్దపీట వేస్తూ తాను సైతం స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిడమే కాకుండ కార్యక్రమం విజయవంతం చేయడంలో చూపుతున్న శ్రద్ధ ఎనలేనిదని కొనియాడారు. స్వచ్ఛ ఆంధ్ర సాధనలో అందరం ఒక కుటుంబంలా టీమ్ వర్క్ చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఒక విజన్ తో పనిచేస్తాడని, ఆయన ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. స్వచ్ఛత అనేది మన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛతా హీ సేవా అనే కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అలాగే ఈ నెల 25న ఎక్ దిన్, ఎక్ ఘంటా, ఎక్ సాత్ అనే కార్యక్రమం లో భాగంగా ప్రతి ఒక్కరూ శ్రమదానం చేయాలని కోరారు. అదేవిధంగా అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివాస్‌ను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.



శుక్రవారం తిరుమలలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు శ్రీవారి చిత్రపటం బహూకరిస్తున్న అదనపు ఇఒ వెంకయ్య చౌదరి

# దేశప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

## శ్రీవారి సేవలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమపథకాలతో భారతప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఆకాంక్షించారు. దేశప్రజలకు సేవలందించేందుకు మరింత శక్తిని ప్రసాదించాలని తిరుమలేశుని వేడుకున్నారు. దేశప్రజలు సిరిసంపదలతో,సుఖశాంతులతో వుండేలా ఆశీర్వదించాలని స్వామిని కోరుకు న్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. సామాన్యభక్తురాలిలాగే వైకుంఠం-1 క్యూకాంప్లెక్స్ నుండి మహాద్వారం వద్దకు విచ్చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, భానుప్రకాశ్‌రెడ్డి,డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్ స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ఆలయంలోనే కొద్దిసమయం గడిపారు.హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకులమం డపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.ఆలయ అర్చకులు, టిటిడిఅదనపు ఇఒ వెం కయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలుఅందజేశారు.శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహుకరించారు.

# అదుపులో డయేరియా

>> రాజరాజేశ్వరి పేటలో డయేరియా పూర్తిగా అదుపులో ఉందన్నారు.ఈ ప్రాంతంలో తాను పర్యటించానన్నారు.రోగపీడితులందరికి వైద్య అందుతుందన్నారు.అక్కడ నీటి కాలుష్యం వలన డయేరియా ప్రబలలేదని ప్రాథమిక నివేదికలు తెలిపాయన్నారు.ఆయినా మళ్ళీ నీటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డయేరియా వలన ఎవ్వరు మరణిం చలేదన్నారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామ దేవినేని వెంకటరమణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 100 పడకల విస్తరణ కోసం భూమి పూజ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) ఏపీ ప్రభుత్వ విప్, తంగిరాల సౌమ్యతో కలిసి చేసారు. శంకుస్థాపన శిలా పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పీపీపీ విధానంలో 10 వైద్య కళాశాలలను నిర్మిస్తుందన్నారు.గత సీఎం జగన్ మెడికల్ కళాశాల నిర్మిస్తామని ప్రకటించి,భవన వసతులు,ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా చేసారన్నారు.ఫలితంగా పలువురు విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వచ్చిందన్నారు.మెడికల్ కాలేజీల నిర్మాణానికి తమ ప్రభుత్వం పిలిచిన టెండర్లు ఆపే దమ్ము జగన్‌కు లేదన్నారు.వైద్య రంగానికి సీఎం చంద్రబాబు పూర్తి స్థాయిలో ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. అనతి కాలంలోనే నందిగామ హాస్పిటల్ అభివృద్ధిని శరవేగంగా పరుగులు పెట్టిస్తామని పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు అనునిత్యం అభివృద్ధి కోసం తనతో చర్చలు జరుపుతారని, ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ,ఈ ఆసుపత్రి శంకుస్థాపన 1998 సెప్టెంబర్ 10న జరిగిందని, ఆనాటి శాసనసభ్యులు స్వర్గీయ దేవినేని వెంకటరమణ దూరదృష్టి మరియు ప్రజాసేవా భావనతో ఈ ప్రాజెక్ట్ మొదలైందని గుర్తు చేశారు. దేవినేని ప్రయత్నాలతో డివిఆర్ గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ నిర్మాణం మొదలైంది. కానీ, దురదృష్టవశాత్తు వారు మరణించిన తర్వాత, 1999 డిసెంబర్ 2న ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగింది. ఆనాటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దీనిని ప్రారంభించారని తెలియజేశారు. ముఖ్య అతిథిగా అప్పటి విజయవాడ పార్లమెంట్ సభ్యులు గద్దె రామ్మోహన్ రావు గారు హాజరయ్యారు అని ఆమె తెలిపారు. గత వైసీపీ పాలకుల రాక్షస పాలన కారణంగా 100 పడకల ఆసుపత్రి ప్రాజెక్ట్ అటకెక్కిందని, దానిని తిరిగి ఈ రోజు శంకుస్థాపన చేయడానికి ముఖ్యంగా సహకరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎంపీ కేశినేని శివనాద్ చిన్నికి పేరుపేరునా ధన్యవాదాలన్నారు. ఎంపీ కేశినేని శివనాద్ చిన్ని మాట్లాడుతూ, తన సోదరి తంగిరాల సౌమ్య హాస్పిటల్ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఆమె అని నిత్యం అభివృద్ధికై తన ప్రజల యోగక్షేమాల కోసం పరితపిస్తారు. ఇటువంటి నేత ఉండటం అదృష్టం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి,లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, పిట్టల శ్రీదేవి, వివిధహోదాల్లోగల కూటమి నేతలు, ఆసుపత్రి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హాస్పిటల్‌లో రాబోయే కాలంలో కావలసిన సదుపాయాలు, వసతులనిమిత్తం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య లేఖతో కూడిన వినతి పత్రాలను మంత్రికి అందజేసారు.

## వారం - వర్జ్యం

13-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
షష్ఠి ఉ.7.24, సప్తమి తె.4.05
కృత్తిక ఉ.10.12
వర్జ్యం : రా.1.12-2.43
దు.తె.5.56-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థికంగా చెప్పుకోదగిన లాభాలు ఉండకపోయిన లోటు వుండదు.

**వృషభం :** సంతాన పరంగా విశేష శ్రద్ధను కనబరుస్తారు. ఖర్చులు అదుపు చేయలేకపోతారు.

**మిథునం:** బంధువుల రాకపోకలు, పూర్వం మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవలసిన రావల్సివస్తుంది.

**కర్కాటకం :** బాధ్యతలు వరుసగా నిర్వహించవలసి రావడం ఆర్థికంగా వెనుకబాటుకు కారణం అవుతాయి.

**సింహం:** అధిక ప్రయోజనాలు కలిగి చౌకగా వచ్చే వస్తువులను కొనుగోలు చేస్తారు.

**కన్య :** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**తుల :** ఎంతటివారినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు. వస్త్రాల కొనుగోలు.

**వృశ్చికం:** సన్నిహితుల సాయంతో ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**ధనుస్సు:** చాకచక్యంగా శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. శుభవార్తలు.

**మకరం:** నూతన పెట్టుబడులకు తగిన సహాయం అందుతుంది. అనుకోని విధంగా కాంట్రాక్టులు దక్కుతాయి.

**కుంభం:** తగాదాలకు, వివాదాలకు దూరంగా ప్రశాంతతంగా కాలం గడుపుతారు.

**మీనం :** ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేదాంత ధోరణి అలవరచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎరువుల కొరతలేదు

>> రవాణా దశలోఉందన్నారు. 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా పలు పోర్టులు, తయారీసంస్థల ద్వారా రాష్ట్రా నికి సెప్టెంబర్ నెలాఖరకు చేరుకుంటాయని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించిన కేంద్రం రాష్ట్రానికి మరో 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారని, ఈనెల 15 తేదీ నుండి 22వ తేదీ లోపు విశాఖపట్నం పోర్టుకు యూరియా చేరుకుంటుందని తెలిపారు. ఈ యూరియా నిల్వలతో కరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా అందరికి లభిస్తుందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరయా కొరత అనే మాట వినిపించదని అచ్చెన్నాయుడు అన్నారు.

# నేతన్నలకు ఆప్కో బకాయిల చెల్లింపు

>>రూ.61,07,690లు, విజయవాడ డివిజన్లో ఉన్న 21 సొసైటీలకు రూ. 48,29,780లు చెల్లించారు.తిరుపతి డివిజన్లో ఉన్న 17 సొసైటీలకు రూ.36,64,628 లు, కడప డివిజన్లో ఉన్న 5 డివిజన్లకు రూ.40,30,894లు బకాయిలు విడుదల చేశారు. కర్నూలు డివిజన్ లో ఉన్న ఏడు సొసైటీలకు రూ.2,98,472ల మొదటి విడత బకాయిలు చెల్లించారు.

# జగన్ మాటల్లో ఆలోచన శూన్యం

>> సవాళ్ళయిన తట్టుకునే దిశలో ఉందన్నారు.చంద్రబాబు ఏపీ అభివృద్ధిని గాడి పెటా ్టరన్నారు.ఆయన తీసుకునే ప్రతి నిర్ణయానికి కూటమి పక్షాలు సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు.ప్రతి అంశంలోనే చంద్రబాబు సమన్వయంతో వ్యవహరిస్తారన్నారు.

# లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

## మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి మొబైల్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కి పంపేందుకు ఏసీబీ కోర్టు అనుమతి

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ కీలక నేత నారాయణ స్వామి మొబైల్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కి పంపేందుకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో నారాయణ స్వామి కాల్ డేటాతో పాటు, బ్యాంక్ లావాదేవీలపై ఫోకస్ పెట్టారు సిట్ అధికారులు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు నారాయణ స్వామి. ఇప్పటికే లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి నారాయణస్వామిని విచారించారు సిట్ అధికారులు. నారాయణ స్వామి మొబైల్‌లో కీలక ఆధారాలు లభిస్తాయని సిట్ అధికారులు. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్ట్ కోసం ఎదురు చూస్తున్నారు.ఇక ఈ కేసులో నారాయణ స్వామిని సిట్ అధికారులు మూడు సార్లు వరకు వర్చువల్‌గా విచారణ జరిపారు.ఈ సందర్భంలో సిట్ విచారణకు సహకరిస్తానని స్వామి వెల్లడించారు, విచారణ సందర్భంగా నారాయణ స్వామి తమకు సహకరించలేదని,డొంక తిరుగుడుగా మాట్లాడారని సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో సిట్ అభ్యర్థన మేరకు స్వామి మొబైల్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కి పంపేందుకు ఏసీబీ కోర్టు అనుమతించింది.

## మరో మూడు రోజులు వర్షాలు

**విజయవాడ,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మీదుగా సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేశారు. దీని ప్రభావంతో రాబోయే రెండు ,మూడు రోజుల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఇది పశ్చిమ వాయవ్యదిశగా పయనించేఅవకాశం ఉన్నట్లు తెలిపారు.అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## తురకపాలెం మరణాలపై వారంలోగా నివేదిక అందజేయాలి

### అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సమగ్ర నివేదికను వారంలోగా అందజేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. తురకపాలెంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని సూచించారు. తురకపాలెంలో నమోదైన వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. ఎ.ఎన్.ఎం.లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లే సమయంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే ఆ సమాచారం జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర అధికారులకు వెంటనే అందే వ్యవస్థ (సర్వైలెన్స్) ను శాఖాపరంగా పటిష్టం చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, వాటి ఫలితాల గురించి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు వివరించారు. తురకపాలెంలో 2018 మంది 18ఏళ్లు పైబడిన వారున్నారు. వీరిలో 1,501 మంది స్థానికంగా ఉన్నారు. ఉన్న 1501 మందికి 42 రకాల పరీక్షలు చేశాం. 1,501లో 109మంది జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించాం.

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

Published from Ongole,Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు
13-9-2025
శనివారం సంపుటి: 31 సంచిక: 223
పేజీలు: 12
వెల: 6.50

## రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో
# ప్రజలకు భాగస్వామ్యం



### ఏ వ్యవస్థను ప్రైవేటుకు అప్పగించడం లేదు..
### నాలుగోసారి కూడా ప్రధాని మోడీయే..
### గుంటూరు, విజయవాడ, తెనాలి గ్రామాలు కలిస్తేనే అమరావతి మహానగరం
### వచ్చే దశాబ్దంలో అద్భుతాలు జరుగుతాయి: సీఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏవ్యవస్థను తాము ప్రైవేటు రంగానికి అప్పగించడం లేదని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.పీపీపీ విధానం అంటే ఆయా రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యం,అంటే ప్రజా సహకారం తీసుకుంటున్నారు.పీపీపీ పద్దతిలో ఏదీ చేసినా అధిపత్యం,నిర్వహణ ప్రభుత్వానిదన్నారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నామన్నారు.మెడికల్ కాలేజీలు కట్టకుండా కట్టేశామని చెబుతున్నారు. మేం వైద్యకళాశాలను ప్రైవేట్ వారికి అప్పజెప్పడం లేదు. పీపీపీ పద్ధతినే నిర్మాణం చేపడుతున్నాం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. నిర్వహణ ప్రభుత్వానిదేనన్నారు. భారతదేశానికి నాలుగోసారీ ప్రధానిగా నరేంద్ర మోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగుతాయని ఆయన అన్నారు. చంద్రబాబు తన మాటల్లో ఇలా వివరించారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ సామాజిక మీడియాసంస్ద నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయస్థాయిలో వికసిత్ భారత్2047, రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్లను సిద్ధంచేశామని తెలిపారు. తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్1 అవుతుంది. ఇందులో >>2



శుక్రవారం ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రపతి ముర్మకు అభివాదంచేస్తున్న దృశ్యం

## భగవంతుని సాక్షిగా..
## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
# పదవీ స్వీకారం
### ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

**హాజరైన ముఖ్యుల్లో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, జెపి నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతులు ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హాజరుకాని రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** దేశ 15వ ఉపరాష్ట్రపతిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిపిరాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారంచేసారు. రాష్ట్రపతిభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాధాకృష్ణన్‌చేత ప్రమాణం చేయించారు. ఎర్రటికుర్తాలో అక్కడకు చేరుకున్న రాధాకృష్ణన్ ఇంగ్లీష్‌లో భగవంతునిసాక్షిగా ప్రమాణం చేసారు. 67ఏళ్ల రాధాకృష్ణన్ ఎన్డీయే అభ్యర్థిగా >>2



# నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీలా కర్కి

### కొద్దిమంది మంత్రులతో వెంటనే ప్రభుత్వం ఏర్పాటు
### వచ్చే మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు

**ఖాట్మండు, సెప్టెంబరు 12:** నేపాల్‌లోనెలకొన్న జెన్‌జడ్ కల్లోలానికి తెరపడుతోంది. ఉద్యమకారులు ప్రతిపాదించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కినే తాత్కాలిక ప్రధానమంత్రిగా ఎంపికచేసారు.ఉద్యమకారుల్లో చీలికలు వచ్చినప్పటికీ సుశీలాకర్కి పేరుకు మెజార్టీ మద్దతు లభించడంతో అధ్యక్ష భవన్‌లో అత్యవసరంగా జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రామచంద్రపౌడేల్ ప్రధానిగా కర్కి చేత ప్రమాణం చేయించారు. రాత్రి 9.30గంటలకు ఆమె ప్రమాణ స్వీకారం చేసారు. కొద్దిమంది మంత్రులతో ఆమె ప్రభుత్వంకూడా ఏర్పాటుచేసారు. ఆ వెంటనే కేబినెట్ సమావేశం నిర్వహించి వచ్చే ఏడాదే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా చీఫ్‌జస్టిస్‌గా పనిచేసిన మహిళ గానే కాకుండా నేపాల్‌కు మొట్టమొదటి మహిళాప్రధానమంత్రిగా ఇపుడు సుశీల కర్కి రికార్డు నమోదుచేసారు. వచ్చే ఏడాది అంటే 2026 మార్చి ఐదవ తేదీ నేపాల్ సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. అధ్యక్షుడు రామచంద్రపౌడేల్, ఉపాధ్యక్షుడు రామ్‌సహాయ్‌యాదవ్, చీఫ్‌జస్టిస్ ప్రకాష్ మాన్‌సింగ్ రావత్‌లు కూడా ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అధ్యక్షుడు పౌడేల్, ఆర్మీచీఫ్ జనరల్ అవోక్‌రాజ్ సిగ్డేల్, జన్‌జెడ్ నిరసన ఉద్యమకారుల ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయానికి రావడంతో సుశీలాకర్కిపేరును ప్రధానిగా ప్రకటించారు. గడచిన వారం రోజులనుంచినిరంతరాయంగా జరుగుతున్న ఉద్రిక్తతలు, హింస, ప్రభుత్వ,మంత్రులు,ప్రజాప్రతినిధుల కార్యాలయాలు దగ్ధమయ్యాయి.



## జగన్ మాటల్లో ఆలోచన శూన్యం
### డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆలోచనా శూన్యతతో మాట్లాడుతున్నారని ఏపీడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆయన ప్రజలు ఇచ్చిన తీర్పును సైతం గౌరవించలేని స్ధితిలో ఉన్నారన్నారు. వైసీపీ అధినేత జగన్‌పై బడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ఢిల్లీలో శుక్రవారం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.అస్సలు జగన్‌కు రాజ్యాంగంపై గౌరవం ఉన్నట్లు లేదన్నారు. శాసనసభకు జగన్ రాననంటున్నారు కదా అని మీడియా ప్రశ్నిస్తే అసెంబ్లీకి రానని జగన్ చెప్పారా? అసెంబ్లీకి రాకపోవడానికి వైసీపీకి ప్రత్యేక రాజ్యాంగం ఉందేమో?నని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.రాజ్యాంగంపై గౌరవం లేదు.ప్రజల మంచి చేయాలనే ఆలోచన లేదు.అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజల క్షేమంపై లేదన్నారు.ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఆయన సద్వినియోగం చేసుకోలేదన్నారు.అందుకే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు.జగన్ ప్రతిపక్ష హోదా సాధించలేకపోయారని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అంతర్జాతీయంగా ముందుకు దూసుకుని వెళ్తుందన్నారు. ఎటువంటి >>2

# ఎరువుల కొరతలేదు
### మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎరువులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. నేడు ఆయన విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఏపీ,పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్ని రకాల ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా,రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు,డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుం టామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. రైతులసమస్యలు వెంటనే పరిష్క రించేలా జిల్లాకలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నా రని తెలిపారు.రాష్ట్రంలోని సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. వివిధపోర్టుల నుండి, తయారీ సంస్థల నుండి 29,236,మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు >>2

# అదుపులో డయేరియా



శుక్రవారం నందిగామలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఎంపి కేశినేని చిన్ని, విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తదితరులు

### ఆ వ్యాధితో ఎలాంటి మరణాలు లేవు..
### ఆరోగ్యరంగంలో ప్రయోగాత్మక సంస్కరణలు
### పిపిపి విధానంలో 10 వైద్యకళాశాలలు
### నందిగామలో 100 పడకల ఆస్పత్రికి మంత్రి సత్యకుమార్ శంకుస్థాపన

**విజయవాడ,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆరోగ్యరంగంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేసారు.క్షేత్రస్ధాయి నుంచి బోధనాస్పత్రుల వరకు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. వైద్యరంగంలో మందులకు కొరత లేదన్నారు. తరుణ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో విలేజీ క్లినిక్‌ల నుంచి పీహెచ్‌సీలు,సీహెచ్‌సీలు,ఏరియా ఆస్పత్రులకు అత్యాధునీక భవన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.తురక పాలెంలో అనారోగ్య సమస్యలు.పలువురి మృతిగల కారణాలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిందన్నారు. అక్కడిప్రజలకు అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నామన్నారు.నివేదికలు రాగానే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడ >>2

## నేతన్నలకు ఆప్కో బకాయిల చెల్లింపు

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేతన్నలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. తాజాగా చేనేతలకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిల్లో 20 శాతం మేర చెల్లించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు రూ.2,00,32,615.41లను ఆప్కో అధికారులు శుక్రవారం విడుదల చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన సీఎం

### మొదటి విడతగా రూ.2కోట్లు పైగా ఇస్తాం: మంత్రి సవిత
### 7 డివిజన్లలో 84 సొసైటీల బ్యాంకు ఖాతాల్లో బకాయిల జమ



చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చింది. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచేలా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చేనేత బజార్లు నిర్వహిస్తోంది. టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకుంది. 93 వేల చేనేత కుటుంబాలుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 11,488 మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తోంది. 50 ఏళ్లు నిండిన 92,724 మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. ఆప్కోకు వస్త్రాలు విక్రయించే నేతన్నలకు అయిదు శాతం జీఎస్టీ మినహాయిస్తోంది. ప్రస్తుత ట్రెండ్ కు అనుగుణంగా రెడీమేడ్ దుస్తుల తయారీలో శిక్షణిస్తూ, ఉత్పత్తులను ఆప్కో, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. కేవలం 15 నెలల కాలంలో నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా, గౌరవప్రదమైన జీవనం సాగించేలా కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రూ.2 కోట్లకుపైగా బకాయిల చెల్లింపు: రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కార్యక్రమాలు చేపడుతూనే, ఆప్కో ద్వారా బకాయిలు కూడా చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 84 చేనేత సొసైటీల నుంచి ఆప్కోవస్త్రాలను కొనుగోలు చేస్తుంటుంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసే వస్త్రాలను ఆప్కో షోరూమ్ లు, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాలు జారీచేశారు.తక్షణమే ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిలను చెల్లిం చాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.మంత్రి ఆదేశాలకనుగుణంగా మొదటి విడతగా ఆప్కో అధికారులు రూ.2,00,32,615.41లను శుక్రవారం విడుదల చేశారు. ఈ నిధులు ఆయా చేనేత సొసైటీల ఖాతాల్లో జమకానున్నాయి. రాష్ట్రంలో ఏడుడివిజన్లలో 84 సొసైటీలు ఉన్నాయి. ఆ సొసైటీలకు మొదటి విడతగా రూ.2,00,32,615.41లబకాయిలు చెల్లించారు.శ్రీకాకుళం డివిజన్లలో ఉన్ననాలుగు సొసైటీలకు రూ.7,57,142లు, విజయనగరం డివిజన్లలో ఉన్న ఏడుసొసైటీలకు రూ.3,44,007ల బకాయిలు విడుదలచేశారు. రాజమండ్రి డివిజన్లో 27 సొసైటీలకు >>2

### బిసిల రక్షణ చట్టం
## కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



### మంత్రి వాసంశెట్టి సుభాష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** బీసీల రక్షణ చట్టం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ ప్రభ్నుత్వ కట్టుబడి ఉందని, విష ప్రచారాలను చేయడంలో వైసీపీ విష వృక్షంగా తయారైందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవా చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రెస్ క్లబ్లో ఆయనమీడియాతో మాట్లాడుతూ >>2

# వచ్చే మూడేళ్లలో అన్ని ఇళ్లకు మంచినీరు



### రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా మార్చడానికి ప్రజల్లో చైతన్యం రావాలి: మంత్రి నారాయణ

**విజయవాడ,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకార మహోత్సవం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగింది. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిధిగా హజరైన మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రగా మార్చాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని, ఎవరికి వారు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రాష్ట్రమంతా స్వచ్ఛత నెలకొంటుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీల్లో ముందుగా స్వచ్ఛమైన తాగునీరు, సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, లైట్లు, రోడ్లు ఇలా 18 రకాల సేవలు అవసరమని, ప్రజలు అందరికీ ఈ సేవలను అందించడానికి సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీల్లో వచ్చిన ఆదాయంలో సగం గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే సరిపోతుందని, అయినా దార్శనికుడైన సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజలకు సుపరిపాలన అందించగలుగుతున్నామని తెలిపారు.రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు గతేడాది అక్టోబర్ 2న ప్రారంభించడం జరిగిందని, అప్పటికే గత ప్రభుత్వం వదిలివెళ్లిన 85లక్షల టన్నుల చెత్తను ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి క్లియర్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం జరిగిందన్నారు. అంత పెద్ద మొత్తంలో చెత్తను క్లియర్ చేయడానికి కనీసం రెండు, మూడేళ్లు పడుతుందని, కాని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీల సహకారంతో ఇప్పటికే 81 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడం జరిగిందని వివరించారు. మరో 20 రోజుల్లో మొత్తం చెత్తను క్లియర్ చేసి అక్టోబర్ 2 నాటికి లక్ష్యాన్ని నూరు శాతం చేరుకుంటామన్నారు. జపాన్, రష్యా, చైనా, ఇలా నేను ఏ దేశం వెళ్లినా మొదట సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిర్వహణను పరిశీలిస్తానని తెలిపారు.ఆయా దేశాలు >>2

వార్త

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకిరాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏం చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.

-నెహ్రూ

# ఓటర్ల సవరణకు 'సర్' కొత్తదారి!

సర్వసత్తాక ప్రజాస్వామిక దేశంలో ప్రజలు ఓటింగ్ హక్కులను కాపాడే సమగ్ర ఓటర్ల జాబితా తప్పక ఉండాల్సిందే. కానీ రాజ్యాంగ సంస్థగా ఎన్నికల కమిషన్ ఏర్పాటైన నాటి నుంచి ఇంతవరకు ఓటర్ల జాబితాలు కాలానుగుణంగా మారుతూనే ఉంటాయి. దేశకాలమాన పరిస్థితుల ఆధారంగా ప్రతి ఒక వయోజనునికి ఓటు హక్కు ఉండితీరాల్సిందేనన్న లక్ష్యంతో ప్రతి ఎన్నికల సందర్భంలోనూ ఓటర్ల రివిజన్ కొత్త ఓటర్లు చేర్పు చిరునామాల మార్పు, కూర్పు వంటి విషయాల కోసం ప్రత్యేక రివిజన్లు, విస్తృత ఓటర్ల జాబితాలు రూపకల్పన జరుగుతూనే ఉంటుంది. అదొక నిరంతర ప్రక్రియ. ఎప్పటికప్పుడు అదొక సమగ్ర ఓటర్ల జాబితాయే. కాగా తాజాగా ఎన్నికల సంఘం బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్రసవరణ (ఎస్‌ఐఆర్) పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి కొన్ని ప్రత్యేక నియమనిబంధనలు చేర్చింది. ఇలాంటి కార్యక్రమాలను ఎన్నడూ రాజకీయ పార్టీలు అడ్డు చెప్పలేదు. చెప్పగలిగిన సందర్భాలూ లేవు. ఎన్నికల కమిషన్ తనపని తాను చేసుకునిపోతుందనే ఓ దృఢఅభిప్రాయంతో రాజకీయ పక్షాలు ముందుకు సాగిపోయేవి. కాగా తాజాగా బీహార్‌లో తాజా సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలు సామాన్య ఓటరుకి అసౌకర్యంగా ఉందనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు వెలువడ్డాయి. అభ్యంతరాల వెంట ఆరోపణలు కూడా. 68లక్షల మంది ఓట్లు గల్లంతు చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల సంఘం ఎన్‌డిఏ పార్టీ పనుపున జాబితా రూపకల్పనలో అసాధారణ నియమాలు పెట్టిందని ఆరోపించాయి. చివరకు పేచీ దేశ అత్యున్నత ధర్మాసనం ఎదుటకి చేరి ఉభయ వర్గాలకూ మందలింపులు జరిగాయి. అయినా ఇంకా వివాదం పూర్తిగా ఓ కొలిక్కి వచ్చిందని చెప్పలేం. ఈ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఆర్) చేపట్టేందుకు ఎన్నికల సంఘం ప్రణాళికలు వేస్తోంది. నిజానికి ఇలాంటి ఓటర్ల సర్వే కార్యక్రమాలు భారతదేశ జనాభాకు కొత్తేమీ కాదు. వలస వెళ్లిన ఓటర్లు చిరునామాలు, వారు ఓటు వేసే నియోజకవర్గాలు మారతాయి. ప్రతి ఓటరుకీ ఓటు హక్కు ఎక్కడికీపోదు. తాత్కాలిక కూలి పనులకో, సంచార జీవనానికి అలవాటుపడినవారికో వారి స్వస్థలాల్లోనే ఓట్లు నమోదై ఉంటాయి. ఓట్ల ప్రాంతీయ బదలీలలో కూడా సంబంధిత ఫారమ్‌లలో పూర్తిగా వివరాలన్నీ నింపి ఇచ్చినా కొన్ని చోట్ల ఆ ఓటర్ల పాత ప్రాంతాల్లో ఓట్లు తొలగించకుండా కొత్త ప్రాంతాల్లో ఓట్లు అమల్లోకివచ్చేస్తాయి. ఇక్కడే ఓటర్ల జాబితా తప్పుల తడక అనో, రెండేసిచోట్ల ఓటరు కార్డులు అమలులో ఉన్నాయనో ఆరోపణలు వస్తుంటాయి. ఎన్ని కార్డులున్నా ఒకే ఓటు వేయగలరు.

ఇలాంటి అంశాలనే క్రోడీకరించుకుని కేంద్రప్రభుత్వం 'ఒకే దేశం ఒకే ఓటు'అన్న నినాదాన్నిచ్చింది. అందుకోసం తమ ఓటర్ల నమోదు ప్రక్రియలో తమవంతు భాగస్వామ్యం ఉండేట్లు చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక ఓటరుదీ! ఈఅంశం మీద జాతిలో చైతన్యం రావాల్సి ఉంది. ఎన్నికల సంఘానికి శేషన్ వంటి మహాశయులు అందించిన మార్గదర్శకాలు, సూచనలు అన్ని ఆచరణాత్మకమైనవే. అనుసరణీయమే. తాజాగా ప్రస్తుతం ఎన్నికల సంఘం కేవలం కేంద్ర పాలకుల అడుగులకు మడుగులొత్తే దిశగా 'సర్' నిబంధనలు రూపొందించిందని, ఆ నేపథ్యంలోనే బీహార్‌లో తమకు సానుకూలమైన ప్రజల ఓట్లు గంపగుత్తగా తొలగించారన్న ఆరోపణలు విన్నాము. బీహార్ విషయంలో అటు ఎన్నికల సంఘమూ, కాంగ్రెస్ తదితర విపక్షాలు బాధ్యతారహితంగా వ్యవహరించాయని సుప్రీంకోర్టు దుయ్యబట్టింది. దేశవ్యాప్తంగా 'సర్' ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలెట్టేస్తే కేవలం బీహార్ ఎన్నికల కోసమే సవరణ ప్రక్రియ మొదలెట్టారన్న ఆరోపణలకు చెక్ బెట్టడం కోసమా?అన్నట్లు ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాలకూ కేంద్ర పాలిత ప్రాంతాలకూ విస్తరిస్తూ 'సర్' బాధ్యతను తలకెత్తుకుంది. సాధారణ స్థాయిలో చాపకింద నీరు చందాన జరిగిపోయే విస్తరణ, సవరణ, ప్రక్రియ జరపాల్సిన ఎన్నికల సంఘం తనప్రత్యేక ఆలోచనలతో ముందుకెళ్లడం విమర్శనాత్మకంగాఉంది. ఓటరు దరఖాస్తు లేకుండా వారి తరపున వీధులకెక్కుదామనుకున్న విపక్షాల తీరును ఎండగట్టినట్లే, ఆధార్ గుర్తింపు కార్డును అనుమతించని ఎన్నికల సంఘం ధోరణినీ సుప్రీం సరికాదంది. బీహార్ పరిస్థితులు చక్కబరచకుండా ఆఘమేఘాల మీద కేంద్ర ఎన్నికలసంఘం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టొరల్ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం నాడు ఢిల్లీ వర్క్‌షాప్‌లో 'సమగ్ర సవరణ' నిర్వహణకు ఆమోదముద్ర వేసింది. అక్టోబరు 1నుంచి ఇందుకోసం సన్నద్ధమవ్వాలని సూచించింది. నిర్దిష్ట విధానాలను క్రోడీకరించకుండా ఈ నిర్ణయం తీసుకుని ఉంటే మళ్లీ బీహార్ తకరారుతప్పదు. రాష్ట్రాల వారీవివాదాలు తలెత్తకుండా సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలకు లోబడి సమగ్ర ఓటర్లు సర్వే, విశ్లేషణ ప్రక్రియ మొదలుకావడం అత్యవసరం. వచ్చే యేడాది తమిళనాడు, ఒడిశా, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్ శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడం ఎన్నికల సంఘం విధి. గతంలోలా విపక్షాలపై సవాళ్లు, నోటీసులు, వంటి తీవ్ర చర్యల ప్రస్తావనలేకుండా ఎన్నికలసంఘం సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఇంతక్రితం అన్ని ఎన్నికల సంఘాల బాధ్యులు ఇదేపద్ధతిలో బాధ్యతలు నిర్వహించారు. వారి అనుభవాలే ప్రస్తుత ఇ.సి.కి అనుభవైక వేద్యమే!

> వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.



స్వామి వివేకానంద

> కొంతమందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడే వారు కాదు.



ఫ్రాంక్లిన్

## ప్రజావాక్కు



### నేపాల్‌లో పాలనా సంక్షోభం

**నేపాల్** ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత ( జెన్ జెడ్) చేపట్టిన దేశవ్యాప్త నిరసనలు తీవ్రరూపం దాల్చడం, వారిని అదుపు చేసేందుకు జరిపిన అణిచివేతలో ముప్పై మంది ప్రాణాలు కోల్పోవడం, వందల మంది గాయాలపాలు కావడం బాధాకరం. ప్రస్తుతం అక్కడి ప్రధాని రాజీనామా చేయడం, సైన్యం పరిస్థితిని అదుపులోకి తీసుకోవడంతో కొంతమేరకు శాంతినెలకొంది. సామాజిక మాధ్యమాల్ని ప్రభుత్వం నిషేధించడం, తమ స్వేచ్ఛను నిరోధించడంలో భాగంగా యువత భావించడంతో ఉద్యమం మరింత ముదిరిపోయినా, అంతకు మించి ఎన్నాళ్లుగానో తమలో గూడుకట్టుకున్న అసంతృప్తి, విసుగు నిరసనలు అంతర్లీనంగా అసలుపాత్రవహించాయి. రాజకీయ పక్షాల కుప్రజల్లో పలుకుబడి తక్కువ. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడిన ముప్పైఏళ్లలో ముప్పైమంది పాలకులు మారారు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### దసరా సెలవులు ఈనెల 22 నుంచి ఇవ్వాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలలకు సెప్టెంబర్ 24తేదీ నుంచి ఇస్తున్నట్లు అకాడమిక్ క్యాలండర్‌లో తెలిపింది. కానీ సాధారణంగా దసరా పండుగ సెలవులు ప్రతీ సంవత్సరం స్కూళ్లకు మహాలయ అమావాస్య రోజు నుంచి ఇస్తారు. కానీ ఈ విద్యాసంవత్సరం మూడు రోజులు తగ్గించి దసరాసెలవులు అకడమిక్ క్యాలండర్‌లో చూపారు. ప్రభుత్వం సెలవులు కుదించడం తగదని పలు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. దసరా పండుగ సెప్టెంబర్ 22నుంచి ప్రారంభమవుతున్నది కాబట్టి ప్రభుత్వం స్కూళ్లకు దసరా పండుగ సెలవులు సెప్టెంబరు 22 నుంచి ఇవ్వాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### సినీ పరిశ్రమను విభజించాలి

**తెలుగు** రాష్ట్రాల విభజన జరిగింది కాబట్టి సినీ పరిశ్రమ కూడా విభజించాలి. తెలంగాణాకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఛాంబర్‌లు ఏర్పాటు చేయాలి. అలాగే అవార్డులను రెండు తెలుగు రాష్ట్రాలు ప్రత్యేకంగా ఇవ్వాలి. నటులు ఎక్కడైనా నటించవచ్చుకాని సినీపరిశ్రమలను మాత్రం విభజించాలి. ఆంధ్రప్రదేశ్‌లో స్టూడియోల నిర్మాణంసినిమాల నిర్మాణం జరగాలి. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### కృత్రిమ మేధస్సు ఉపయుక్తం

**ఈరోజు** వేగంగా మారుతున్న కాలంలో మనం చేసే సమావేశాలు చాలాసార్లు గందరగోళంగానే ముగుస్తున్నాయి. ఏ నిర్ణయం తీసుకున్నామో, ఏంచేయాలో స్పష్టంగా తెలియకపోవడం సాధారణం అయిపోయింది. ఇలాంటి సమయంలో కృత్రిమ మేధస్సు ఒక కొత్త ఆశగా మారుతోంది. ఇది మనం మాట్లాడిన విషయాలను సారాంశంగా రాసి పెట్టడం, ముఖ్యమైన నిర్ణయాలను గుర్తుంచుకోవడం, పదేపదే వచ్చే సమస్యలను చూపించడం చేస్తుంది. ఇలా చేయడంవల్ల సమయం కూడా ఆదా అవుతుంది, పనులు కూడా సులభంగా జరుగుతాయి. మన దేశంలో వ్యాపారాలు, కార్యాలయాలు అనేక ప్రాంతాల్లో, భిన్నమైన సమయాల్లో పనిచేస్తున్నాయి. ఈపరిస్థితుల్లో కృత్రిమ మేధస్సు చాలా ఉపయుక్తం. ఇది మన ఆలోచనలకు బదులు కాదు, కానీ మన పనులకు తోడ్పడుతుంది. దాంతో పెద్దలు నిజంగా ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టగలరు. మరి దీన్ని సరిగ్గా వాడితే, అంటే భద్రతా నియమాలు పాటిస్తూ, మన పనితీరులో కలపగలిగితే, సంస్థల పనితీరు ఇంకా మెరుగవుతుంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రజాస్వామ్యానికి అడ్డంకి కాకూడదు

**ఇటీవల** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌ల వైఖరిపై సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లినఅంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం రాజ్యాంగపరంగా సముచితం కాదని రాష్ట్రం స్పష్టం చేసింది. ప్రజాస్వామ్యంలో శాసనసభ అనేది ప్రజల సంకల్పానికి ప్రతిబింబం. ఆ సభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ తక్షణమే ఆమోదం తెలపాలి లేదా అభ్యంతరం ఉంటే తిరిగి పంపాలి. కానీ దీర్ఘకాలం నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేయడం పాలనా ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది ప్రజలమద్దతుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని నిలువరించే ప్రయత్నంగా మారుతుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

**విజయనగరం** జిల్లాలోని అన్ని గ్రామాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌ల్లో శునకాల బెడద తీవ్రంగా ఉంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాళ్లకు పాదచారుల వెంటబెడుతున్నాయి. కారు, స్కూటర్‌ల సీట్‌లను కొరికి పాడు చేస్తున్నాయి. కుక్కలకు సంతానోత్పత్తి కలగకుండా ప్రభుత్వం ఇంజెక్షన్‌లు చెయ్యాలి.

-శీరాపు శ్రీనివాసరావు, విజయనగరం

మన విని ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విస్తరిస్తున్న విష సంస్కృతి

**మమ్మీ డాడీ చదువులుంటే ఉండనివ్వండి వాటితోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను ప్రాథమిక స్థాయినుంచే పిల్లలు తెలుసుకునేలా విద్యావిధానంలోమార్పు తేవాలి. దశాబ్దాల తరబడి శ్రమించి వడబోసి రచించి జాతికి అందించిన వేమన, సుమతీ, నర్సింహా, దాసరి లాంటి శతకాలకు బోధనలో కాస్త చోటుకల్పించాలి. అలాగే సైబర్ కేఫ్ పబ్‌లు, నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ప్రభుత్వం ఉక్కుపాదంమోపాలి. ముందుగా చెవులు భరించలేని విధంగా శబ్దకాలుష్యాన్ని పరాకాష్ఠకు చేరుస్తూ ప్రజారోగ్యానికి చేటుతెస్తున్న డిజేలను పూర్తిగా నిషేధించాలి. పండగలన్నీ శుభప్రదంగా జరిగేలా చూడాలి. మాదకద్రవ్యాల వ్యాపారం విస్తరించేందుకు ఈ పండగలను ఉపయోగించుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పాలకులతోపాటు ప్రజలు, స్వచ్ఛందసంస్థలు ఇందులో భాగస్వామ్యం కావాలి. ప్రధానంగా తల్లిదండ్రులు తమపిల్లలు ఈ విషవలయంలో చిక్కుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు రావాలి. ఏది మంచో ఏది చెడో గ్రహించే విచక్షణాజ్ఞానం ఈ చదువులతోపాటు పెంపొందాలి. అందుకు విద్యాబోధనే కాదు పరిసరాలు కూడా ఎంతో దోహదపడతాయి. గతంలో రాజులు తమ కుమారుల విద్యాబోధన కోసం ఆశ్రమాలకు పంపించేవారు. ఇతర విద్యార్థులతో పాటు కలిసిమెలిసి చదువుకొని సాధ్యమైనంతవరకు తాము రాచబిడ్డలమనే రాజరిక ప్రభావం వారి మీద పడకుండా జాగ్రత్తపడేవారు. ప్రస్తుతం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందాం. విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అత్యంత ప్రతిభావంతులైన యువతీయువకులు అహర్నిశలు శక్తివంచన లేకుండా కృషిచేసి దేశ విదేశాల్లో గుర్తింపు తెస్తున్నారు. అందులో సందేహం లేదు. కానీ అదే సమయంలో పాశ్చాత్య మోజులోపడి మన సంస్కృతి, సంప్రదాయాలకు మంగళం పాడుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. జరిగిన, జరుగుతున్న పరిస్థితులు గమ నిస్తే రానురాను భారతీయ సంస్కృతి అదృశ్యమైపోతున్న దేమోననిపిస్తున్నది. మొన్న వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా కొందరు యువతీయువకులు చేసిన అల్లర్లు అంతా ఇంతా కాదు. వాహనాలపైనే దేవుడి ముందు వెర్రి గంతులు, వేసిన చిందులు, కేరింతలు, వెకిలి చేష్టలతో వెర్రి తలలు వేస్తున్న విషసంస్కృతి పరాకాష్ఠకు చేరిందని చెప్పొచ్చు. అసలు వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. ఈ ఆనందకేళిలో అదుపు తప్పి స్పృహ కోల్పోయినవారు కూడా ఉన్నారు. ఈసారి చెవులు బద్ధలయ్యే డిజే (డిస్కో జాకీ) శబ్దాలు పోలీసుల కృషితో కొంత తగ్గినా కళ్లు చెదిరే రంగురంగుల జిలుగు వెలుగులతో వారు చేసిన హడావిడి హంగామా అంతా ఇంతా కాదు. కొన్ని ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో రోగులుపడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. భరించలేని శబ్దాలు, గుండెరోగులకు, చెవుల సమస్యలున్నవారికి ప్రమా దకరమని డాక్టర్లే చెబుతున్నారు. ఎవరు ఎంత పెద్ద శబ్దాలు చేస్తే కళ్లుమిరిముట్లు గొలుపే లైట్ల కాంతుల్లో నాట్యం పేరుతో ఎంత కుప్పిగంతులు వేస్తే అంతగొప్ప అన్నట్లు తెగరెచ్చిపోయారు. అందరూ అలా చేశారని చెప్పడం లేదు. సంప్ర దాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనివారు కూడా ఎందరో ఉన్నారు. జంట నగరాలతోపాటు శివారు ప్రాంతాల్లో ఈ యేడాది దాదాపు రెండు లక్షల అరవైవేలకు పైగా విగ్రహాలు కొలువు తీరాయి. అందులో ఈ డిజేలతో హంగామా చేస్తూ లూజ్‌పేపర్ శాట్స్ ఇష్టానుసారంగా వెదజల్లుతూ కేరింతలు కొడుతూ అదే మన నాగరికత అని భావించి అందులో మునిగితేలుతున్నవారు పది, ఇరవై శాతం మందికంటే ఎక్కువ ఉండక పోవచ్చు. కానీ ఆ శోభాయాత్ర అంతా తమదైనట్లుగా విష సంస్కృతిని చూపిస్తున్నారు. ఈసారి వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందో బస్తు చేశారు. వేలాది మంది పోలీసు బలగాలు ఏకంగా నలభైగంటలకుపైగా భద్రతా ఏర్పాట్లలలో నిమగ్నమైనారు. రెండులక్షలా అరవై వేలకు పైగా విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా జరగడంలో పోలీసులు పాత్ర విస్మరించలేనిది. కాని రానురాను ఈ పాశ్చాత్య విషసంస్కృతి విస్తరించడం పట్ల సర్వత్రా ఆందోళనలు వ్యక్తమౌతున్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోనే కాదు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆ మాటకొస్తే దేశ వ్యాప్తంగా ఇదే తంతు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఇప్పుడు నగరాలను దాటి కుగ్రామాలకు సైతం దాటిపోతున్నది. జనజీవన స్రవంతిలో విలీనమై భాసిల్లుతున్న సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే కూచి పూడి,

## ఒక్క మాట

భరతనాట్యం, జానపద కళలు, పాశ్చాత్య నాగరికత వెల్లువలో ఆధునిక ముసుగులో క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. కళాసంస్కృతిని కాపాడుకోలేకపోతున్నామేమోననిపిస్తున్నది. గతంలో మనం వినాయక చవితికే కాదు దసరా, దీపావళి సంక్రాంతి ఇలాంటి పండుగలకు అన్నింటికి కూడా ఆయా ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే జానపద కళలు, పురాణాలతో, హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, నాటకాలు, పగటివేషాలతో ఎంతో ఆహ్లాదకరంగా నిర్వహించుకునేవారు. ప్రతి కళారూపం మన సంస్కృతికి అద్దం పట్టడమేకాక ప్రజలకు ధర్మాధర్మా వివేచన, ఆలోచనలో ఉజ్జీవనం పెంపొందించేందుకు ఉపయుక్తంగా ఉండేది. తాము వేసే ప్రతి అడుగులోనూ సంస్కృతీ నాగరికతల విశిష్టత పరిణామాలు గుబాళిస్తుండేవి. ప్రతిమాటలోనూ సభ్యతా సంస్కారాలు తొణికిసలాడుతుండేవి. ఇక దసరా గురించి చెప్పక్కర్లేదు. ముఖ్యంగా తెలంగాణలో అత్యంత ప్రధాన పండుగ కొన్ని రోజుల పాటు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. బతుకమ్మ పాటలు జనజీవనాన్ని అద్దం పట్టే విధంగా ఉంటాయి. ఒక్కొక్కరోజు ఒక్కోరకం పాటలు పాడుతూ ముఖ్యంగా మహిళలు ఆటపాటలతో అలరిస్తారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఎంతో ఆహ్లాదకరంగా గడుపుతారు. ఇక సంక్రాంతి అతి పెద్ద పండుగ. ఆంధ్ర ప్రాంతపు ప్రజలు నిర్వహిస్తారు. అక్కడ గొబ్బెమ్మ పాటలు, భోగిమంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు ఆటలు, పారువేటలతోపాటు ఎన్నో కళలు ప్రదర్శించేవారు. అలాంటి వాటిలో కొన్ని నేటికీ కొనసాగుతున్నా రానురాను కనుమరుగవుతున్నాయి. ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసే కోడిపుంజుల పోటీలు, పందాలు ఇప్పుడు ఒక జూదంగా మారిపోయింది. కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. మొత్తం మీద ఆనాటి కళలు అన్నీ కనుమరుగవుతూ వాటి స్థానంలో ఇప్పుడు డిస్కో, రికార్డింగ్ డాన్సులు ప్రత్యక్షమవుతున్నాయి. ప్రజల ముందు అంగంగ ప్రదర్శన చేస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు కూడా తమ హోదా, వయసు మరిచి స్టేజీలు ఎక్కి తైతక్కలాడుతూ జుగుప్సాకరంగా వ్యవహరిస్తున్నారు. పండగలైనా, శుభసందర్భాల్లోనే కాదు విషాద సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు కూడా ఇలాంటి కుప్పిగంతులు వేస్తున్నారు. పండుగల్లో మద్యం వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. పాలకులు కూడా ఈ పండుగలను తమకు ఆదాయవనరుగా మార్చుకుంటున్నారనే ఆరోపణను కొట్టివేయలేం. దసరా పండుగ దినాల్లో మద్యం రికార్డుస్థాయిలో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆ మత్తులో వారు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక గ్రామంలో జాతర సందర్భంగా అమ్మవారికి పొట్టేలును బలి ఇచ్చేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఆ మేరకు పొట్టేలును తీసుకువచ్చి అమ్మవారి ముందు నిలబెట్టారు. పొట్టేలును నరికే మనిషి పూర్తి మైకంలో తాను ఎవరిని నరుకుతున్నాడో తెలియని పరిస్థితిలో పొట్టేలుకు బదులు ఆ పొట్టేలును పట్టుకున్న యువకుడి తలను నరికివేశాడు. ఇలాంటి ఎన్నో విషాద సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వపరంగా కూడా మనసంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు అవసరమైన కృషి జరగడం లేదనే చెప్పొచ్చు. కొత్తగా ఇటీవల క్యాసినో సంస్కృతికి కూడా శ్రీకారం చుడుతున్నారు. పబ్‌లు, క్లబ్‌లు పెరిగిపోతున్నాయి. ఈ సంస్కృతి గతంలో పురుషులకే పరిమితమయ్యేది. క్రమేపీ యువతులు కూడా భాగస్వాములు కావడం ఆందోళన కలిగించే విషయం మధ్యతరగతి యువతీయువకులు ఏదో విధంగా వాటిలో ప్రవేశానికి ఆరాటపడుతున్నారు. ఇందులో మాదకద్రవ్యాలను చొప్పించడంతో యువత బలైపోతున్నది. అసలు మన సంస్కృతి, సంప్రదాయాల గురించి కార్యక్రమాలు జరగడం లేదని చెప్పొచ్చు. మమ్మీ డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి వాటితో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలు తెలుసుకునేలా విద్యావిధానంలో మార్పు తేవాలి. దశాబ్దాల తరబడి శ్రమించి వడబోసి రచించి జాతికి అందించిన వేమన, సుమతీ, నర్సింహా, దాసరి లాంటి శతకాలకు బోధనలో కాస్త చోటు కల్పించాలి. అలాగే సైబర్ కేఫ్ పబ్‌లు, నీలి చిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి. ముందుగా చెవులు భరించలేని విధంగా శబ్ధకాలుష్యాన్ని పరాకాష్ఠకు చేరుస్తూ ప్రజారోగ్యానికి చేటు తెస్తున్న డిజేలను పూర్తిగా నిషేధించాలి. పండగలన్నీ శుభప్రదంగా జరిగేలా చూడాలి. మాదకద్రవ్యాల వ్యాపారం విస్తరించేందుకు ఈ పండగలను ఉపయోగించుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పాలకులతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఇందులో భాగస్వామ్యం కావాలి. ప్రధానంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఈ విషవలయంలో చిక్కుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చివరిగా ఒక్కమాట వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించేది పిల్లలకు వారు ఇచ్చిన ఆస్తిపాస్తులు కాదు. సభ్యతాసంస్కారాలు. ప్రజల భాగస్వామ్యమే సంస్కృతి సంప్రదాయాలకు పరిరక్షణకు ఏకైక మార్గం. ●

# ఇంటికో ఇంకుడు గుంత ఇంకెప్పుడు!


పూసాల సత్యనారాయణ

భాగ్యనగరం సొగసులు చూడతరమా? ఒంపులు సొంపులతో వర్షాకాలాన్ని వాటేసుకుంది. రోడ్లు సెలఏరులై దుముకు చౌరస్తాలు నదులై పొంగి పొరలుజలదిగ్బంధనలో చిక్కి పోయేరు. మ్యాన్ హోల్స్‌లో మునిగిపోయేరు. ఆ దృశ్యాలు అదృశ్యం కాని చరిత్రలో నిలిచిన గాయాలు. శతాబ్దాలు గడిచినా రోడ్ల గతిఇంతేనా! ఇంతకు ప్రజలు ఎన్నుకున్న పాలకులు ఏమి చేస్తున్నట్లు. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడమేనా! ప్రజాధనం ఎక్కడ జారిపోతుంది. నీటి సమస్య సమస్యగానే ఉండిపోవాలా? ప్రజా సంక్షేమం కాలుష్య కోరల్లో చిక్కుకొని మరణం అంచున ఉండాలా? అరచేతిలో స్వర్గం చూపెట్టే ఈ రాజకీయ నాయకుల మత్తు ఎప్పుడు వదిలేది? ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వాడుకొని అమెరికాలోని రోడ్ల మాదిరిగా చేయలేరా? ప్రభుత్వ ఆదాయం కార్పొరేట్ దిగ్గజాల జేబుల్లోకి బడా నాయకుల ఇంటిలోకి పరుగులు పెడుతుందని సోషల్ మీడియా కోడై కూస్తుంది. తెలంగాణ రాష్ట్రసంపద మిషన్ భగీరథ పైపలలో లీకై అక్రమ నల్లా కనెక్షన్‌లతో వీకై నీటిఎద్దడి తీర్చేనా ! మరోపక్క జి.హెచ్.ఎం.సి అధికారులు నియమ నిబంధనలు తుంగలో తొక్కి అవినీతి పంట పండించి భవన నిర్మాణ కార్మికుల నిండుప్రాణాలు తీస్తున్నారే తప్ప ఇంటికో ఇంకుడు గుంత ఉండేలా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నారా? మచ్చుకైనా కానరాని అజమాయిషీ. నీటి వినియోగదారులలో కూడా ఆలోచన విధానం మారాలి. ఇంటి పైకప్పు నుండిపడే ప్రతివాన చినుకును ఒడిసి పట్టి ఇంకుడు గుంతలద్వారా భూమిలో ఇంకిపోయేలా చేయాలి. వాటర్ ట్యాంకర్లు ఇంకెందుకు? బహిరంగ ప్రదేశాలలో వర్షపు నీరుకు కళ్లెం వేసి గుంతలలోకి మళ్లిస్తే రోడ్లపైకి నీరు వచ్చేనా! చిన్న పెట్టుబడితో నీటి సమస్య పరిష్కారం అయ్యేది ట్యాంకర్లు తెప్పించుకొని లక్షలుఖర్చుపెట్టడం ఎందుకు? అదే డబ్బుతో పొదుపు చేయవచ్చు కదా ! మైండ్ సెట్ మారినప్పుడే ఫలాలు అందిపుచ్చుకోవచ్చు. సంస్కృతి, సంప్రదాయాల, పేరిట డబ్బు వృధా చేసేవారు, కల్తీఫుడ్ ఆన్‌లైన్‌లో తెప్పించుకొని రుగ్మతలు కొని తెచ్చుకొనువారు, లక్షలు ఖర్చు పెట్టీ పుణ్యక్షేత్రాలు దర్శించువారు, ప్రాణం నిలిపే నీటి కొరకు వర్షపు నీటిని ఒడిసిపట్టి ఇంకుడు గుంతలలోకి మరల్చలేక పోతున్నారే! ఇదేమీ విడ్డూరం! ప్రగతికి కడు దూరం. చెట్లు పెట్టిపోషించ లేరా? నీరు వృధా కాకుండా చూడలేరా? మరో వైపు చూస్తుంటే మన పాలకులు ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి ఉచిత పథకాలతో అప్పులుచేసి వడ్డీలు కడుతూనే ఉన్నారు. ప్రజల కిచ్చిన హామీలు నెరవేర్చలేక పథకాలు అమలు చేయలేక ప్రతిపక్షాలు ప్రశ్నించితే సరైనసమాధానం ఇవ్వలేక అయోమయ పరిస్థితిలో ఉండడం ప్రతిరోజుమనం దినపత్రికలలో చూస్తూనే ఉన్నాం. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలు జనజీవనాన్ని స్తంభింపచేసినాయి. గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాలు పొంగి పొరలినా భూగర్భ జలాలు ఇంకా అడుగంటే ఉన్నాయి. వెయ్యిఅడుగుల లోతు తవ్వినా బోర్లలో నీటి చుక్కఉంటే ఒట్టు. ఈ పాపం మనిషి చేసిందే కదా ! అడవులను నరకడం ఇష్టారాజ్యంగా బోర్లతో భూమి చిల్లులు చేయడం. ప్రకృతిని ఏడిపించడం మొదలైన వాటికి బ్రేక్ వెంటనే పడాలి. బాధ్యత ఒక్క ప్రభుత్వానిదే కాదు ప్రజలపై కూడా ఉన్నదన్న సంగతి మరచిపోరాదు. ఏదిఏమైనా భూగర్భ జలాలు అడుగంటకుండా చూడాల్సిన బాధ్యత జలమండలి పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లలో ఇంకుడు గుంతలు ఉంటేనే నల్లా కనెక్షన్‌తో క్యాన్ నెంబర్ కేటాయించబడుతుంది. చుట్టు పక్కల పడిన వర్షపు నీరు ఆ ఇంకుడు గుంతలోకి చేరే విధంగా పైపుల ద్వారా ఏర్పాటు చేయాలి. ●

# పిల్లలను నేరస్తులను చేస్తున్నదెవరు?

డాక్టర్ నీలం సంపత్

మన దేశం తరతరాలుగా మాతృ దేవోభవ ,పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అనే ఆర్యోక్తిని త్రికరణ శుద్ధిగా అమలు పరుస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి నిలువెత్తు నిదర్శనంగా కొనసాగుతున్న వైనం బహిరంగ రహస్యమే. నిన్న మొన్నటి వరకూ బలమైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తోడ్పాటుతో ప్రభుత్వ విద్యా వ్యాసంగం పునాదిగా పసితనం నుండే నేటి బాలలు అత్యున్నతమైన మానవీయ విలువలతో కూడిన రేపటి పౌరులుగా తీర్చిదిద్దబడేవారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. బాల్యంనుండి శైశవ దశకూ, ఆ తదనంతరం యుక్తవయస్సుకూ ఎదిగే పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తప్పులు చేస్తే వాటిని సరిచేస్తూ వారిలో సత్ప్రవర్తనకుఊపిరులూదుతూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కుటుంబ సభ్యులు ఎంతగానో కృషిచేసేవారు. ఆదర్శ సమాజంలో పిల్లల ఎదుగుదలపై సమాజం సైతం నిరంతర నిఘాని కొనసాగించేది. ఎక్కడైనా ఒకరో ఇద్దరో జన్యులోపాల రీత్యా ఒకటీ అరా తప్పులో, నేరాలో చేస్తే సదరు సమాచారాన్ని తల్లిదండ్రులకూ, కుటుంబానికి చేరవేయడం ద్వారా నాడే వారిని గుర్తించి భవిష్యత్‌లో అలాంటి తప్పులు మళ్ళీ చేయకుండా నిరోధించి మంచి నడవడికతో జీవించేలా తగు చర్యలను తీసుకోవడానికి వెనుకాడకపోయేదని చెప్పక తప్పదు. ఈ సమాజంలో ప్రతి మనిషికీ తల్లే తొలి గురువు. కుటుంబమే మొదటి పాఠశాల అనే నానుడి ఉమ్మడి కుటుంబాల్లో అక్షర సత్యంగా భావించబడేది. ఐతే నేటితరం పిల్లలకు ఈ సౌలభ్యం అందుబాటులో లేదనే చేదు నిజాన్ని జీర్ణించుకోక తప్పదు. వయస్సుతోపాటు వారిలో వచ్చేశారీరక, మానసిక మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సన్మార్గంలో నడిపించే గురుతరమైన బాధ్యతను నిర్వర్తించే ఉమ్మడి కుటుంబం దాదాపు అంతరించే దశకు చేరువలో వుంది. ఆకాశాన్నంటుతున్న ధరల్లో ఓ కుటుంబం తన కనీస అవసరాలను తీర్చుకోవాలన్నా భార్యాభర్తలు ఇద్దరూ ఏదో ఒక ఉద్యోగం చేయక తప్పడం లేదు. మరికొన్ని కుటుంబాలు మంచి సౌకర్యవంతమైన లేదా భోగ లాలసతతో కూడిన జీవనాన్ని గడపడం కోసం ఇద్దరూ ఉద్యోగాలు చేయడం తప్పని సరిగా మారుతోంది. ఇక మూడో కోవకు చెందిన కుటుంబాలు అత్యంత పేదరికంతో ఇద్దరి రెక్కాడితే గాని ఆ కుటుంబం ఆకలి తీరని పరిస్థితుల్లో వారి పిల్లలు ఇంటి వద్ద ఒంటరిగా జీవించాల్సివస్తున్న నేపథ్యంలో సాంకేతికత వెన్నుదన్నుగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లే అందరి పిల్లల సర్వస్వంగా మారిపోతున్నాయి. కోట్లున్న కోటేశ్వరుల దగ్గర నుండి మధ్యతరగతి వారే కాదు పేదవారు సైతం మొబైల్ ఫోన్లను స్టేటస్ సింబల్‌గా భావించి తమ పిల్లలకు వాటిని సమకూరుస్తున్నారు. తద్వారా పిల్లలు ఆన్‌లైన్‌కి అడిక్ట్‌అవుతూకొన్ని



సందర్భాలలో కొంత మంది పిల్లలు మొబైల్ కొనివ్వని తమ తల్లిదండ్రులను చంపుతుంటే మరికొంత మంది పిల్లలు మొబైల్ కోసం మారాం చేస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిన్న జగిత్యాల జిల్లాలో ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసగా మారిన పిల్లవాడిని వారించినందుకు ఆత్మహత్య చేసుకున్నవైనం ఈధోరణికి ఓ ఉదాహరణగా భావించకతప్పదు. కృత్రిమ మేధస్సు ఆవిష్కరణ తోడ్పాటుతో నేటి సమాజ పురోభివృద్ధికి విజ్ఞానపు గవాక్షంగా మారిన ఆండ్రాయిడ్ ఫోన్ దాని వినియోగదారులకు అది లేని మానవ జీవనమే అసాధ్యమనే స్థాయిలో వారి దైనందిన జీవనాన్ని ఎంతో సౌకర్యవంతంగా మార్చిందనేది తిరుగులేని సత్యమే. ఐతే నాణానికి మరో వైపుగా ఫోక్సో చట్టంతో పాటు హిందూ న్యాయ సంహిత తదితర చట్టాలను బేఖాతర్ చేస్తూ అంచనాలకు అందకుండా ఇంటర్ నెట్ ఓ ఘోర విలయాన్నే సృష్టిస్తోంది. స్మార్ట్ ఫోన్ సున్నితంగా టచ్ చేయడం ద్వారానో, లేదా అది కూడా కష్టమనిపిస్తే వాయిస్ కమాండ్ ద్వారానోమనిషిని మృగంగా మార్చే క్రైమ్ కంటెంట్‌తోపాటు అత్యంత జుగుప్సాకరమైన పోర్న్ సైట్‌ల ద్వారా, వాటితో సరిసమానమైన అశ్లీలాన్ని ప్రసారం చేస్తున్న నెట్‌ఫ్లిక్స్, ఓటిటిలూ, క్రైమ్ సీరియళ్లు తమకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆండ్రాయిడ్ స్క్రీన్‌పై నాట్యం చేస్తూ ఆకర్షిస్తుంటే వాటిని చూస్తున్న పిల్లల మనస్సుల్లో విషం నిండుతుందనడానికి సజీవ సాక్ష్యాలుగా నేడు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్మార్ట్ ఫోన్ల సావాసంలో పిల్లలు కరడుగట్టిన నేరస్తులుగా మారుతున్న దృష్టాంతాలు కోకొల్లలు. పెద్ద వారి దుష్కృత్యాల బారి నుండి మైనర్లను రక్షించడం కోసం జారీ చేయబడిన ఫోక్సో చట్టాలను సవరిస్తూ నేరస్తులుగా మారుతున్న మైనర్లను శిక్షించాల్సిరావడాన్ని బట్టి మైనర్ల ప్రవృత్తి ఎంత ప్రమాదకరంగా మారుతుందో గమనించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పోయినేడాది మన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో అశ్లీల వీడియోల మైకంలో మునిగిన ముగ్గురు మైనర్ బాలురు ఓ తొమ్మిదేళ్ల బాలికను అత్యంత కిరాతకంగా రేప్‌చేసి హత్యచేసినారనేది పోలీసుల అభియోగం. ఇవన్నీ సమీప గతానికి సంబంధించిన ఘోర నేరఘటనలైతే నిన్న గాక మొన్న హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలోసహస్ర అనే చిన్నారిని ఆమెసోదరుడి స్నేహితుడైన మైనర్ బాలుడు ఓ క్రికెట్‌బ్యాట్ దొంగతనం కోసం ఆమె ఇంట్లో ప్రవేశించి అడ్డుకున్న ఆమెను అత్యంత కిరాతకంగా హత్యచేసినకథనం దిగ్భ్రాంతిని గొలిపేదే. ఇలా పోలీస్ స్టేషన్ల గడప తొక్కినవి కొన్నైతే అక్కడ వరకూ చేరని దురంతాలు మరె న్నోననే నిజం గుర్తుకొస్తే గుండె ముక్కలౌతోంది. ఓ అధ్యయనం ప్రకారం మొత్తం బాలనేరస్తులుగా మారుతున్న వారిలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు మద్యం, గంజాయి తదితర మాదకద్రవ్యాలకు అలవాటుపడి నేరస్తులుగా జీవనాన్ని కొనసాగిస్తున్న వారు కేవలం పది శాతమే. ఇది జరగకుండా వుండాలంటే తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులంతా వారి పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్‌గ్యాడ్జెట్లు ఓ.టి.టీలు, నెట్‌ఫ్లిక్స్ తదితర రకరకాల సోషల్ మీడియాల నుంచి పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత నిస్సందేహంగా తల్లిదండ్రుల దీ, సమాజానిదేనని చెప్పక తప్పదు. ●


Main tab page 111_Main tab page 111.qxd 9/13/2025 12:20 AM Page 1



## అద్దంకి నియోజకవర్గంలో అనవాయితీగా

# సాగుతున్న ఇన్‌చార్జిల మార్పు

- 2004 నుండి కొనసాగుతున్న మార్పు తంతు
- రెండు పార్టీలలోను ఇదే అనవాయితీ




**అద్దంకి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలో పార్టీల ఇన్‌చార్జిల మార్పు అనవాయితీగా కొనసాగుతుంది. ఇది 2004 నుండి ఈ అనవాయితీ కొనసాగుతూనే వుంది. ఈ మార్పు అటు తెలుగుదేశంలోను, ఇటు కాంగ్రెస్, ప్రస్తుత వైఎస్ఆర్‌సిపిలోను జరుగుతూనే వుంది. 2004లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం నుండి కరణం బలరాం, కాంగ్రెస్ అభ్యర్థి జాగర్లమూడి రాఘవరావుపై సాధించారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అధికారం చేపట్టగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా జాగర్లమూడి రాఘవరావు వున్నారు. ఆయన స్థానంలో ఈదర హరిబాబును కొంతకాలం, తరువాత వైవి భద్రారెడ్డిని ఎఎంసి చైర్మన్ నియమించి, ఆయన కొంతకాలం ఇన్‌చార్జిగా 2009 ఎన్నికల ముందుగా మార్టూరు శాసనసభ్యులుగా వున్న గొట్టిపాటి రవికుమార్ ఇన్‌చార్జిగా నియమించారు. అంటే 5ఏళ్ళ కాలంలో 4గురు వ్యక్తులను కాంగ్రెస్ పార్టీ మార్చింది. 2014లో టిడిపి నుండి కరణం బలరాం స్థానంలో ఆయన కుమారుడు కరణం వెంకటేష్ పోటిచేశారు. టిడిపి ఆ ఎన్నికలలో అభ్యర్థిని మార్పు చేసింది. వైసిపి నుండి స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ తిరిగి శాసనసభ్యులుగా ఎన్నిక అయ్యారు. అయితే చివరి రెండేళ్ళు ముందు రవికుమార్ టిడిపి ప్రవేశంతో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మార్పు జరిగింది. వైసిపి ఇన్‌చార్జిగా వైవి భద్రారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. అయితే 2019 ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా డాక్టర్ బాచిన చెంచు గరటయ్య పోటి చేసి ఓడిపోయినప్పటికీ వైసిపి అధికారంలోకి వచ్చింది. అయితే ఏడాది కల్లా ఇన్‌చార్జి బాధ్యతలనుండి ఆయన కుమారుడు బాచిన కృష్ణ చైతన్యను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఎన్నికలకు 6నెలల ముందు పానెం చిన్న హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించి, 2024 ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా హనిమిరెడ్డిని రంగంలోకి దించారు. అయితే ఆ ఎన్నికలలో వైసిపి అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి ఓటమి పాలయ్యారు. ఇప్పటికీ ఎన్నికలు పూర్తి అయి, ఏడాదిన్నర కాలం గడిచింది. ప్రస్తుతం వైసిపి అద్దంకి నియోజవర్గగా వున్న పానెం చిన్న హనిమిరెడ్డి స్థానంలో పిడుగురాళ్ళకు చెందిన డాక్టర్ చింతలపూడి ఆశోక్ కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయం విడదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అంటే అద్దంకి నియోజకర్గంలో ఇన్‌చార్జిల మార్పు పక్రియ కొనసాగుతూనే వుంది.

### ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎంపీ మాగుంట



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఢిల్లీలో జన్‌పథ్‌లో భారత ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారోత్స వ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు కలిసి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

### శిద్దా సుధీర్‌కు బిజినెస్ ఎక్సోర్ట్ అవార్డు




**చీమకుర్తి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

యువ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ కు ఉత్తమ బిజినెస్ ఎక్స్పోర్ట్ అవార్డు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో విజయవాడ మురళి రిసార్ట్స్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ను అందుకున్నారు. జ్యోతి గ్రానైట్ ఇండియా ఎక్స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ సెంట్రల్ జోన్ చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ అందుకున్నారు. వారి వెంట జ్యోతి గ్రానైట్స్ ఎక్స్పోర్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సి.ఓ.ఓ మావులేటి శివ రామ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివ నాథ్,జ్యూరి సభ్యులు విశ్రాంత ఐ.ఏ ఎస్.అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్,సత్యనారాయణ,ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి,రీసెర్చ్ ఇన్నోవెషన్ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ శ్రీ అజిత్ రగ్నెకర్,ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర రావు,జనరల్ సెక్రటరీ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

### బెల్టు షాపులపై గ్రామస్తులు దాడి



**చీమకుర్తి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

తమ గ్రామంలో మద్యం విక్రయాలు అక్రమంగా జరిగే బెల్ట్ షాపులను తరిమికొడతామని గ్రామస్తులు హెచ్చరించారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్తులే స్వయంగా రంగంలోకి దిగారు. దుకాణాల వద్దకు వెళ్లి మద్యం సేసాలను బయటకు తీసుకొచ్చి రోడ్డు మీద వేసి పగలగొట్టారు. గ్రామ సభలో సైతం వారి గళం విప్పారు. చీమకుర్తి మండలం, మంచికలపాడు గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఈ గ్రామంలో ఉన్న 8 బెల్టు షాపులలో మద్యం విక్రయాల వలన కుటుంబాలు విచ్చిన్న మోతున్నాయని, బెల్టు షాపులను మూసివేయాలని మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం మంచికలపాడు గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలు గ్రామ సభనిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతి కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ ప్రజలు, నాయకులు, పంచాయతీ అధికారులు సమక్షంలో గ్రామంలో ఎక్కడా కూడా మద్యం విక్రయించ కూడదని తీర్మానం చేసారు. ఎవరైనా గ్రామంలో మద్యం విక్రయిస్తే వారిని ఎక్సెంజ్ అధికారులకు పట్టిస్తామని, కఠిన చర్యలకు బాద్యులౌతారని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ పోన్నపల్లి సుబారావు మాట్లాడుతూ మా గ్రామంలో బెల్టు షాపులలో అనధికారంగా మద్యం విక్రయిస్తున్నారని ఇటీవల స్పందనలో కలెక్టర్కి ఆర్జీ ఇచ్చినా అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదు అని, స్థానిక ఎంఎల్ఎ కి ఈ సమస్యపై అర్జీ ఇచ్చినా స్పందన లేదని అన్నారు. గ్రామ సభ అనంతరం గ్రామ ప్రజలు గ్రామంలో బెల్టు షాపులు నిర్వహించవద్దు అని మహిళలు రోడ్డెక్కి నిరసన ర్యాలీ నిర్వహించి మద్యం పారబోసారు. మద్యం సీసాలను పగలు కొట్టారు. నేరుగా బెల్టు షాపులు వద్దకు వెళ్లి మద్యం సీసాలను పగలుకొట్టి, మద్యం దుకాణం చుట్టూ ఉన్న గ్రీన్ మ్యాట్లను ద్వంశం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరికల నాగేశ్వరావు, ఎంపిటీసీ అత్యాల అంకయ్య, మీజీ సర్పంచులు చలువాది శేషమ్మ శ్రీను, పొన్నపల్లి శ్రీను, ఎడుగొండలు, కోరా సుబ్బారావు, యెసెపు, ఉల్లి మునలయ్య, పొన్నపల్లి వెంకటరావు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### పేద, మధ్య తరగతి విద్యార్థుల వైద్య విద్య పట్ల కూటమి ప్రభుత్వం కుట్ర

- రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారం వచ్చిన వెంటనే ప్రజల ఆస్తులను ప్రైవేటీకరణ చేయటం నిర్ణయాలు, పెత్తందారుల సంపద పెంచే ఆలోచన చంద్రబాబు చేస్తునానరని రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసి, తాను విజనరీ అని చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడు ఒక్క కొత్త మెడికల్ కాలేజీని అయినా రాష్ట్రానికి తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో మంజూరు అయిన ఈ మెడికల్ కాలేజీలను ప్రైవేటు కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని మేధావులు సైతం తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది ముమ్మాటికి ఉన్నత విద్యను పేద, మధ్య తరగతి ప్రజలకు దూరం చేసే చర్యగా పరిగణిస్తున్నారు. చంద్రబాబు ప్రజల కోసం కాకుండా దోపిడి కోసం నిర్ణయాలు తీసుకోవడానికి మీరు మంత్రివర్గ సమావేశాలు పెట్టుకుంటున్నట్టుగా మీ తీరు ఉందన్నారు. జగనన్న 5 ఏళ్ల పాలనలోనే 8480 వేల కోట్లతో 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం, 5 చోట్ల కాలేజీలు పూర్తై క్లాసులు కూడా ప్రారంభం అయ్యాయి. ఎన్నికలు ముగిశాక మరో చోట అడ్మిషన్లు కూడా జరిగాయి. మిగిలిన పనులు మీరు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లి ఉంటే, గత ఏడాది మరో 5, ఈ ఏడాది మరో 7 కాలేజీల్లో కూడా క్లాసులు స్టార్ట్ అయ్యేవి కదా..? మరి వాటిని ముందుకు తీసుకెళ్లకుండా ఈ రాష్ట్రానికి ఎందుకు ద్రోహం చేస్తున్నారు..? ప్రస్తుతం ఈ కాలేజీలు అక్కడ రావడంతో అమాంతంగా విలువ పెరిగిన ఆ కాలేజీల భవనాలు, భూములు కొట్టేయడానికి మీరు చేసిన ప్లానే కదా ఇది..? అవినీతి కోసం ఇంతగా తెగిస్తారా అని ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 2,360. ఈ కొత్త మెడికల్ కాలేజీల ద్వారా సీట్లు మరో 2,550 పెరిగి, 4910కి చేరుకుంటాయి. చంద్రబాబు.. ఇప్పటికే మీ పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు, ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న మిమ్మల్ని ప్రజలు క్షమించరు అని అన్నారు.



# ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

## అద్దంకి వైసిపి సమన్వయ కర్తగా డాక్టర్ ఆశోక్ కుమార్



**అద్దంకి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్తగా డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్‌ను వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. డాక్టర్ చింతలపూడి ఆశోక్ కుమార్ గురజాల నియోజకవర్గంలోని పిడుగు రాళ్లలో పల్నాడు హాస్పటల్స్ చైర్మన్‌గా వున్నారు. ఈయన వైసిపిలో పని చేస్తూ వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర డాక్టర్ విభాగ స్పోక్స్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. పిడుగురాళ్ళ మండలం, జానపాడు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, ఎంబిబిఎస్‌తోపాటు ఆర్థోపిజి చదివిన ఈయన పిడుగురాళ్ళలలో డాక్టర్ హస్పటల్ నిర్వహిస్తున్నారు. ఈయనకు ఇద్దరు సోదరులు. త్వరలో మంచి రోజు చూసి అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బాధ్యతలను చేపడతానని డాక్టర్ ఆశోక్ కుమార్ ప్రభాతవార్తకు వెల్లడించారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి






**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సంబంధిత పనులు ఊపందుకుంటున్నందున రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన పాత జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ప్రకాశం జిల్లా డీఆర్వో బి.చిన్న ఓబులేసు, జడ్పీ సీఈఓ చిరంజీవి, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరం గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో ప్రధానంగా పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, విద్యుత్, రోడ్లు- భవనాలు, వైద్య, వ్యవసాయ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ప్రధా నంగా చర్చించారు.

#### అర్హులందరికి పెన్షన్లుః

గతంలో పెన్షన్లు పొందిన వారు ప్రస్తుతం పెన్షన్లకు దూరమయ్యారని, అర్హులైన తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారని దర్శి, యర్రగొండపాలెం శాసనసభ్యుల తో పాటు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ అర్హులందరికి పెన్షన్లు వస్తాయని, మెడికల్ అసెస్మెంట్ జరుగుతోందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు.

#### రైతులెవరూ ఆందోళన చెందవద్దుః

తన నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని దర్శి శాసనసభ్యులు చెప్పారు. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు అవసరమైన పూర్తి స్థాయిలో ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, నిర్దిష్ట ధరలకే వారికి లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎరువుల వినియోగంపైనా రైతులకు నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

#### కాలువలపై ప్రత్యేక దృష్టిః

తన నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయని, ఈనీరు స్వేచ్ఛగా పారేలా కాలువలను శుభ్రం చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే అధికారులను కోరారు. పెద్దదోర్నాలలోని గండి చెరువు నుంచి నీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోర్నాల కమ్యూనిటీ ఆసుపత్రి, యర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు లేరని, దోర్నాల ఆసుపత్రిలో నీటి సమస్య కూడా నెలకొన్నదని, యర్రగొండపాలెం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. కాగా స్థానికంగా జరుగుతున్న మరమ్మతు పనులు పురోగతిని, శాఖా పరంగా తీసుకుంటున్న చర్యలను ఆర్అండ్‌బి అధికారులు వారికి వివరించారు.

#### జ్వరాలు ప్రబలకుండా చర్యలుః

తమ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నారని శాసనసభ్యులు, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు చెప్పారు. దీనిపై డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్వయంగా తాను పర్యటించి పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి అపాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

# మెరుగైన విద్య, వైద్యం అందించడమే కూటమి లక్ష్యం








- 218 మందికి అద్దంకిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు
- 205 మందికి బూదవాడలో ఉచితంగా సైకిల్లు
- సంక్రాంతి నాటికి ప్రతి విద్యార్థికి ఉచిత సైకిల్
- పీ4లో మరింత మంది భాగస్వాములు కావాలి
- కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ రాష్ట్ర చరిత్రలో మైలురాయి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అద్దంకి,జె.పంగులూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

రానున్న సంక్రాంతి పండుగ నాటికి అద్దంకి నియోజకవర్గంలోని ప్రతీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం బాపట్ల జిల్లా జే. పంగలూరు మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు 205 సైకిళ్లను ఉచితంగా మంత్రి గొట్టిపాటి అందించారు. మేఘా కంపెనీతో పాటు నెదర్లాండ్స్ కు చెందిన మోర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో పీ4 పథకంలో భాగంగా ఈ సైకిళ్లను విద్యార్థులకు ఉచితంగా అందించామని మంత్రి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులతో పాటు అవకాశం ఉన్నవారందరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. సైకిళ్ల పంపిణీ అనంతరం పాఠశాల విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ పరిధిలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులందరికీ వచ్చే సంక్రాంతి నాటికి ఉచితంగా సైకిళ్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని మండలాల్లోని పాఠశాలల్లో సైకిళ్ల పంపిణీని పూర్తి చేశామని, మిగిలిన వారికి కూడా రాబోయే నాలుగు నెలల్లో ఉచితంగా సైకిళ్లను అందిస్తామని తెలిపారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫార్మ్‌లు, పుస్తకాలు అందించామన్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులు ఎవరూ సరైన రవాణ సౌకర్యాలు లేక చదువుకు దూరం కాకూడదనే అందరికీ సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. సైకిళ్లపై పాఠశాలలకు వచ్చేప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రయాణ జాగ్రత్తలు చెప్పాలని సూచించారు.

#### అద్దంకిలో చెక్కులు పంపిణీ....

అనంతరం అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. 218 మంది లబ్ధిదారులకు రూ.1,18,43,916 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు తొమ్మిది లక్షల రూపాయిల విలువైన (ఎల్ఓసీ) లెటర్ ఆఫ్ క్రెడిట్లను ఐదుగురు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విధానం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచి పోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్కువ మంది పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యతోనే కొత్త హెల్త్ పాలసీని ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థమయినా, ప్రజా సంక్షేమం కోసమే సూపర్ 6 పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబం ధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు.

# వ్యాపారస్తులకు పూర్తిన్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ - ఒంగోలు నగర కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు





**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు నగర పాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. నగర పాలక సంస్థ కార్యాలయం నందు జరిగిన సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు,బి.ఎన్ విజయ్ కుమార్ తోపాటు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు,మొత్తం 50 మంది సభ్యులు ఉండగా 25 మంది మాత్రమే హాజరు అయ్యారు. వైసిపి పార్టీ నుంచి జనసేన పార్టీలో చేరిన కార్పొరేటర్లు ఒకరు ఇద్దరు తప్ప మిగిలిన సభ్యులు అందరూ గైర్హాజరయ్యారు. కోరం సంబంధించిన సభ్యులు సమావేశంలో ఉండడంతో సమావేశాన్ని కొనసాగించారు, మొత్తం 64 అంశాలు అజెండా నందు ప్రవేశ పెట్టగా ఒకటి రెండు అంశాలు తప్ప మిగిలినవి అంశాలు అన్నిటికి కౌన్సిల్ ఏకముక్తంతో ఆమోదం తెలిపింది. ఒంగోలు నగరం అభివృద్ధిలో భాగంగా కౌన్సిల్ సమావేశం నందు అజెండాలో పొందుపరిచిన అంశం 6,7 పై సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. అంశం 6కు సంబంధించిన ట్రంక్ రోడ్ విస్తరణకు సంబంధించి అంశం చర్చకు రాగా టీడీపీ,వైసిపి సభ్యులు మధ్య వాదనలు జరిగాయి. దుకాణాలు కోల్పోతున్న వ్యాపారులకు న్యాయం చేసిన తరువాతే విస్తరణ పనులు చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు,ఈ విషయమై ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు స్పందిస్తూ వ్యాపారస్థులు సంతోషంగా ఉండాలనే సంకల్పంతో అనేక వారితో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. పూర్తిగా దుకాణాలు కోల్పోతున్న వారికి పాత మార్కెట్ స్థలంలో దుకాణాలు నిర్మించి ఇవ్వడంతో పాటు టిడిఆర్ బాండ్లు ఇస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు, 100 అడుగులు విస్తీర్ణం చేస్తే 193 దుకాణాలు,80 అడుగులు విస్తీర్ణం చేస్తే 77 దుకాణాలు పూర్తిగా పోతున్నాయని వారి అందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. ఈ విషయాన్ని కొంత మంది దుకాణాల యజమానులు కోర్టుకు వెళ్ళడంతో కోర్టు నిర్ణయం కోసం వేచి వేచి చూస్తున్నామని త్వరలోనే మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల విస్తరణ పనులను చేపడతామని దామచర్ల తెలియజేశారు. అజెండాలో అంశం 7లో భాగంగా మస్తాన్ దర్గా కూడలి నుంచి కొత్తపట్నం బస్టాండ్ రోడ్డు వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులలో భాగంగా అక్కడి దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసిన తర్వాత వారి నుండి నిర్ణయం తీసుకొని పనులు చేపడతామని ఎమ్మెల్యే దామచర్ల కౌన్సిల్ సమావేశ వేదికగా పేర్కొన్నారు. అందరి సహకారంతోటే ఒంగోలు నగర అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోరారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాల్గొన్న ఆయన సమావేశ అనంతరం మాట్లాడుతూ నగర సుందరీకరణలో భాగంగా ఒంగోలు నగరం నందు ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు, నగరంలోని ప్రధాన రహదారులను మోడల్ రోడ్లుగా తీర్చిదిద్దనన్నట్లు తెలియజేశారు, గత ప్రభుత్వ మాదిరిగా కాకుండా ప్రజల మెచ్చే విధంగా కూటమి పాలన ఉంటుందని అన్నారు. అమృత్ పథకంలో భాగంగా ప్రజలందరికీ ప్రతిరోజు త్రాగునీరు ఇచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తున్న తరుణంలో కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ప్రత్యక్షంగా ఓ దినపత్రికను గురించి ఆయన హెచ్చరించారు, గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వ పాలన ఉండదని స్పష్టం చేశారు, పోలీసుల మీద సైతం దాడులు చేస్తున్నారని అది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. సాంప్రదాయంగా జరుపుకునే అడ్డుపెట్టుకొని పోలీసుల మీద దాడి చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వినాయక చవితికి ఒంగోలు నగరంలో ఎటువంటి డీజేలు ఉండవని దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని దామచర్ల తేల్చి చెప్పారు,

## ఫోక్స కేసుపై డిఎస్పి విచారణ

**కొత్తపట్నం, ప్రభాతవార్త**

మండలంలోని వజ్జి రెడ్డిపాలెం గ్రామ పరిధిలో దొడ్ల వీరారెడ్డి మైనర్ బాలికలపై చేసిన లైంగిక దాడి సంఘటన గురించి ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్ విచారణ చేపట్టారు. శుక్రవారం



సాయంత్రం డీఎస్పీ రమణ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిసింది నిందితుడు వీరారెడ్డి ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులను కూడా విచారించినట్లు సమాచారం అదేవిధంగా మైనర్ బాలికలు తల్లిదండ్రులను కూడా విచారించి పక్కన ఉన్న కుటుంబాలను కూడా ఈ సంఘటనపై ఆరా తీసినట్లు సమాచారం. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

6_6.qxd 9/13/2025 12:44 AM Page 1



## ఆటల పోటీలను ప్రారంభించిన విద్యాశాఖాధికారి



**బల్లికురవ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని ముక్తేశ్వరం పాఠశాలలో అండర్ 14,17వ ఖోఖో పోటీలను విద్యాశాఖ అధికారి కాకాని రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని డివిజన్ స్థాయి టీములకు ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన క్రీడాకారులకు సూచించారు. చదువులతో పాటు, ఆటలలో మరింతగా రాణిస్తే విద్యార్థులు తమ భావి జీవితానికి రాజమార్గం వేసుకున్నట్లు అవుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన అనేక మంది గ్రామీణ క్రీడాకారుల కథనాలను ఉదాహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌ను పరిశీలించిన బాపట్ల డీఎస్పీ



**బల్లికురవ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు స్థానిక పోలీసు స్టేషన్లో రికార్డు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు, రౌడీ షీటర్ల కదలికలు, ఫ్యాక్షన్ గ్రామాలలో పరిస్థితులు, మండలంలోని ప్రధాన సముదాయాలలో దేవాలయాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు తదితర అంశాల గురించి ఆరా తీశారు. స్థానిక ఎన్నికల నగారా త్వరలో మోగనున్న నేపథ్యంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సిబ్బందికి సూచించారు. సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని వివరాలను సీఐ కాకుమాను వెంకట్రావు వివరించారు. ఎస్సై నాగరాజు సిబ్బంది ఉన్నారు.

## సమస్యలపై ఉపాధ్యాయుల వినతి పత్రం



**బల్లికురవ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ప్రత్యేక చొరవ చూపాలని మండల ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ రవి నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ బోధ నేతర యాప్‌లను రద్దు చేయాలని, జీవో 15ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డీఏలను సత్వరం విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గోలి శ్రీనివాసరావు, కంభంపాటి ప్రశాంత్, గుంటుపల్లి పార్థసారధి, కంభంపాటి డేవిడ్ పాల్, సీహెచ్ రామకృష్ణ, కే.రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ షంషుద్దీన్‌కు మాతృవియోగం

**- సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి**



**మార్టూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్, పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ మాతృమూర్తి షేక్ రెహానబి శుక్రవారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మరణం చాలా బాధాకరమన్నారు. షేక్ రెహానబి మృతి తెలుగుదేశం పార్టీకి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు. షంషుద్దీన్‌ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్లో పరామర్శించారు. ఆయనకు ధైర్యం చెప్పారు.

### డీఎల్ఎం సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ



**జరుగుమల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఆపత్కాలంలో నిరుపేద కుటుంబాలకు ఆపన్న హస్తముగా డీఎల్ఎం సంస్థ ముందుకు వచ్చింది. అసలే కష్టకాలం పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి. సాధారణ దినాల్లో రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు వారివి. పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్న జరుగుమల్లిలోని తూర్పుపాలెం సమీపాన నివసిస్తున్న ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాలను డీఎల్ఎం సంస్థ గుర్తించి 2300 రూపాయల విలువ కలిగిన బియ్యం, 15 రకాల నిత్యవసర సరుకులను మండల మాజీ తెలుగు రైతు ఉపాధ్యక్షులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, బాలకోటయ్యల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ సేవా దృక్పథం మంచి కార్యక్రమం అని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు నిత్యవసర సరుకులతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి నాణ్యతతో కూడిన బియ్యం, 15 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేసిన ఈఎల్ఎం సంస్థ టీంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎంటీం సభ్యులు సుప్రియ, మాధవరావు, రవి, రమణమ్మ, ప్రమోద్, ప్రదీప్, స్వప్న, రాజేష్, జార్జ్, మేరీ కృపమణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఎన్‌ఆర్‌ఎంలో హిందీ దివాస్ కార్యక్రమం






**కొమరోలు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**
మండల పరిధిలోని ఎస్‌బిఎన్‌ఆర్‌ఎమ్ పాఠశాలలో సెప్టెంబర్ 14 హిందీ దివాస్ సందర్భంగా కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాల యాజమాన్యం బంధువుల నారాయణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి అధ్యక్షత వహించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు విద్యార్థులచే హిందీకి సంబంధించిన వ్యాసరచన పోటీలు, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. అనంతరం హిందీ ప్రాముఖ్యతను వర్ణిస్తూ విద్యార్థులు పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంకిరెడ్డిపల్లిలో పొలంబడి కార్యకమ్రం



**రాచర్ల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏవో షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏవో మహబూబ్ బాషా రైతులతో మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమం కంది పంట పూర్తి కాలం వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన విత్తన శుద్ధి, దాని ప్రయోజనాలు స్వయంగా రైతులతో చేయించి పలు సూచనలు ఇచ్చారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, అధిక మోతాదు పురుగుమందుల వాడకం తగ్గించి, తెగుళ్లను గుర్తించి, నివారణకు అవసరమైన మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సభ్యురాలు నందిని రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కంభం వైద్యశాలకు పర్నిచర్స్ బహుకరించిన పోలీసులు



**కంభం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు శుక్రవారం కంభం, బేస్తవారపేట పోలీసులు వీల్ చైర్, స్ట్రెచ్చర్లు బహుకరించారు. అర్ధవీడు పోలీసులు వైద్యశాలలో సీసీకెమెరాలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని కృతజ్ఞతలు తెలిపారు. వైద్యశాలలో రోగులకు అవసరమైన ఉపకరణాలను బహుకరించిన కంభం, బేస్తవార పేట, అర్ధవీడు పోలీసులకు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం ఎస్ఐ నరసింహారావు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ విజయ్ చంద్ర, డాక్టర్ శివ నాయక్, డాక్టర్ శ్రావ్య, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ డిమాండ్



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన వారం కార్యక్రమంలో భాగంగా రెండవరోజు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు హనుమంతునిపాడు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ హనుమంతునిపాడు మండలశాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కేవీ సుబ్బయ్య, జి.శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్ పి.మాలకొండయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జి.శ్రీకాంత్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా, ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్,డీఏ బకాయిలు ఏవీ విడుదల కాలేదని, ఆర్థికపరమైన సమస్యలు ఎక్కడికి అక్కడే పేరుకుపోయాయని, ఉద్యోగ ఉపాధ్యాయులలో ఉన్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిటీను వెంటనే నియామకం చేయాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్స్ చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్కాష్మెంట్, గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలని, అనవసర యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ల సాధన కోసం వారం రోజుల పాటు జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కే.రామ్మోహన్, పాకలశ్రీనివాసులు, మోషే, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరెడ్డి, భారతి, జిలానీభాషా ,నాలి వెంకటయ్య, షపూరున్, స్వర్ణలత, జైనాబీ, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరించాలి



**పొన్నలూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏసుపోగు జాన్ బాబు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికలకు ముందు క్రమబద్ధీకరణ చేయాటానికి జి.ఓ.యం.యస్. నెంబర్ 114ను 21.10.2023 విడుదలచేశారని, అన్నీ శాఖల్లో మాత్రం క్రమబద్ధీకరణ జరిగిందని ఎన్నికల కోడ్ రావడం వలన కేవలం ఒక విద్యా శాఖలోనే క్రమబద్ధీకరణ నిలిచి పోయిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిలిచి పోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ చేయాలని అనేక వినతలు సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. విధిలేని పరిస్థితుల్లో దశవారి పోరాటం చేయాలని నిర్ణయించటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13 వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో యం.బి భవన్, విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నమన్నారు. ప్రభుత్వం అప్పటికి ఏ నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలోని మహిళా కాంట్రాక్ట్ లెక్చరర్స్‌తో 36 గంటల మహిళా దీక్షలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. కావునా ప్రభుత్వ అధికారులు స్పందించి క్రమబద్ధీకరణ చేపట్టాలని, పని చేసిన మే నెల వేతనాలు ఇవ్వాలని, 62 సంవత్సరాలు సర్వీస్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. వారి పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు పూర్తి మద్దతు ఉందని బి.వి. కాశీ రత్నం, షేక్ ఖాదర్ వలీ తెలుపుతూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అద్దంకి పట్టణంలో నేడు విద్యుత్‌కు అంతరాయం

**అద్దంకి , సెప్టెంబరు 12 ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎడి ఎం దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ అద్దంకి, ఉత్తర అద్దంకి సబ్ స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు అద్దంకి టౌన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణ విద్యుత్ నియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా ఎం దామోదర్ పేర్కొన్నారు.

### నేడు కొరిశపాడు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కొరిశపాడు , సెప్టెంబరు 12,ప్రభాతవార్త**
మండల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ అంతరాయం కొనసాగుతుందన్నారు. కొరిశపాడు, మేదరమెట్ల సోమరప్పాడు, రావినూతల, పమిడిపాడు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి వలసినదిగా ఆయన కోరారు.

## అప్ డేట్ ఈ.కే.వై.సీ.,మ్యాన్డేట్ బయోమెట్రిక్ అప్ డేట్

**- మన మిత్రలపై డి ఎల్ డి ఓ పద్మావతి రివ్యూ**



**జె.పంగులూరు , సెప్టెంబరు 12 ప్రభాతవార్త**
మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలు మరియు సచివాలయాల నందు ఇంటి పన్నులు , సానిటేషన్ , స్వామిత్వ ,కౌశలం అప్ డేట్ ఈ.కె.వై.సీ, మెయిన్ డేట్ బయోమెట్రిక్ అప్ డేట్, మనమిత్ర, వాట్సప్ గవర్నన్స్ మొదలైన సర్వేలపై డి. ఎల్. డి. ఓ.పద్మావతి రివ్యూ శుక్రవారం నిర్వహించారు. పంగులూరు గ్రామ పంచాయితీ నందు ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ ను సందర్శించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ప్రాసెసింగ్ చేయవలసిందిగా సానిటేషన్ వర్కర్స్‌కి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప రాణి, డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పంగులూరు పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు, పలు గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్ కాంపిటీషన్లో గెలుపొంది ప్రధమ బహుమతి సాధించిన నూతలపాటి కల్పిత



**జె. పంగులూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
హైస్కూల్ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, వినూత్న ఆలోచన శక్తి మరియు ఆవిష్కరణల దృక్పోణంలో ప్రోత్సహించడానికి సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేస్తున్నామని, కిరణ్ జ్యోతి ఫౌండేషన్ వారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పోతురాజు అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయకే పోతురాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని, ఈ కాంపిటీషన్లో ఫస్ట్ ప్రైజ్ 5 గురుకు 4500 లుగా, సెకండ్ ప్రైజ్ 5 గురుకు 3000 రూపాయలు చొప్పున బహుమతులు అందజేస్తున్నామన్నారు. దైవాల రావూరు గ్రామంలో హై స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన వివిధ మండలాల సైన్స్ ఫెయిర్ నందు పంగులూరు ఉన్నత పాఠశాల నుండి పాల్గొన్న నూతలపాటి అల్పిత ప్రథమ బహుమతి సాధించినందుకు 4,500 ప్రైజ్ అందుకున్నందుకు పాఠశాల సిబ్బందికి, సైన్సు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆర్జీయూకేటీ కళాశాలలో స్మార్ట్ ఇండియా ప్రారంభోత్సవ వేడుకలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఐఐఐటీఒంగోలులో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్)-2025 ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం నాడు సంతనూతలపాడు మండలం ఎండ్లూరుడొంక వద్ద గల ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, డీన్ అకాడెమిక్స్ రూపాస్‌కుమార్, డిప్యూటీ ఏవో వరుణ్, డీఎస్‌డబ్ల్యూఒ దిలీప్, టెక్సెల్ క్లబ్ కోఆర్డినేటర్లు, క్యాంపస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ అంతర్గత హ్యాకథాన్‌లో ఇంజనీరింగ్ విభాగాలన్నీ, అన్ని సంవత్సరాల నుండి 700 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఎస్ఐహెచ్ 2025 ప్రపంచంలోనే అతి పెద్ద హ్యాకథాన్‌గా గుర్తింపు పొందింది. దీన్ని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ, ఏఐసీటీఈ నిర్వహిస్తున్నాయి. ఈ హ్యాకథాన్‌లో విద్యార్థులు ఆలోచించి, కొత్త ఆవిష్కరణలు చేసి ప్రభుత్వం వివిధ పరిశ్రలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించనున్నారు.

### ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌కు 25 అర్జీలు

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**



ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌కు సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని వివిధ వర్గాల ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించి 25 అర్జీలు వచ్చాయి. సంబంధిత అర్జీలను ఆయా మండలాల అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల ప్రజలు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి శ్రీ కోట సత్యమాంబా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**కంభం, సెప్టెంబరు 11,ప్రభాతవార్త**
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ కోట సత్యమాంబ దేవీ అమ్మవారు ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 22వ తేదీ సోమవారం శ్రీ కోటా సత్యమాంబాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 23వ తేదీ అంబాభవాని దేవి అలంకారం, 24వ తేదీ శ్రీ భువనేశ్వరి దేవి అలంకారం, 25వ తేదీ శ్రీ గజలక్ష్మి దేవి అలంకారం, 26వ తేదీ శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారం, 27వ తేదీ శ్రీ మీనాక్షిదేవి అలంకారం, 28వ తేదీ శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారం, 29వ తేదీ శ్రీ సరస్వతి దేవి అలంకారం, 30వ తేదీ శ్రీ మహిషాసుర మర్ధిని అలంకారం, అక్టోబర్ 1వ తేదీ శ్రీ బాలహృదయేశ్వరి అలంకారం, 2వతేదీ శ్రీమోహిని దేవి అలంకారం, 3వతేదీ శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ నవరాత్రులలో ప్రతిరోజు దేవాలయం ప్రాంగణంలో అన్నదానంతో పాటు సాయంత్రం నాలుగు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## దేవుని ఎరిగి పరస్పర ప్రేమతో జీవించండి

**- వివాహ బంధం పవిత్రమైనది**

**- దర్శనం వారి వివాహ మహోత్సవంలో అలరించిన టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్యాత్మిక దైవ సందేశం**



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం రామచంద్ర కోట గ్రామంలో గురువారం జరిగిన దర్శనం వారి వివాహ మహోత్సవంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన జంట దర్శనం ఫిలిప్పు, స్వాతిలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మన జీవితంలో ప్రధానమైనది దేవుని ఎరిగి ఆయన చిత్త ప్రకారం నడుచుకోవడం. వివాహ బంధం పవిత్రమైనది. భార్యా భర్తలు ఒకరి పట్ల ఒకరు విశ్వసము ప్రేమతో దేవునికి భయపడి జీవించాలని సూచించారు. పరస్పర గౌరవం, నిబద్ధతతో కూడిన దాంపత్య జీవితం ప్రతి ఇంటిలో దేవుని ఆశీర్వాదాన్ని తీసుకొస్తుందని ప్రబోధించారు. వై.పాలెం టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు ఇచ్చిన ఆధ్యాత్మిక సందేశం వివాహ వేడుకకు హాజరైన ప్రతి ఒక్కరిని స్ఫూర్తి పరిచింది. ఆయన మాటలు దాంపత్య జీవితానికి మార్గదర్శకమై, దేవునికి విధేయతగా జీవించే సంకల్పాన్ని మరింత బలపరిచాయి. ఈ వివాహ వేడుకలో టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు షేక్ మాబు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, జిల్లా ఎస్సీ నాయకులు చంటి, దర్శనం సుధీర్‌బాబు, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, ఈదర మల్లయ్య, ఎస్టీ నాయకులు భూమిని మంతన్న, మాజీ సర్పంచ్ దర్శనం దేవయ్య, పాస్టర్ జాకబ్, పాస్టర్ బుట్టి, ఆగస్టీన్, రామచంద్ర కోట, టీడీపీ గ్రామ నాయకులు, బంధుమిత్రులు అభిమానులు పాల్గొన్నారు. వైకాపా నాయకులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ వివాహ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ తాను సంఘమిత్ర ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ తన చేయించుకున్న తరుణంలో పెండ్లి కుమారుడు ఫిలిప్ ఎంతో సేవలు అందించారని, తాను కృతజ్ఞతగా వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదిస్తున్నానని ఆనందోత్సాహాలతో తెలిపారు.

## స్వామిత్వ శిక్షణను సద్వినియోగపరుచుకోవాలి



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
స్వామిత్వ శిక్షణను ఇంజనీరింగ్ అసిస్టెంట్ సద్వినియోగపరుచుకోవాలని సంతనూతలపాడు ఎంపీడీఓ డీఎస్సీ ప్రసాద్, తహసీల్దార్ ఎస్ఎల్ తమతమ ప్రసంగాలలో కోరారు. సంతనూతలపాడు మండల పరిషత్‌కార్యాలయంలో శుక్రవారం నాడు మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సచివాలయాల సర్వేయర్ల ద్వారా స్వామిత్వ డేటా వాక్టోరిజషన్‌పై శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. దీనికి సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు ఇచ్చారు.

## రేషన్ డీలర్లకు కొత్త ఈపాస్ మిషన్లు పంపిణీ



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఎమ్మెల్యేస్ పాయింట్ నందు శుక్రవారం నాడు రేషన్ డీలర్లకు కొత్త ఈపాస్ మిషన్ల పంపిణీ చేశారు. ఒంగోలు అర్బన్‌లో ఉన్న అన్ని రేషన్ షాపులకు ఈ పాస్ మిషన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐ రాధాకృష్ణ, విజన్ టెక్ అధికారులు సాయి, ఒంగోలు నగర రేషన్ డీలర్ల అసోసియేసన్ ప్రెసిడెంట్ బెజవాడ మురళీకృష్ణ, సెక్రటరీ నందూరి చంద్ర, ట్రెజరర్ సోమిశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ సలహాదారులు మారుతీరావు పాల్గొన్నారు.

### జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యల పట్ల ధ్వజం



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**
రాష్ట్రంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కావడంతో మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత ఓర్చుకోలేక కూటమి ప్రభుత్వంపట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేనిహరిబాబు ధ్వజమెత్తారు. సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయినట్టు హరిబాబు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గత 15 నెలలుగా ఇంట్లో కూర్చొని, ఫేక్ ప్రచారాలతో కాలం గడుపుతున్నారన్నారు. అనుకూల మీడియాతో సమావేశాలు పెట్టి ప్రభుత్వంపై ప్రచారం చేస్తున్నారని హరిబాబు విమర్శించారు. విశాఖ, అమరావతి నిర్మాణం, రాయలసీమ రైతులు, వైద్య కళాశాల విషయంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. యూరియాపై కేంద్రంతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. యూరియా కొరత ఏర్పడిందంటూ విషం చిమ్ముతూ సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నిర్వహించడం కాదు చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ను బావిలో దూకి చావాలని తీవ్ర పదజాలంతో జగన్‌మోహన్‌రెడ్డి దూషించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని నాశనం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు పాతాళానికి తొక్కి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలపై అసభ్య పదజాలంతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా మీ పద్ధతి మార్చుకోవాలని హరిబాబు కోరారు. జగన్ ఒక పిచ్చోడు మళ్ళీ చెలరేగిపోతున్నాడు. పిచ్చోడికి అధికారం ఇస్తే ఎలా ఉంటుందో 2019-2024 మధ్య కాలంలో చూశాం జగన్ రాష్ట్రాన్ని కుక్కలు చించిన విస్తరిలాగా మార్చేశాడు అని హరిబాబు ఈ సందర్భంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా యూరియా కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 24,894 టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించి ఈ నెల 15-22 మధ్య విశాఖపట్నం పోర్టుకు యూరియా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల తెలుగు యువతి అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయుసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, గుమ్మలంపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామ్మూర్తి, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయుసీ ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకట సుబ్బయ్య, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, నాదెండ్ల ఆంజనేయులు, పావులూరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా డైట్‌లో ముగిసిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్‌లో శుక్రవారంతో ఘనంగా జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు ముగిశాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 9వతరగతి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 12 కళా రూపాలలో విద్యార్థులు ఈ పోటీల్లో ప్రదర్శించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు బహుమతులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## దొనకొండ ప్రజలు అభ్యర్థిస్తున్న బస్సు సర్వీసులు

**దొనకొండ,సెప్టెంబర్ 12,ప్రభాతవార్త**
పొదిలి దొనకొండ హైదరాబాద్(సూపర్ లగ్జరీ with Reservation)పొదిలి దొనకొండ వినుకొండ. దర్శి దొనకొండ - మార్కాపురం. పొదిలి/దర్శి దొనకొండ - త్రిపురాంతకం. దర్శి !! దొనకొండ శ్రీశైలం (ఏదైనా ట్రైన్ కి కనెక్టింగ్ ఉండేలాగా)ఈ సర్వీసులు గురించి పైన ఉన్న Email id కి Mail చేయండి. and పైన ఉన్న ఫోన్ నెంబర్ కి కూడా కాల్ చేసి Requestలు Raise చేయండి.

## ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

### - మార్కాపురంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన



**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**
మండలంలోని గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ జాప్యాన్ని ఖండిస్తూ శుక్రవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు నిరసన తెలియజేశారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం బయట మంచి పాలన చేస్తున్నట్టు చెబుతున్నా, విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలలు నడవడం కష్టంగా మారిందని, లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేని స్థితి ఏర్పడిందని తెలిపారు. విద్యార్థులపై ఫీజుల పేరుతో ఒత్తిడి పెడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో 5వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థుల నుంచి కళాశాల ఫీజులు, పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇది విద్యార్థులపై అన్యాయం అని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని బండి వీరస్వామి హెచ్చరించారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి



**టంగుటూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11 నుండి 17వరకు నిరసన వారం పాటించాలని ఏపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా టంగుటూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, జీవో నెం 57 ను తక్షణమే అముల చేయాలని, 12వ పీఆర్సీ ని నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రబాబు, వెంకటరావు, రాష్ట్ర కౌన్సిలర్ కే.రవి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఈపాస్ మిషన్ల పంపిణీ



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు నగరంలోని ఎమ్మెల్ఎస్ పాయింట్ నందు నిర్వహించిన కొత్త ఈ పాస్ మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఒంగోలు అర్బన్లో ఉన్న అన్ని రేషన్ షాపులకు దగ్గరుండి ఈ పాస్ మిషన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐ రామకృష్ణ, విజన్ టెక్ అధికారులు సాయి, ఒంగోలు నగర అసోసియేషన్ అధ్యక్షులు బెజవాడ మురళీకృష్ణ, కార్యదర్శి నందూరి చంద్ర, కోశాధికారి సోమిశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ సలహాదారులు మారుతీరావు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

### - ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఏ.సురేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి మెమో నెంబరు 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కే.తిరుమల, పొదిలి మండలం ప్రధాన కార్యదర్శి మంచికల కోటేశ్వరరావులు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ పరిమితిని 25 లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల అధ్యక్షులు తాళ్లూరి రామారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆదినారాయణ, కొనకనమిట్ల మండల ప్రధాన కార్యదర్శి తోట యోగి రాములు, సభ్యులు ఎంవీ నారాయణ, ఈ.శ్రీనివాసరావు, ఏ.తిరుపాలు, మాల్యాద్రి, టీవీ మురళి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గాయం తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పుట్టిన రోజు సందర్భంగా హనుమంతునిపాడు మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గాయం తిరుపతిరెడ్డి శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గుంటిగంగమ్మ హుండీ ఆదాయం రూ.6.81 లక్షలు



**తాళ్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ ఆలయ హుండీని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.అనంత సత్యనారాయణ సమక్షంలో శుక్రవారం లెక్కించారు. 150 రోజులకు హుండీని లెక్కించారు. భక్తులు అమ్మవారికి రూ.6,82,765 కానుకలుగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌కొసనా గురుబ్రహ్మం, ఈవో జి.వాసు బాబు, పూజారిలు మెట్టెలబాలరాజు, పి.విజయలక్ష్మి, కామేశ్వరశర్మ, ఆర్‌ఏలు కాటూరి ప్రసాద్, కోట శ్రీనివాసరావు, దేవస్థానం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## అందుబాటులో యూరియా



**తాళ్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలో యూరియా ఎరువుల కొరత లేదని మన్నేపల్లి సొసైటీ చైర్మన్ గొంది రమణారెడ్డి(సమర) తెలిపారు. సొసైటీ ద్వారా శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభిమానాన్ని నిండుగా పొందుతున్నారని చెప్పారు. యూరియా 45 కిలోల బస్తా రూ.2150 కాగా.. సబ్సిడీ పోను కేవలం రూ.266లకు రైతులకు తగినంత సరఫరా చేస్తున్నామని తెలిపారు. సొసైటీ ద్వారా యూరియా, పలు రకాల, ఎరువులను పొందాలని రైతులను కోరారు. కార్యక్రమం సొసైటీ సీఈఓ అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**తాళ్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం లక్కవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఫీవర్ సర్వే అనంతరం పలువురికి మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గోరు వెచ్చని నీరు తాగాలన్నారు. వేడి ఆహారం తినాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది చంద్రశేఖర్‌బాబు, వంశీ నాయక్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, నాగరాణి పాల్గొన్నారు.

## కనిగిరి మదరసకు షేక్షావలి రూ.10వేలు విరాళం



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల సేఫ్టీ డ్రైవర్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి కనిగిరి మదరస అభివృద్ధి కోసం ఆయన రూ.10వేలు రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కనిగిరి మదరస సభ్యులకు అందజేశారు. అవసరం ఉన్న వారికి తనకు ఉన్నంతలోనే సహాయం అందజేస్తానని షేక్షావలి సంతోషంగా తెలిపారు.

### ఉపాస్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం





**ఒంగోలు, ప్రభాతవార్త**
టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ఆర్ఫాన్స్ వారి ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఒంగోలు వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం రోజు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమైన వైద్య శిబిరం నందు సుమారు 100 మందికి షుగరు, బి పి, ఈ సి జి మరియు పి ఎఫ్ టి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందచేశారు. వైద్య శిబిరం నందు ఉపాస్ హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డయాబెటాలజిస్ట్, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు, వైద్య శిబిరమునందు వైద్య పరీక్షలు నిర్వహించిన వారిని పరిశీలించి అవసరమైన మందులు అందచేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి పదిహేను రోజుల పాటు ఉచిత ఓపి మరియు నిర్ణీత వైద్య పరీక్షలపై 50 రాయితీ ఇస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియచేశారు. గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం అవుతుంది అని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ తెలియజేశారు. ముఖ్యంగా సాధారణ మరియు మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించుట కొరకు ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్ నందు యెన్ టి ఆర్ వైద్య సేవ మరియు ఈ హెచ్ ఎస్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్టు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ తెలియ చేశారు. ఈ వైద్యశిబిరం నందు మర్లపాడు గ్రామ పెద్దలు, దర్శిగుంట సునీల్, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్, పి ఆర్ ఓ మల్లికార్జున మరియు హాస్పటిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డిని కలిసిన శ్రీపతి సతీష్



**ఒంగోలు, ప్రభాతవార్త**
ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డిని విజయవాడలోని రాష్ట్రకాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీపతి సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు పార్టీ కార్యక్రమాలు ఇన్చార్జి శ్రీపతి సతీష్ వివరించారు. ఇటీవల జరిగిన కొండేపి పంచాయతీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ వేసిన తర్వాత జరిగిన పరిణామాలు సవినియంగా షర్మిల రెడ్డికి సతీష్ వివరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై షర్మిలరెడ్డి సూచనలు కొన్ని చేశారు. పార్టీని బలోపేతం దిశగా త్వరితగతిన వేయాలని పార్టీని బలోపేతం చేయాలని రానున్న పంచాయతీ, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని సతీష్‌కి సూచించారు. తాను చేసిన పార్టీ కార్యక్రమాలన్నీ పార్టీ అధ్యక్షాలకు వివరించిన అనంతరం తమ పార్టీ పనిపట్ల సంతృప్తిని వ్యక్తం చేసి చివరగా రాహుల్ గాంధీని ప్రధానినీ చేయడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని షర్మిళా రెడ్డి సూచించారని సతీష్ తెలిపారు.

### నల్లబర్లి పొగాకు సాగు చేయవద్దు - ఏడిఏ నిర్మల కుమారి



**కొండపి, ప్రభాతవార్త**
ప్రస్తుతం పొగాకుసాగు సీజన్ ప్రారంభమవుతున్నందున నల్లబర్లి పొగాకు రైతులు సాగు చేయవద్దని వ్యవసాయశాఖ ఏడిఏ నిర్మల నిర్మల కుమారి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ముప్పరాజుపాలెం అనకర్లపూడి పెరిదేపి గ్రామాలలో నల్ల బర్లిప్పుగాకు సాగు చేయొద్దని కార్యక్రమంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మాల్యాద్రి అధ్యక్షత వహించి కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ జీవో నెంబర్ ఆర్ 740 నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నల్లబార్లీ పొగాకు సాగును నారు పెంపకాన్ని నిషేధించిందని అన్నారు. నల్లబెల్లి పొగాకు వలన రైతులకు జరిగే నష్టాన్ని గురించి ఆమె రైతులకు వివరించారు, ఈ కార్యక్రమంలో ఏఈఓ కుమార్ వీఏఏ బి.పవిత్ర, గ్రామ రైతులు పాల్గొన్నారు

## విద్యుత్ సౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు



**కొండపి, ప్రభాతవార్త**
కొండపి విద్యుత్, సౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు అని ఒంగోలు విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి అన్నారు. శుక్రవారం కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, హైమావతి ఆధ్వర్యంలో 32 బృందాలు ఏర్పడి మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అనధికారికంగా కేటగిరి మార్చి వాడుతున్న సర్వీసులను, విద్యుత్ చౌర్యం చేసిన 27 సర్వీసులను గుర్తించి దాదాపు రెండు లక్షల 50 వేలు అపరాధ రుసుము విధించామని తెలిపారు. కార్యక్రమంలో సింగరాయకొండ డీఈఈ యుగంధర్, ఏఈ పువ్వాడి శ్రీనివాసులు, కందుకూర్ డివిజన్ పరిధిలోని డీఈఈ లు, ఏఈ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మండలం లంకోజనపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు ఉన్నగిరి వెంకట్రావు వాణిల కుమార్తె ఆరాధ్య మొదటి జన్మదిన వేడుకల్లో దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు పాల్గొన్నారు. చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగమణి - సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, లంకోజనపల్లి గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## ఆర్థిక విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



**కురిచేడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఆర్థిక విద్యా రంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సంఘ నాయకులు ఇందుకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్ వలీ మాట్లాడుతూ సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19వరకు బైక్ జాత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించని యెడల యూటీఎఫ్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడలో రణభేరి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైలవరం శ్రీను, కోశాధికారి కట్ట పూర్ణచంద్రరరావు, అసోసియేట్ అధ్యక్షులు డి.జాన్‌బాబు, మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ నాయకుల వినతి



**కురిచేడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్రశాఖ పిలుపు మేరకు రెండో రోజు సంఘ నాయకులు నిరసన తెలిపారు. కురిచేడులో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రజనీ కుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశల వెంకటస్వామి, శేకర్జరహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీఎస్ శివరామకృష్ణ, షేక్ మస్తాన్‌వలి, కే.మహితేజ, షేక్ నసీమా, అశ్విని, టి.స్వరూప, కే.నర్మదదేవి, స్వాతి పాల్గొన్నారు.

## రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలి

### - జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఒంగోలులో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రజాపరిషత్‌సర్వసభ్య సమావేశంలో హనుమంతుని పాడు ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొని మండలం లోని రైతులుపడుతున్నసమస్యలను హార్టికల్చర్/ అగ్రికల్చర్ డిపార్టుమెంట్ వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆమె తెలిపారు. మండలంలోని నిమ్మ తోటలు రైతులు దాదాపు 1500 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, కానీ పంట చేతికి వచ్చే సమయానికి ధర పడిపోయి కనీసం పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రాలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వారు దృష్టి పెట్టి రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని, అదే విధంగా పెట్టుబడిసాయం కింద రైతులకి వెసులు బాటు కలిగించే దానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కరువుపనులుకూడా రైతులు ఉపయోగించు కునే విధంగా చర్యలు తీసుకోవాలని, హార్టికల్చర్ పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ ఫెసిలిటీ కూడా కల్పించాలని అదే విధంగా వ్యవసాయశాఖ వారిని మండలంలో రైతులు పండించిన అపరాలకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని ఆమె తెలిపారు.

### కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు జైలులో అక్రమంగా అరెస్టు అయి ఉన్న ఒంగోలు 45వ డివిజన్ కార్యకర్తలను దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్‌బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు ఇన్‌ఛార్జ్ చుండూరి రవి ములాఖత్ ద్వారా జైలులో పరామర్శించారు. జైలు బయట ఉన్న బంధువులను ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నగిరికంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా సంఘం అధ్యక్షులు దుంపా రమణమ్మ, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివారావుతో కలిసి పరామర్శించారు.

### రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు సంఘీభావం



**టంగుటూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
శ్రీకాకుళం జిల్లా అంతట సుడిగాలి పర్యటన చేస్తూ నదిగంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర. శ్రీకాకుళం జిల్లాలో మన మాల జాతి ఎంతో ఉప్పొంగే ఉత్సాహంతో ఆప్యాయతతో రాజ్యాంగ పరిరక్షణ యాత్రకి సంఘీభావం తెలుపుతున్నారు.

### కంభంలో నేడు మధ్యాహ్నం వరకు పవర్ కట్

**కంభం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**
కంభం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని జంగంగుంట్ల, కందులాపురం, కంభం టౌన్ మరియు చిన్న కంభం సబ్ స్టేషన్ పరిధిలో గచ్చు కాలువ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకట నరసయ్య ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కావున ఈవిద్యుత్‌అంతరాయంకు ప్రజలు సహకరించాలని కోరారు.



## స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్‌గా చిన్ని ప్రమాణం

### - పలువురు టిడిపి నేతలు, ఆర్యవైశ్యుల అభినందనలు







**అద్దంకి , సెప్టెంబరు 12 ,ప్రభాతవార్త**
స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమములో అద్దంకి నుండి స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణం నుండి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆరవైశ్య నేతలు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావును ప్రమాణ స్వీకారం చేసిన వెంటనేఅదేవేదికపై ప్రత్యేకంగా అభినందించి ,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి అద్దంకి పట్టణం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్యవైశ్య నేతలు అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. ప్రమాణస్వీకారోత్సవానికి అద్దంకి నుండి తరలివెళ్ళిన వారిలో అద్దంకి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జిలు కుందరపు రామారావు, కాకాని అశోక్, పార్టీ ముఖ్యనేతలు గార్లపాటి శ్రీనివాసరావు, చుండూరు మురళి సుధాకర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కురిచేటివెంకట్ సుబ్బారావు (చిన్ని), సింగరకొండ లక్ష్మీనరసింహస్వామి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బోజనపల్లి సత్యనారాయణ, నూకల రామాంజనేయులు, మద్దా ఆంజనేయులు, చిన్ని శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ దేషు పద్మేష్, చామర్తి శ్రీనివాసరావు, రాంబాబు, నేరేళ్ళ గిరి, మల్లికార్జున్, చిన్నికామేశ్వరరావు, కొత్తూరి కోటేశ్వరరావుతోపాటు ఆర్యవైశ్యులు, పార్టీ నేతలు వున్నారు.

8_8.qxd 9/13/2025 12:47 AM Page 1



## 20వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో పర్యటించారు మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సైడు డ్రైన్‌ను పొడిగించాల్సిందిగా కోరారు. సీసీ రోడ్ల కొంత మేర అవసరం ఉండటంతో వాటిని పరిశీలించారు. పలుచోట్ల వీధిలైట్లు ఏర్పాటుకు అధికారులు ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ ఏఈ శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభాని, దినకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బిజినెస్ ఎక్సలెన్స్‌లో ఉత్తమ బిజినెస్ ఎక్స్‌ఫోర్ట్ అవార్డును అందుకున్న శిద్దా సుధీర్



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో విజయవాడ మురళి రిసార్ట్స్‌లో జరిగిన బిజినెస్ ఎక్సలెన్స్‌లో ఉత్తమ బిజినెస్ ఎక్స్‌ఫోర్ట్ అవార్డును అందుకున్న జ్యోతి గ్రానైట్ ఇండియా ఎక్స్‌ఫోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సెంట్రల్ జోన్ చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్, జ్యోతి గ్రానైట్స్ ఎక్స్‌పోర్ట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఓఓ మావులేటి శివరామ్. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, జ్యూరి సభ్యులు విశ్రాంత ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, సత్యనారాయణ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, రీసెర్చ్ ఇన్నోవేషన్ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్ రగ్నేకర్, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసిన దాత నాదెండ్ల



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మండలం కట్టసింగన్నపాలెం వాస్తవ్యులు ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ రాజకీయ నాయకులు నాదెండ్ల అంజయ్య కుమారుడు నాదెండ్ల అనిల్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా కట్ట సింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలకు ఒక్కొక్కరికి 4 చొప్పున 75 మంది విద్యార్థులకు మొత్తం 300 రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జీ హెచ్‌ఎం గొర్రెపాటి వేణు మాట్లాడుతూ పుట్టిన రోజు సందర్భంగా తన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను గుర్తు పెట్టుకొని విద్యార్థులకు ఉపయోగపడే రాత పుస్తకాలు, పెన్నులు ఇవ్వడమనేది అనిల్ తన గ్రామం పట్ల తనకు గల మమకారాన్ని తెలియజేస్తుందని, అలాగే నాదెండ్ల అంజయ్యపాఠశాలకు అందించే సహకారాన్ని కొనియాడారు. ఈకార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, వై.రవికుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి. ఈ సందర్భంగా విద్యార్థుల పలుసమస్యలు, బీసీ,ఎస్సీ,ఎస్టీ హాస్టల్స్ పరిస్థితి, విద్యారంగం ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కళాశాల యొక్క పీపీపీప్లస్ (ప్రభుత్వ,ప్రైవేటీకరణం) విషయాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

## మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి నగరపంచాయతీ పరిధిలోని శివరాజ్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, జ్వరం,జలుబు,దగ్గు ఉన్న వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో దర్శి అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కాశీ చేతన్ ఆధ్వర్యంలో దర్శిలోని ప్రముఖ హాస్పిటల్స్ అధినేతలు బాదం వెంకట హర్షవర్ధన్‌రెడ్డి, మేడికొండ మల్లారెడ్డి, సాయి మణిందర్‌రెడ్డి, డాక్టర్లు ఉచితంగా సేవలందించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, చైర్మన్ దేవతి వరప్రసాదరావు, అధ్యక్షులు చీదెళ్ళ బసవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐడీ కార్డులు, ప్లేట్‌లు, గ్లాసులు పంపిణీ



**దర్శి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఎంపీపీఎస్ చిన్న ఉయ్యాలవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నారాయణ అధ్యక్షతన సమావేశం పాఠశాల నందు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు కే.రఘురామయ్య, బి.రమాదేవి పాల్గొన్నారు. అతిథులుగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కు అబ్దుల్‌హై, జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, మీనిగ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న ఉయ్యాలవాడకు చెందిన ఎస్ఎంసీ చైర్మన్ నారాయణ 30 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, అయ్యప్ప విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే అబ్దుల్ హై, జడ్పీహెచ్ఎస్ రాజంపల్లి హెచ్‌ఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శి మండలం కే.శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి పి.కాశిం, ఎస్ తిరుపతిరెడ్డి, టీఎస్ పురం హెచ్‌ఎం భారతి, రాజంపల్లి హెచ్‌ఎం వెన్నెల శ్రీనివాసరావు, యూటీఎఫ్ కార్యకర్తలు ఏడుకొండలు, కృష్ణా, సుబ్బారావు, కిషోర్, షాను, లాషా, రాంబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై వినతి



**దర్శి, సెప్టెంబర్12, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏపీటీఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా దర్శి మండల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దర్శి మండల డిప్యూటీతహసీల్దార్ వి.వెంకటేశ్వర్లుకి మెమోరాండం సమర్పిస్తున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ దర్శి మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశం జిల్లా అధ్యక్షులు వాకా జనార్ధన్‌రెడ్డి. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, మేము 57 ను తక్షణం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని, 12 పీఆర్సీ కమీషన్ నియమించాలని, అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు



**ముండ్లమూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలో ఆత్మ ప్రకాశం జిల్లా వారి సౌజన్యంతో పులిపాడు,బసవపురం, పసుపుగల్లు గ్రామంలో రైతులు మొక్కజొన్న, వరి సాగు చేస్తున్న పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ పి.సంధ్యారాణి,ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు రైతులకు సూచించారు. పొలాలను సందర్శించి రైతులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు వరిలో ఆకుముడత ఆశించే ప్రమాదం ఉందని ఆకు ముడత నివారణకు కారటాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే ఆత్మ ఏటీఎం కే.రామిరెడ్డి మాట్లాడారు. గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అవినీతి ఎస్సైని సస్పెండ్ చేయాలి

**- సస్పెండ్ చేసేదాకా పోరాటం సాగిస్తాం - సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు**




**పొమూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
అవినీతికి పాల్పడుతున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్, పోలీసు స్టేషన్‌లో అంతాతానై అవినీతి వసూళ్లకు పాల్పడుతున్న కానిస్టేబుల్ చంద్ర నాయక్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు ఊసా వెంకటేశ్వర్లుపై ఎస్సై వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్ర నాయక్‌ల దాడిని ఖండిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కే.మాల్యాద్రి అధ్యక్షతన శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ సీఎస్‌పురం ఎస్సై వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్రనాయక్ తోడుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వినాయక చవితి పండుగకు అన్ని అనుమతులు ఉచితమని వాడవాడలా పండుగ జరుపుకోవాలని ప్రభుత్వం చెప్తుంటే సీఎస్‌పురం ఎస్సై వినాయక విగ్రహం ఏర్పాటుకు రూ.2వేలు, డీజే వాడుకుంటే రూ.20వేలు, పాట కచేరి ఏర్పాటు చేస్తే రూ.40వేలు ఇలా ప్రతిదానికి ఓ రేటు నిర్ణయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఆటో కార్మికులపై దౌర్జన్యం చేయడం, కోర్టు వివాదంలో ఉన్న విషయాలలో కూడా కలుగజేసుకుని పంచాయతీ చేయడం, బూతులు తిడుతూ దాడికి పాల్పడడం, తన అవినీతిని ప్రశ్నించిన వారిపై దాడి చేయడం షరా మామూలుగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సై అవినీతిని ప్రశ్నించిన సీపీఎం పార్టీ నాయకులు ఊసా వెంకటేశ్వర్లు ఓ రైతుకు సంబంధించిన భూ వివాదంలో రైతుతో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లిన సమయంలో అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడంను ఆయన తీవ్రంగా ఖండించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న భూ సమస్యపై ఎస్సై ఓ రైతుని పిలిచి పంచాయతీ చేస్తుంటే ఆ రైతు తరుపున పంచాయతీకి వెళ్లిన ఊసా వెంకటేశ్వర్లు పై ఎస్సై దాడి చేయడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అనంతరం సుందరయ్య భవన్ సెంటర్ నుంచి సీఐ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సీఐ భీమా నాయక్ అందుబాటులో లేని కారణంగా సీఐ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షేక్ షమీ, సీఎస్‌పురం సీపీఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, ఎస్.తిరుపతిరెడ్డి, ఎం.రత్నారెడ్డి, యాట వీరనారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ అల్లాబక్షు, షేక్ కాశీం,సాహెబ్, సయ్యద్ గౌస్‌భాషా, షేక్ మహాపీరా, ఎం.రామయ్య, షేక్ నాయబ్, సీహెచ్ ఆదినారాయణ, అంకేపల్లి వెంకటేశ్వర్లు, పొదిలి నరసింహులు, జయరావు, షేక్ గౌస్ భాషా పలువురు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఓర్వలేక వైసీపీ అసత్య ప్రచారాలు

**- టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు**



**పొమూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
పొమూరులో శుక్రవారం స్థానిక మహాలక్ష్మి మిల్క్ డైరీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అధ్యక్షతన విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సహకారంతో నన్ను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు, కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషితో పార్టీ బలోపేతం చేసి ప్రతి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరవేస్తాం అని తెలిపారు. మార్కొండపురం గ్రామంలో వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తూ కాలాక్షేపం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి ప్రజల కోసం పోరాడకుండా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వ లేక అబద్దాలు చెబుతున్నారు అన్నారు. కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్దులకు నెలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు శాశ్వత వికలాంగులకు రూ.15 వేలు, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, యువతకు 8లక్షల ఉద్యోగాలు, రైతులకు ఏడాదికి రూ.20వేలు సాయం అందించింది అని వివరించారు. టౌన్ అధ్యక్షుడు అమీర్ బాబు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు దుల్హన్ పథకాన్ని తుంగలో తొక్కిన నాయకుడు జగన్. కానీ కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తోంది అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు,టౌన్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్జాన్, ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు,నాగేంద్ర చారి, కౌలూరి ఖాజా రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్



**చీరాల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
చీరాల క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించి కన్సన్ డిపార్టుమెంట్ కు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీఇచ్చారు. సుమారుగా 80 అర్జీలు రాగా పెన్షన్ 15 అర్జీలు, ఇళ్ల స్థలాలు 60 అర్జీలు, ఇతర సమస్యలు 5 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కౌన్సిలర్ సత్యానందం, యర్రశివ నాగమల్లేశ్వరరావు, నాగలక్ష్మి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

### బాపట్లలో మెడికల్ కాలేజీని ప్రభుత్వ నిధులతో నిర్మించాలంటూ నిరసన



**వేటపాలెం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
చీరాల నియోజకవర్గం వేటపాలెం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట బహుజన్ సమాజ్‌పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చిట్టిమల సంగీతరావు ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహుజన సమాజ్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుదే రాజారావు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ గుదే రాజారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు వైద్య విద్య ఈ కూటమి ప్రభుత్వం అందనీయకుండా చేస్తున్న కుట్రలో భాగమైన ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళన చేయడానికి అయినా బహుజన సమాజ్ పార్టీ వెనకాడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు జ్యోతి, మండల నాయకులు శివప్రసాద్, ఏసేపు, లక్ష్మీ, పార్వతి, వేపూరి జోసెఫ్ పాల్గొన్నారు.

### పందిళ్ళపల్లి హైస్కూల్‌లో ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు



**వేటపాలెం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
వేటపాలెం మండలంలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్‌ను ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ బౌహార్ రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అధికార భాష అయిన హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని , ఉత్తర భారతదేశంలో పర్యటించాలంటే హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు. హిందీ ఉపాధ్యాయని శంఖం లలితా పరమేశ్వరి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో హిందీ భాష ద్వారా దేశం యావత్తు ఐక్యమత్యంతో పోరాటం వల్ల స్వాతంత్ర్యం సాధించామని, ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే బాషలలో హిందీ నాలుగో స్థానంలో ఉందని అన్నారు. మరో హిందీ ఉపాధ్యాయుడు ప్రసన్న ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీ బౌహార్ రాజేంద్ర సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ భాషా దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుద్ది మోహన్‌రావు, కుప్పాల శ్రీనివాసరావు, సూర్య నారాయణ, నాగరాణి, సీహెచ్ భవానీ దేవి, ప్రభావతి, పి.చైతన్య, బ్రహ్మయ్య, రాజా, అంకయ్య, కే.నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలి

**- జడ్పీటీసీ కస్తూరిరెడ్డి**



**కనిగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
ఒంగోలులో జిల్లా పరిషత్ సమావేశంలో శుక్రవారం కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకుసకాలంలో యూరియా సరఫరా చేయాలని,అలాగే మినుములు,శనగలు వంటి విత్తనాలు కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులుఇబ్బందులు పడకుండా పంటలుసాగు చేసుకునేలా వ్యవసాయాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతు పంటకు పంట భీమా,ఈ క్రాప్ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కస్తూరిరెడ్డి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# ఉచిత మెడికల్ క్యాంపుకు విశేష స్పందన








**చీరాల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
చీరాల మండలం ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత హైస్కూల్ నందు ప్రొటెక్ట్ సంస్థ ఫినిష్ సంస్థల ఆధ్వర్యంలో ఐటీసీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ చీరాల వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపుని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ సహకారం మేరకు ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎన్.రామకృష్ణా రావు హెచ్‌ఆర్ మేనేజర్ ఐటీసీ వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని తగిన వైద్య సలహాలు సూచనలు పొంది మీ ఆరోగ్యం తద్వారా మీ కుటుంబాలు బాగుండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఐటీసీ ద్వారా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్ఎన్ రెడ్డి, ఈహెచ్ఎస్ మేనేజర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం శనివారం కూడా ఉంటుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎల్ఎటీబీ డాక్టర్ షేక్ మహ్మద్ సాధిక్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్నటువంటి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎవరికైనా సరే దగ్గు రెండు వారాలకు మించి ఉన్నట్లయితే వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించాలని క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి నివారణ చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా తెలియపరిచారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఈ ఉచిత వైద్య శిబిరానికి హాజరైన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు సూచించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ మహమ్మద్ సాదిక్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ యాకబ్, డాక్టర్ జ్యోతిర్మయి,డిస్ట్రిక్ట్ మెడికల్ స్టాఫ్, పీహెచ్‌సీ ఈపురుపాలెం మెడికల్ స్టాఫ్, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి ఫినిష్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నవీన్, ఫినిష్ సంస్థ సిబ్బంది, నారాయణ మోహన్‌రెడ్డి, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

### కనిగిరి పట్టణ తెలుగు యువత కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణ తెలుగు యువత కమిటీ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అమరావతి మైదానంలో జరిగిన సమావేశంలో అభినందించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేయాలని కోరారు. తెలుగు యువత అధ్యక్షుడిగా అచ్చాల రవి, ఉపాధ్యక్షుడిగా పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి, కోటపాటి రమణయ్య,ప్రధానకార్యదర్శిగా ఇండ్లహరేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి బొందలపాటి మురళీమోహన్, బి.నాగేంద్రబాబు,బి.పార్థసారథి, కార్యదర్శులు షేక్ ఖాజా నాయబ్ రసూల్, జి.వెంకట సాయి నవీన్ కుమార్, డి.చిన్న కాశయ్య, కమిటీ సభ్యులను అభినందించారు.

## తెలుగు యువతకు అధ్యక్షుడిగా అచ్చాల రవి, ఉపాధ్యక్షుడిగా పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి నియామకం



**కనిగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణ తెలుగు యువతకు కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేశారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా అచ్చాల రవి, ఉపాధ్యక్షుడిగా పోలంరెడ్డి రామకృష్ణారెడ్డిని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం నియమించారు. ఈ నియామకాల సందర్భంగా పట్టణంలోని తెలుగు యువత కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షుడు అచ్చాల రవి, ఆర్కే గ్రాండ్ అధినేత పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగు యువత కమిటీలో స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసి, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాం. యువలతో పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా చాటి చెప్పి, కొత్త శక్తిని సమకూరుస్తాం అని తెలిపారు. తెలుగు యువత కమిటీ సభ్యులను పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అభినందించారు. ఈ నియామకాలతో కనిగిరి పట్టణ తెలుగు యువతలో కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది. పార్టీ శ్రేణులు నూతన నాయకత్వం ద్వారా మరింత చురుకుదనం ప్రదర్శిస్తారని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనిగిరి టీడీపీ పట్టణ కార్యదర్శిగా చీర్ల నాగార్జున నియామకం



**కనిగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పాతూరు గ్రామానికి చెందిన చీర్ల నాగార్జునను ఎంపిక చేశారు. శుక్రవారం జరిగిన ఈ నియామకాన్ని టీడీపీ శ్రేణులు హర్షంగా స్వాగతించాయి. ఈ సందర్భంగా చీర్ల నాగార్జున మాట్లాడుతూ నన్ను మున్సిపాలిటీ టీడీపీ పట్టణ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి,తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉండి, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా చాటి చెప్పడానికి శ్రమిస్తాను అని తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ నాగార్జునను అభినందించారు. నూతన పట్టణ కార్యదర్శి నియామకంతో కనిగిరి టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. పార్టీకి మరింత చైతన్యం తీసుకొస్తారనే విశ్వాసాన్ని స్థానిక నాయకులు వ్యక్తం చేశారు.

## పార్టీ బలపడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**



**కనిగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీని గ్రామం, వార్డు స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో టౌన్ కమిటీ, వార్డు కమిటీలు, అనుబంధ సంఘాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి తప్పకుండా గుర్తింపు వస్తుంది. కష్టపడితే వారికి తగిన గౌరవం లభిస్తుంది. పార్టీ బలపడటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. గ్రామం, వార్డు స్థాయి నుంచి బలమైన నిర్మాణం ఉంటేనే రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ విజయ పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఎమ్మెల్యే టౌన్ కమిటీలో పట్టణ అధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్, ఉపాధ్యక్షుడిగా కొలిపర్తి మారుతి, ప్రధాన కార్యదర్శిగా చీర్ల నాగార్జున పేర్లను ప్రకటించారు. అలాగే క్లస్టర్ ఇన్‌ఛార్జీలుగా బల్లు బాలబాబు, షేక్ రహిమాన్ నియమితులయ్యారు. అదే విధంగా కనిగిరి మున్సిపాలిటీలో 20వార్డుల అధ్యక్షులుగా కింది పేర్లు ప్రకటించారు. వార్డు అధ్యక్షులుగా ముకుంద, వార్డు అధ్యక్షులుగా శేఖర్, వార్డు ఏనుగు శ్రీను, వార్డు శ్రీనివాసులు, వార్డు రామసుబ్బారెడ్డి,వార్డు పిల్లికిరణ్ కుమార్‌రెడ్డి,వార్డు అధ్యక్షుడిగా రిటా ఫయాజ్, సుబ్బయ్య, ఇస్మాయిల్, మిన్ను, ఆలిస్, గుడిపాటిఖాదర్, బొగ్గరపు సద్గురు, జక్రెయ్య, వెన్నా శ్రీను,మనోజ్, కొట్టేప్రసాద్, అహ్మద్, అబ్దుల్ ఖాదర్, ప్రకటన అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీలకు అభినందనలు తెలియజేసి, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు ఉత్సాహంగా స్పందించి, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తామని తెలిపారు.

13-9Pg5 9_13-9Pg5.qxd 9/12/2025 10:12 PM Page 1



# నేటి నుంచి ప్రధాని ఐదు రాష్ట్రాల్లో పర్యటన



## రూ.72వేల కోట్ల పనులకు శంకుస్థాపనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఆ ఐదు రాష్ట్రాల్లో మిజోరం, అస్సాం, పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ నెల 13 నుంచి 15 వరకు అంటే రేపటి నుంచి సోమవారం వరకు ఈ పర్యటనలు జరగనున్నాయి. ఈ పర్యటనల్లో భాగంగా ప్రధాని మొత్తం రూ.71,850 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో రూ.9 వేలకోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసే బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌లో రూ.7,300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంఫాల్‌లో రూ.1200 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి బహిరంగసభలో మాట్లాడతారు. సాయంత్రం 5 గంటలకు అస్సాం రాజధాని గువాహటికి చేరుకుంటారు. అక్కడ భారత రత్న భూపేన్ హజారికా 100వ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. ఆదివారం అస్సాంలో రూ.18,530 కోట్ల విలువైన పారిశ్రామిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11 గంటలకు దర్రాంగ్‌లో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

అనంతరం అస్సాం బయో ఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు గోలాఘాట్‌లో నుమాలిగఢ్ రిఫైనరీని ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో 16వ 'కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025' ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు.

అనంతరం బీహార్‌కు వెళ్లి పూర్ణియా ఎయిర్‌పోర్టు కొత్త టెర్మినల్ బిల్డింగును ప్రారంభిస్తారు. అనంతరం పూర్ణియాలో రూ.36 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత నేషనల్ మఖానా బోర్డును ప్రారంభిస్తారు.



ఉదయం ఢిల్లీ.. మధ్యాహ్నం ముంబయి

# హైకోర్టులకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలోని హైకోర్టులో శుక్రవారం తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఆగంతుకులు పంపిన ఒక ఈమెయిల్ భద్రతా వర్గాలను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఈ బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే హైకోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం లోపు హైకోర్టులో బాంబు పేలుతుందని హెచ్చరిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ పంపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించారు.ముందు జాగ్రత్త చర్యగా హైకోర్టు ప్రాంగణంలోని సిబ్బందిని, న్యాయవాదులను, ఇతర సందర్శకులను వెంటనే బయటకు పంపించి, ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి హుటాహుటిన హైకోర్టుకు చేరుకున్నాయి. కోర్టులోని ప్రతి గదిని, ప్రాంగణంలోని అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాయి. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కనిమొళి తేవిడియా పేరుతో వచ్చిన ఆమెయిల్‌లో ఈ వారంలో తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుమారుడి పైనా దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. బాంబే హైకోర్టుకుకూడా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు ముంబై పోలీసులు తెలిపారు. కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానం ప్రాంగణంలో ఎలాంటి పేలుడుపదార్థాలు లభ్యంకాలేదని,ఇది నకిలీబాంబు బెదిరింపుగా గుర్తించినట్లు తెలిపారు. మధ్యాహ్నం బాంబేహైకోర్టుకు బాంబుబెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో అధికారులు అప్రమత్తమ య్యారు. లాయర్లను, కేసుల విచారణ కోసం వచ్చిన ప్రజలను, కోర్టు సిబ్బందిని వెంటనే ఖాళీ చేయించారు. పోలీసులు,బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తనిఖీల్లో తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మెయిల్ పంపిన వ్యక్తిని ట్రేస్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# భారత్ సైనికుల్ని కరిగించేందుకు చైనా ఆయుధాలు

## అమెరికా సెనెటర్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** అమెరికా సెనెటర్ బిల్ హాగెర్టీ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత సైనికులను కరిగించేందుకు చైనా విద్యుదయస్కాంత ఆయుధాలను వాడిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందట సరిహద్దు ఘర్షణ సందర్భంగా డ్రాగన్ వాటిని మోహరించిందని పేర్కొన్నారు. పరోక్షంగా గల్వాన్ ఘర్షణను ప్రస్తావించారు. 'సుదీర్ఘ కాలంగా చైనా, భారత్ మధ్య సంబంధాలు విశ్వాసలేమితో కొనసాగుతున్నాయి. ఐదేళ్ల క్రితం వివాదాస్పద సరిహద్దు వద్ద ఘర్షణపడ్డాయి. అప్పుడు చైనా విద్యుదయస్కాంత ఆయుధాలను ఉపయోగించింది' అని బిల్ వ్యాఖ్యలు చేశారు. భారత్–చైనా సైనికుల మధ్య 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ జరిగింది. ఈ సమయంలో ఇరు దేశాల సైనికులు రాళ్లు, కర్రలతో తలపడ్డారు. ఈ ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు అమరుల య్యారు. తమవైపు ఐదుగురు సైనికులు మరణించినట్లు చైనా చెప్పింది. అయితే మృతుల సంఖ్య అంతకంటే ఎక్కువే ఉండొచ్చని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటన తర్వాత రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల కాలంలో రెండు దేశాల సంబంధాలు కాస్త మెరుగుపడుతోన్న వాతా వరణం నెలకొంది. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి)వెంబడి కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ గతేడాది కీలక గస్తీ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసి వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏడేళ్ల తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఎస్‌సిఒ సదస్సులో పాల్గొన్నారు. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగిస్తోన్న తరుణంలో ఈ పర్యటన జరిగింది.ఇది అమెరికాకు షాకిచ్చింది. ఈ నేపథ్యంలోనే సెనెటర్ వ్యాఖ్యలు రావడం గమనార్హం.

# భారత్‌ను చైనాకు దూరం చేయడమే మా లక్ష్యం



## యుఎస్ రాయబారి సెర్గీ గోర్

**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** భారత్–అమెరికాల మధ్య టారిఫ్ వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య సంబంధాలపై భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ కీలక వ్యాఖ్యల చేశారు. భారత్‌ను చైనాకు దూరం చేసి యుఎస్‌కు దగ్గర చేసుకోవడమే తమ ప్రాధాన్య మన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను యుఎస్ వైపునకు తీసుకురావడం అత్యంత ముఖ్యమైన విషయమని గోర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో దాన్ని చైనా నుంచి దూరం చేయాల్సి ఉందన్నారు. తమ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్‌జి కోసం భారత్ ప్రధాన మార్కెట్ కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొనసాగుతున్న వాణిజ్య చర్చలు కూడా ఆ దిశగానే ఉన్నాయన్నారు. యుఎస్ మొత్తం జనాభా కంటే భారత్‌లో మధ్యతరగతి ప్రజలే ఎక్కువన్నారు. ఆ దేశ మార్కెట్ అమెరికాకు అపారమైన అవకాశాలను అందిస్తుందన్నారు.

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య నెలకొన్న అడ్డంకులు త్వరలోనే తొలగిపోతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం, అక్కడి ప్రజలతో యుఎస్ సంబంధాలు దశాబ్దాల నాటివన్నారు. చైనీయులతో కంటే తమతోనే వారికి గొప్ప స్నేహం ఉందన్నారు. భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ఇతర ప్రతినిధులను ట్రంప్ అమెరికాకు ఆహ్వానించారని గోర్ పేర్కొన్నారు. వారు, అమెరికా వాణిజ్య ప్రతినిది రాయబారి జామిసన్ గ్రిర్‌తో సమావేశమవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆశించదగిన ఒప్పందం జరిగే అవకాశం ఉందన్నారు. అమెరికా ప్రజల ప్రయోజనాలు, పరస్పర ప్రయోజకరమైన వాణిజ్య ఒప్పందాలను తాము కుదుర్చుకుంటామన్నారు.

**ఈ యేడాది చివర్లో భారత్‌కు ట్రంప్?:** నవంబరులో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశంఉందని సెర్గీ గోర్ తెలిపారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నారన్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు.

**భారత్‌పై సుంకాలకు జి-7 దేశాలపై ఒత్తిడి:** ఇదిలా ఉండగా ఉక్రెయిన్‌లో యుద్ధం ముగింపునకు రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని అమెరికా చేస్తోంది. అందులో భాగంగా ఆయా దేశాలపై 50-100శాతం సుంకాలు విధించాలని జి-7దేశాలపై ట్రంప్ సర్కారు ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. జి-7 దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) విడియో కాల్‌లో మాట్లాడుకున్నారు. ఇందులో సుంకాల విధింపుపై చర్చించుకున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది.

కత్తితో తల నరికి.

# అమెరికాలో భారత సంతతి వ్యక్తి దారుణహత్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. డాలస్ నగరంలోని ఓ మోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న చంద్రమౌళి నాగమల్లయ్య (50)ను సహోద్యోగి కత్తితో నరికి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటల్ మేనేజర్ నాగమల్లయ్య వద్ద మార్టినెట్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. బుధవారం మల్లయ్య, మార్టినెజ్‌ల మధ్య చిన్న విషయంపై వాగ్వాదం జరిగింది. నిందితుడు మార్టినెజ్ మోటల్ గదిని శుభ్రం చేస్తుండగా.. విరిగిపోయిన వాషింగ్ మెషీన్‌ను ఉపయోగించవద్దని తెలిపాడు. ఈ విషయాన్ని తనకు డైరెక్ట్‌గా చెప్పకుండా మరో మహిళా ఉద్యోగితో చెప్పిం చడంతో మార్టినెజ్ ఆగ్రహానికి గురయ్యాడు. ఈ క్రమంలో వీరి మధ్య వాగ్వాదం పెరగడడంతో ఆవేశంలో మార్టినెజ్, మల్లయ్యను కత్తితో పలుమార్లు పొడిచాడు. అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, వెంటాడి అతడి తలను నరికి చెత్తకుప్పలో పడేశాడు. ఈ దాడిని ఆపేందుకు బాధితుడి కుటుంబసభ్యులు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ఈ హత్యపై భారత కాన్సులేట్ ఎక్స్‌లో స్పందించింది. మల్లయ్య హత్య తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. నిందితుడిని పోలీ సులు అదుపులోకి తీసుకున్నారని వెల్లడించింది. బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారికి సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

# హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం

## తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్



**హోసూరు, సెప్టెంబరు 12:** తమిళనాడులోని పారిశ్రామిక నగరం హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. కృష్ణగిరి జిల్లాలో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో 2,000 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. హోసూరులో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సదస్సు వేదికగా తమిళనాడు ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. మొత్తం 92 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, వీటి ద్వారా రాష్ట్రానికి రూ.24,307 కోట్ల పెట్టుబడులు రానున్నాయని స్టాలిన్ తెలిపారు. కొత్తపరిశ్రమల రాకతోప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 49,353 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో 53 పెద్ద కంపెనీలతో రూ.23,303 కోట్లకు, ఎంఎస్‌ఎంఈ శాఖ ద్వారా 39 సంస్థలతో రూ.1003.85 కోట్లకు ఒప్పందాలు జరిగాయి.సభలో సీఎంస్టాలిన్ మాట్లాడుతూ, 'మ్యాన్ ఆఫ్ స్టీల్' మాదిరి తాను తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించేలా ఉంటాయని అన్నారు. గతంలో ఒక చిన్న పట్టణంగా ఉన్న హోసూరు, నేడు దేశవిదేశీ పారిశ్రామికవేత్తల ను ఆకర్షించే స్థాయికి చేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో అధునాతన ఐటీ పార్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇటీవలే జర్మనీ, ఇంగ్లండ్ పర్యటనల ద్వారా రూ.15,516 కోట్ల పెట్టుబడులు సాధించామని, ఆ ఉత్సాహంతోనే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,000 మందికి ఉపాధి కల్పించేలా రూ.1600 కోట్ల విలువైన నాలుగు కొత్త పథకాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. తమ నాలుగన్నరేళ్ల పాలనలో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 77 శాతం ఇప్పటికే ఫ్యాక్టరీల రూపంలో కార్యరూపం దాల్చాయని స్టాలిన్ వివరించారు.

# బీహార్ ట్రిక్కులు తమిళనాడులో చెల్లవు

## ఓటర్ల జాబితా సవరణపై మంత్రి దురైమురుగన్



**వెల్లూరు, సెప్టెంబరు 12:** తమిళనాడులో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జరగనివ్వమని డీఎంకే సీనియర్ నేత, ఆ రాష్ట్ర మంత్రి దురై మురుగన్ అన్నారు. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు ఒప్పుకోవడానికి ఇది బీహార్ కాదు. తమిళనాడు. ఇక్కడ ఆ ట్రిక్కులు పనిచేయవు' అని ఆయన వ్యాఖ్యానించారు. తమిళనాడు రాష్ట్రం బీహార్ లాంటిది కాదని, ఇక్కడి ప్రజలు రాజకీయంగా బాగా చైతన్యం కలిగి ఉన్నారని దురై మురుగన్ అన్నారు. తమిళులను తప్పుదోవ పట్టించడం ఎవరివల్లా కాదని చెప్పారు. వెల్లూరులో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీహార్‌తో పోల్చితే తమిళనాడులోపరిపాలన,నాయకత్వం మెరుగ్గా ఉన్నాయని అన్నారు.మాకు దళపతి నాయకత్వం ఉన్నదని, ఇక్కడ ఆ ట్రిక్కులు పనిచేయవని వ్యాఖ్యానించారు. ఇప్పటికే బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కేంద్రఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సవరించింది. అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఈసీ హడావిడిగా ఓటర్ల జాబితాను సవరించడం వివాదాస్పదమైంది. ఎన్నికల సంఘం కేంద్రంలోని అధికార బీజేపీకి అనుకూలంగా ఓట్ల చోరీకి పాల్పడుతున్నదని విమర్శలు వెల్లువె త్తాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌చేపట్టే అంశంపై ఎన్నికల సంఘం సమాలోచనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రయత్నాలను మీడియా దురై మురుగన్ ముందు ప్రస్తావించింది. దాంతో ఆయన పైవిధంగా స్పందించారు.



# చక్రం ఊడిపోవడంతో స్పైస్‌జెట్ వెంటనే టేకాఫ్

**కాండ్లా(గుజరాత్), సెప్టెంబరు 12:** సాధారణంగా విమానంలో ఏలోపం తలెత్తినా పెను ప్రమాదానికి దారితీస్తుంది. అందుకే విమానాల టేకాఫ్‌కు ముందు సుదీర్ఘ తనిఖీ ప్రక్రియ ఉంటుంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగినప్పటి నుంచి తనిఖీలు మరింత ఎక్కువయ్యాయి. ఏ చిన్న లోపం ఉన్నా టేకాఫ్‌కు ముందే విమానాలను నిలిపేస్తున్నారు. ఒకవేళ టేకాఫ్ అయిన తర్వాత సమస్యను గుర్తిస్తే వెంటనే తగుజాగ్రత్తలు తీసుకుని సేఫ్‌లాండ్ చేస్తున్నారు. శుక్రవారం కాండ్లా నుంచి ముంబైకి వెళ్తున్న స్పైస్‌జెట్ విమానానికి కూడా పెనుముప్పు తప్పింది. కాండ్లా ఎయిర్‌పోర్టు నుంచి విమానం టేకాఫ్ అయ్యింది. కానీ ఆ తర్వాత ఆ విమానం బయటివైపు చక్రం ఊడిపోయి రన్‌వేపై కనిపించింది. దాంతో పైలట్‌ను అప్రమత్తం చేసి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమనాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. శుక్రవారం మధ్యాహ్నం 15.51 గంటలకు విమానం సురక్షితంగా ముంబై ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. ఈ విషయాన్ని స్పైస్ జట్ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు.


# సంస్థ సిబ్బందికి బ్రిటిష్ ఎయిర్‌వేస్ కొత్తరూల్స్

**లండన్, సెప్టెంబరు 12:** ప్రముఖ విమానయాన సంస్థ బ్రిటిష్ ఎయిర్‌వేస్ తమ పైలట్లు, క్యాబిన్ సిబ్బంది కోసం కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది.



సంస్థ ప్రతిష్ఠ, సిబ్బంది వృత్తిపరమైన రూపాన్ని కాపాడే లక్ష్యంతో ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఇకపై సిబ్బంది యూనిఫాంలో ఉన్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో కాఫీ, టీ లేదా ఇతర శీతల పానీయాలు తాగడంపై పూర్తి నిషేధం విధించింది. విమాన సిబ్బంది యూనిఫాంలో ఉండగా కేవలం నీళ్ల మాత్రమే తాగేందుకు అనుమతి ఉంది. అయితే, ఆ నీటిని కూడా ఇతరులకు పెద్దగా కనిపించకుండా జాగ్రత్తగా తాగాలని స్పష్టం చేసింది. కాఫీ, టీ వంటి ఇతర పానీయాలను కేవలం సిబ్బందికి కేటాయించిన స్టాఫ్ రూములు లేదా కేఫ్టేరియాలలో మాత్రమే సేవించాలని ఆదేశాలు జారీ చేసింది. పానీయాలకే పరిమితం కాకుండా, సిబ్బంది సోషల్ మీడియా వాడకంపై కూడా బ్రిటిష్ ఎయిర్‌వేస్ కఠిన ఆంక్షలు విధించింది. తాము బస చేసే లేఓవర్ హోటళ్లకు సంబంధించిన ఫొటోలు లేదా వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని పూర్తిగా నిషేధించింది. అధునాతన ఏఐ టూల్స్ ద్వారా ఫొటోల బ్యాక్‌గ్రౌండ్‌ను విశ్లేషించి హోటల్ లొకేషన్‌ను గుర్తించే ప్రమాదం ఉందని, ఇది సిబ్బంది భద్రతకు ముప్పుగా పరిణమించవచ్చని కంపెనీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ఉన్న హోటల్ కంటెంట్‌ను కూడా తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. సిబ్బంది యూనిఫాంలో విధులకు రావడం, ఇంటికి వెళ్లడం వంటివి కూడా చేయకూడదని ఆదేశించింది. సిబ్బందిపై బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఇలాంటి కఠిన నిబంధనలు విధించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా విధుల్లో ఉన్నప్పుడు యూనిఫాంలో ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని నిషేధించింది. సంస్థ తన బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకునేందుకే ఈ మార్పులు చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఈ నిబంధనలపై సిబ్బందిలో అంతర్గతంగా విమర్శలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

# బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారోకు 27 యేళ్ల జైలు



**బ్రాసిలియా, సెప్టెంబరు 12:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకి జైలు శిక్ష పడింది. సైనికకుట్ర కేసులో బోల్సోనారోకి 27 ఏండ్ల 3 నెలల జైలు శిక్ష విధిస్తూ ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 2022 ఎన్నికలలో తన ప్రత్యర్థి, వామపక్ష నాయ కుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా చేతిలో ఓడిపోయిన తర్వాత కూడా అధికారాన్ని చేజిక్కించుకోవాలని బోల్సోనారో కుట్ర పన్నినట్లు తేలడంతో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్యానెల్ శిక్ష ఖరారు చేసింది. దీంతో ప్రజాస్వామ్యాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిన కేసులో జైలు శిక్ష పడిన మొదటి మాజీ అధ్యక్షుడిగా నిలిచారు. 2022 నాటి ఎన్నికల్లో ఓటమి తర్వాత బోల్సోనారో మద్దతుదారులు రాజధాని బ్రసీలియాలో విధ్వంసం సృష్టించారు. దేశాధ్యక్షుడి అధికార నివాసం, పార్లమెంటు, సుప్రీం కోర్టు భవనాల్లోకి చొరబడి ధ్వంసం చేశారు. బోల్సోనారో నేతృ త్వంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం చర్యలు తీసుకో వాలని, డి సిల్వాను దింపేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులను రెచ్చగొడుతూ 'అధికారం మీ చేతుల్లోనే ఉంది. సైన్యం ఇప్పటికీ నా మాటే వింటుంది. దొంగల పాలనను కూలదోయండి' అంటూ బోల్సోనారో పిలుపునిచ్చారు. దేశ సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం కారణంగా లూలా డిసిల్వా గెలుపొందారని, ప్రజల ఓట్ల కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోల్సోనారో కొట్లాటలను ప్రేరేపించినట్లుగా ఉందని దేశ ప్రాసిక్యూటర్ జనరల్ అభ్యర్థనమేరకు సుప్రీంకోర్టు ఆయనతోపాటు మరో 33 మందిపై విచారణకు అనుమతించింది. కాగా, తన మిత్రుడు బోల్సోనారోకు శిక్ష విధించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించారు.

# 51కి చేరిన నేపాల్ కల్లోల మృతులు

**ఖాట్మండు, సెప్టెంబరు 12:** హిమాలయదేశం నేపాల్‌లో అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో మృతులసంఖ్య 51కి పెరిగింది. వారిలో 30మంది బుల్లెట్‌గాయాలతో మరణించిన వారు ఉన్నారు. మిగతా 21మంది మంటలు అంటుకుని, ఇతర గాయాలతో మరణించారు. మృతుల్లో పౌరులతోపాటు పోలీసులు కూడా ఉన్నారు. నేపాల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం మధ్యాహ్నం ఈ వివరాలను వెల్లడించింది. కాగా, నేపాల్ రాజధాని ఖాట్మండులో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. దాంతో కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించే కార్యక్రమం మొదలైంది. ఈ క్రమంలో ఆస్పత్రి పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యులు,బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా వందలమంది గాయాలతో చికిత్స పొందుతుండటంతో మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

# కిర్క్ హంతకుడిని పట్టుకున్న పోలీసులు: ట్రంప్



**న్యూయార్క్, సెప్టెంబరు 12:** కన్జర్వేటివ్ నేత, పొలిటికల్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఛార్లీ కిర్క్‌ను హత్య చేసిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఉటా వాలీ యూనివర్సిటీలో ప్రసంగిస్తున్న కిర్క్‌ను నిందితుడు ఓ బిల్డింగ్ రూఫ్ మీద నుంచి షూట్ చేసి పరారీ అయ్యాడు. అయితే ఆ నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నట్లు ట్రంప్ చెప్పారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. నిందితుడికి సన్నిహితంగా ఉన్న వ్యక్తే అతని సమాచా రాన్ని ఇచ్చినట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ వ్యక్తి ఎవరన్న అంశాన్ని చెప్పబోనన్నారు. కానీ దీనికి సంబంధించిన అప్డేట్స్ ఉంటాయన్నారు. కొన్ని క్షణాల క్రితం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నట్లు సమాచారం తనకు అందినట్లు ట్రంప్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. స్థానిక అధికారులు అద్భుతంగా పనిచేసినట్లు ట్రంప్ మెచ్చుకున్నారు. కిర్క్ హంతకుడికి డెత్ పెనాల్టీ విధిస్తారని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. కిర్క్ చాలా మంది వ్యక్తి అని, కానీ ఆయన హత్యకు గురికావడం సరిగా లేదన్నారు. కిర్క్‌ను హత్య చేసిన ఘటనకు చెందిన షూటింగ్ వీడియోను చూడాలని లేదన్నారు. కిర్క్‌ను అలా చూడటానికి ఇష్టం లేదన్నారు. చాలా దారుణంగా ఆవీడియో ఉన్నట్లు తెలిసిందన్నారు. నిందితుడి తండ్రే సమాచారం ఇచ్చినట్లు ఓ దశలో ట్రంప్ పేర్కొన్నారు. షూటర్ వయసు 28 లేదా 29 ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు.

## సంక్షిప్తంగా..

# కర్ణాటకలో మళ్లీ కులగణన: సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు, సెప్టెంబరు 12:** రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గతంలో ఇచ్చిననివేదికను అంగీకరించబోమని సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడిం చారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిది గనక ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలను తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమని ఆయన అన్నారు. సమాజంలో అనేక కులమతాలతో పాటు సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని ప్రజలం దరికీ సమాన సామాజిక న్యాయం జర గాలని రాజ్యాంగం చెబుతోంది.దాని ప్రకారమే ప్రజల మధ్య అసమానతలను తొలగించి ప్రజా స్వామ్యానికి బలమైన పునాదులు సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుంది అని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్ణాటక వెనుకబడిన కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణనచేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాష్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయా రుచేసి గతేడాది సర్కార్‌కు సమర్పించిన విషయం తెలిసిందే.

# ట్రంప్ వ్యవహారశైలి గందరగోళం: శశిథరూర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు భారత్‌పై ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పేర్కొన్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని అన్నారు. ట్రంప్ వ్యవహారశైలి, స్వభావం పూర్తి గందరగోళంగా ఉందంటూ మండిపడ్డారు. సింగపూర్‌లో క్రెడాయ్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయ దౌత్య ప్రమాణాలను అమెరికా అధ్యక్షుడు గౌరవించడం లేదన్నారు. ట్రంప్ కన్నా ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ వైట్‌హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదు. ఏ రకంగా చూసినా ఆయన అసాధారణ అధ్యక్షుడు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ఆయన గౌరవించడంలేదు. నోబెల్ శాంతి బహుమతికి అర్హుడనని ఏ దేశాధినేత అయినా చెప్పడం విన్నామా? ప్రపంచంలోని అన్ని దేశాలు మా వద్దకే వచ్చి మోకరిల్లుతున్నాయని చెప్పడం విన్నామా? భారత్, రష్యాలవి డెడ్ ఎకానమీలు అనిచెప్పడం ఎప్పుడైనా విన్నామా? ఓ దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది అని అన్నారు.

# నటి కంగనా రనౌత్‌కు సుప్రీంలో చుక్కెదురు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు సర్వోన్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన పరువు నష్టం కేసును రద్దు చేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ సందర్భంగా కంగనా తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మీరు చేసింది కేవలం రీట్వీట్ మాత్రమే కాదు, దానికి మసాలా కూడా జోడించారు అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మోహతాలతో కూడిన ధర్మాసనం ఘాటుగా స్పందించింది. కంగనా అభ్యర్థనను తోసిపుచ్చుతున్నట్లు స్పష్టం చేసింది. 2020-21 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనల్లో పాల్గొన్న 73 ఏళ్ల వృద్ధురాలు మహీందర్ కౌర్‌ను ఉద్దేశించి కంగనా రనౌత్ ఓ వివాదాస్పద ట్వీట్ చేశారు. షాహీన్ బాగ్ నిరసనల్లో పాల్గొన్న బిల్కిస్ బానో, రైతు ఉద్యమంలో కూడా పాల్గొన్న మహీందర్ కౌర్ ఇద్దరూ ఒక్కటేనని పేర్కొన్న ఒక పోస్ట్‌ను ఆమె రీట్వీట్ చేశారు.

# పరిహారం కోసం భర్తను హతమార్చిన కలియుగ సావిత్రి



**మైసూరు, సెప్టెంబరు 12:** వన్యప్రాణుల దాడిలో ఎవరైనా మరణిస్తే ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం కట్టుకున్న భర్తనే కడతేర్చిందో భార్య. పులి దాడి చేసిందంటూ ఓ కట్టుకథ అల్లింది. కానీ, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడటంతో ఆమె ప్లాన్ విఫలమైంది. ఈ దిగ్భ్రాంతికర ఘటన కర్ణాటకలోని మైసూరుజిల్లాలో శుక్రవారం వెలుగుచూసింది. హుణసూరు తాలూకా పరిధిలోని చిక్కహెజ్జూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి (45), సల్లాపురి దంపతులు. వీరు పోక తోటల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం సోమవారం వీరి గ్రామంలో పులి సంచరి స్తున్నట్లు పుకార్లు వ్యాపించాయి. ఇదే అదనుగా భావించిన సల్లాపురి, తన భర్తను హత్య చేసి పరి హారం పొందాలని కుట్రపన్నింది. అనుకున్న ప్లాన్ ప్రకారం, తన భర్త కనిపించడం లేదని, పులి దాడి చేసి లాక్కెళ్లిపోయి ఉండవచ్చని ఆమె అందరినీ నమ్మించింది. దీంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. వర్షం పడుతుండటంతో వారికి పులి అడుగుజాడలు కనిపించలేదు.దీంతో అనుమానం వచ్చిన అధికారులు, ఆమె ఇంటి పరిసరాల్లోనే వెతకడం ప్రారం భించారు. ఈ క్రమంలో ఇంటి వెనుక ఉన్న పేడకుప్పలో వెంకటస్వామి మృతదేహాన్ని గుర్తించారు.

13-09Pg6exHMNWJQE 10 ONG_13-09Pg6exHMNWJQE.qxd 9/13/2025 12:55 AM Page 1



### శిల్పకారుల ప్రతిభకు పురస్కారం

# లేపాక్షి హస్తకళల డిజైన్ అవార్డులు



లేపాక్షి హస్తకళల డిజైన్ అవార్డులు సాధించిన కళాకారులు

**విజయవాడ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** హస్త కళా కారుల జీవన ప్రమాణ స్థాయి పెరిగినప్పుడే ఆ కళలు భవిష్యత్తు తరాలకు అందుబాటులోకి వస్తాయని లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ డిజైన్ పోటీ 2025 అవార్డుల కార్యక్రమం శుక్రవారం సాయంత్రం విజయవాడ అమ్మ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. శిల్పకళల్లో వినూత్నత ప్రదర్శించిన కళాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. రానున్న కాలంలో ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ప్రతి ఒక్క ఉత్పత్తికి జీ ఐ సాధించేలా కృషి ఈ సందర్భంగా హరి ప్రసాద్ అన్నారు. కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా అధ్యక్షత వహించగా అవార్డులు శిల్పకారుల ప్రతిభను మాత్రమే కాదు, రాష్ట్ర సంప్రదాయ కళలకు ప్రోత్సాహాన్ని కూడా ప్రతిబింబించాయన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ అవార్డులు శిల్పకారుల ప్రతిభను మాత్రమే కాదు, రాష్ట్ర సంప్రదాయ కళలకు ప్రోత్సాహాన్ని కూడా ప్రతిబింబించాయి. కొండపల్లి, ఎటికొప్పాక, వుడ్ కార్వింగ్, తోలుబొమ్మలు, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ విభాగాల్లో పోటీ నిర్వహించి నిపుణులతో కూడిన జ్యూరీ ద్వారా నూతన ఆవిష్కరణలను ఎంపిక చేశారు . మొత్తం 15 అవార్డులకు గాను గోల్డ్, సిల్వర్, బ్రోంజ్ మెడల్స్ తో పాటు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు కలిపి రూ.3 లక్షలు పంపిణీ చేశారు. నూతక్కి శ్రీనివాసరావు (కొండపల్లి బొమ్మలు – శ్రీనివాస కల్యాణం), టాంగేటి అయ్యన్న (ఎటికొప్పాక బొమ్మలు – మల్టీపర్పస్ యుటిలిటీ బాక్స్), దలవాయి ఆనంతమ్మ (తోలుబొమ్మలు – టేబుల్ ల్యాంప్ షేడ్), సుబ్రహ్మణ్య ఆచార్య (వుడ్ కార్వింగ్ – షోకేస్ ఐటమ్), కె.వి.ఎస్.ఎన్. కిషోర్(కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ – వాల్ పెయింటింగ్ క్లాత్) లు బంగారు పతకాలు గెలుచుకున్నారు. అదనంగా ఐదుగురు శిల్పకారులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.10,000, సర్టిఫికెట్లు బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా గాంధీ శిల్ప్ బజార్, మాస్టర్‌పీసెస్ ప్రదర్శన – అమ్మకాలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 14 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.



### 22 నుండి తాతయ్య గుంట

## గంగమ్మ నవరాత్రి ఉత్సవాలు

**తిరుపతి,సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రాశస్త్యం కలిగిన, తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 22వతేదీ నుండి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ తొమ్మిదిరోజులు ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమిస్తారు. దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గంగమ్మ ఆలయంలో ఉభయదారులు భక్తులకు సేవలందిస్తారు. 22వతేదీ సోమవారం ఉదయం శుక్లపాద్యమిరోజు మహాగణపతిపూజ, కలశ స్థాపనతో ఆరంభమవుతాయి. 23వతేదీ మంగళవారం బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో, 24వతేదీ గాయత్రిదేవి అలంకారం, 25న అన్నపూర్ణాదేవి అలంకారం, 26న మహాలక్ష్మీదేవిగా, 27న లలితాత్రి పుర సుందరిదేవిగా, 28న వారాహిదేవిగా, 29న సరస్వతిదేవి అలంకారంలో, సెప్టెంబర్ 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1వతేదీ మహిషాసుం మర్ధినీదేవి అలంకారంలో, 2వతేదీ రాజ రాజేశ్వరిదేవి అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ఆ తొమ్మిది రోజులు ప్రతిరోజూ ఉదయం 7గంటలకు అభిషేకం, 8గంటలకు హోమం, 9గంటలకు సహస్రనామార్చన, సాయంత్రం ఊంజల్‌సేవ ఉంటుంది. భక్తులు దేవీ నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్ కోరారు.

## కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం

### - ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్
### - అంతర్జాతీయ స్థాయి కార్టూన్ పోటీలు

**విజయవాడ,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** 3 వ ప్రపంచ తెలుగు మహా సభలు 2026 సన్నాహాలలో భాగంగా ఆంధ్ర సారస్వత పరషత్తు ఆధ్వర్యంలో ..కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం.. కార్టూన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర సారస్వత పరషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఏ వయసు వారైనా పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి 5116/, ద్వితీయ బహుమతి 3116/, తృతీయ బహుమతి 2116/, మూడు ప్రత్యేక బహుమతులు ఒక్కొకరికి 516/ ప్రశంసా పత్రాలు అందజేయబడతాయని తెలిపారు. ఒక్కొక్కరు రెండు కార్టూన్స్ పంపవచ్చు.కార్టూన్స్ ఏ4 సైజ్ లో వుండాలని, ఇంతకు ముందు ప్రచురితమైనవి పంపరాదని డా.శ్రీనివాస్ కోరారు. కార్టూన్స్ అక్టోబర్ 10 వ తారీఖు లోపున నిర్వాహకులకు అందాలని. విజేతలను అక్టోబర్ 29 వ తారీఖున ప్రకటిస్తామని తెలిపారు. విజేతలకు తెలుగు మహాసభల్లో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఎంపిక అయిన కార్టూన్లను 3 వ ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రత్యేక వేదికపైన ప్రదర్శిస్తామని, కార్టూన్స్ పంపవలసిన ఈమెయిల్, వాట్సాప్ నెంబర్ .9866084124. ఈ పోటీలకు సమన్వయకర్తగా ప్రముఖ కార్టూనిస్ట్ బి . హరి వెంకట రమణ వ్యవహరిస్తారని సంస్థ కార్యదర్శి ధవేజీ, ముఖ్య సమన్వయ కర్త పి. రామచంద్రరాజు సహ సమన్వయ కర్త వాసిరెడ్డి విద్యా సాగర్ ,తెలుగు మహాసభలు తెలిపారు.

## మహిళా పాల ఉత్పత్తిదారుల సేవలు భేష్

### - కేంద్ర పశుసంవర్థక శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బాగల్



**చంద్రగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మహిళా పాల ఉత్పత్తిదారుల సేవలు భేష్ అంటూ కేంద్ర మత్స్య, పశుసంవర్థకశాఖ, డైరీశాఖ మంత్రి ఎస్పీ సింగ్ బాగల్ అభినందించారు. మండల పరిధిలోని మల్లయ్య పల్లిలోని శ్రీజ పాలశీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీజ పాల ఉత్పత్తిదారుల సంస్థ అధికారులు, కార్యవర్గ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో డెయిరీ రంగ అభివృద్ధిలో శ్రీజ సంస్థ భాగస్వామ్యం పట్ల అభినందించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు మహిళలందరూ పాల ఉత్పత్తులతో పాటు కోళ్ళ పెంపక ం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలో సైతం పాలుపంచుకోవాలన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహిళలు, మహిళా పాడి రైతులకు, కేంద్రా గ్రామీణాభివృద్ధిసంస్థ అనేక కార్యక్రమాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. పాడిపరిశ్ర అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శ్రీజ సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం న్విహించి ఎన్‌డిడిబి అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. ఉత్తమ మహిళా పాడిరైతులను సన్మానించిఇ, జ్ఞాపికలను బహూకరించారు.

### ఆయేషా మీరా తల్లిదండ్రులకు

## సిబిఐ నోటీసులు

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** బీ ఫార్మసీ విద్యార్థి ఆయేషా మీరా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులు జారీ చేసింది.ఆయేషా మీరా హత్య కేసులో పిడదల సత్యంబాబుపై 376, 302 సెక్షన్ల నమోదు చేసినట్లు నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ అంవంపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఆయేషా మీరా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులిచ్చింది. ఈ నెల 19న విజయవాడ సీబీఐ కోర్టుకు అభ్యంతరాలు తెలపాలని నోటీసులో పేర్కొంది. ఆయేషా మీరా హత్య కేసులో నిందితుడిగా గతంలో ఏడేళ్ళకుపైగా శిక్షను అనుభవించిన పిడతల సత్యంబాబు అనంతర పరిణామాల్లో ఏపీ హైకోర్టు తీర్పు మేరకు నిర్దోషిగా విడుదలయ్యారు.ఈ కేసులో ఏపీ ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను అనుసరించి సీబీఐ విచారణకు ఆదేశించింది. ఈ కేసులో సుదీర్ఘ కాలం విచారణ నిర్వహించింది. అనంతరం విచారణ ముగిసినట్టు ఇప్పటికే కోర్టుకు తుది నివేదిక సిబిఐ కోర్టుకు సమర్పించింది.ఈ కేసులో సీబీఐ నివేదికను అనుసరించి అతనిపైనే నిందితునిగా పేర్కొన్నట్లు కీలక సమాచారం! అయితే ఈ కేసులో సత్యంబాబు నిందితుడు కాదనే అభిప్రాయాన్ని ఆయేషా మీరా తల్లి దండ్రులు మొదటి నుంచి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సీబీఐ నివేదికలోని అంశాలపై న్యాయస్థానం వారికి వివరించి, అభ్యంతరాలు తెలపాలని కోరింది.

### అవినీతి ఆరోపణలపై

## మోపిదేవి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో అలసత్వం,ఇతర అవినీతి ఆరోపణలపై మోపిదేవి పంచాయతీ కార్యదర్శిని జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందన మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉంటూ .. పెదకళ్ళపల్లి ఇంచార్జి కార్యదర్శిగా ఉన్న ఎం మల్లేశ్వరావు ను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. ఇంటి పన్నులు వసూలు చేయడంలో అలసత్వం, రాష్ట్ర, జిల్లా అధికారుల కాన్ఫరెన్స్ కు గైర్హాజరవుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించినందుకు గాను పంచాయతీ అధికారిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా రైల్వే పర్సనల్ అధికారుల బదలీలు

### - బాలమురళీధర్‌కు గుంతకల్లు సీనియర్ డిపిఒగా అదనపు బాధ్యతలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 12,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో పర్సనల్ విభాగంలో భారీగా బదిలీలతో పాటు పలువురికి స్థానచలనం కల్పిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జోనల్ ప్రధాన కార్యాలయంలో పారిశ్రామిక సంబంధాల విభాగం డిప్యూటీ సిపిఒగా పనిచేస్తున్న యం బాల మురళీధర్‌కు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు గుంతకల్లు డివిజన్ సీనియర్ డిపిఒగా అదనపు విధులు, బాధ్యతలు నిర్వహించాలని ఈ మేరకు ఆదేశించారు. అలాగే ఉన్నత శ్రేణి గ్రేడ్‌లో పనిచేస్తున్న మరికొందరితో పాటు గ్రూప్–సి క్యాడర్ నుంచి గ్రూప్–బి(ఏపిఒ)గా ఎంపికైన వారిలో కల్పనకు గుంతకల్లు ఏపిఒగాను, పలువురికి ఖాళీల ప్రతిపాదికన పోస్టింగ్స్ కల్పించారు.



## వేడుకగా ఆరంభమైన రాయలసీమ రంగస్థలి నృత్యోత్సవాలు

**తిరుపతి,సెప్టెంబర్12ప్రభాతవార్తప్రతినిధి:** అంతరించిపోతున్న నాటకరంగాన్ని పునరుజ్జీవం చేయడానికి రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలతో కళాకారులకు చేదోడు అందించినట్లవుతుందని బిజెపి నాయకుడు పి.నీవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహతి ఆడిటోరియంలో చిన్నారుల నృత్యప్రదర్శనలు ఇవ్వడం పూర్వజన్మసుకృత మని, అలాంటి వారికి వారి కుటుంబసభ్యులకు టిటిడి అధికారులు 300 రూపాయలు వేంకటేశ్వరస్వామి దర్శన భాగ్యం కల్పిస్తే మరింత పునీతులవుతారని ఆయన సూచించారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మూడురోజులు పాటు జరిగే రాలయసీమ రంగస్థలి స్వర్ణ నృత్యోత్సవాలు శుక్రవారం ఉదయం వేడుకగా ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్‌రెడ్డి, సురేష్‌స్వామి, కోండే చెంగారెడ్డి ఉన్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవకుల సేవలు అమోఘం

### భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించిన కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్



**తిరుమల, సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం విచ్చేస్తున్న అశేష సంఖ్య భక్తులకు అన్ని రకాలుగా సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల సేవలు అమోఘ మని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కొనియాడారు. శ్రీవారి సేవకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. స్వయంగా ఆమె భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించి భక్తిభావంతో సేవానిరతిని చాటుకున్నారు. అంతేగాక తనూ స్వయంగా అన్నప్రసాదభవనంలో అన్నప్రసాదాలను స్వీకరించి నాణ్యత, రుచి అద్భుతంగా ఉందని అభినందించారు. భక్తులతో కలసి తానూ అన్నప్రసాదం స్వీకరించడం తన హృదయానికి హత్తుకుందని తెలిపారు. భక్తులను పలకరించి సేవలు గురించి తెలుసుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, భానుప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ ఇఒలు భాస్కర్, రాజేంద్ర, విఎస్ఒ సురేంద్ర కేంద్రమంత్రి వెంట ఉన్నారు.అన్నదానం భవనంలోని ఫీడ్‌బ్యాక్ పుస్తకంలోనూ ఆమె తన అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్న కేంద్రమంత్రి బాగల్



**తిరుమల, సెప్టెంబర్12ప్రభాత వార్తప్రతినిధి:** దేశ ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, అంతా మంచి జరగాలని కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్‌బాగాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు.

## తిరుచానూరు పద్మావతిఅమ్మవారికి 22నుండి నవరాత్రి ఉత్సవాలు



**తిరుమల,సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశునికి అంగరంగవైభవంగా జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో పట్టపురాణి తిరుచానూరులో కొలువైన పద్మావతిఅమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరిపించేందుకు టిటిడి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో తోమ్మిదిరోజులుపాటు పద్మావతిఅమ్మవారికి విశేష అలంకరణలల్లో పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటల నుండి 4.30గంటల వరకు ఆలయంలోని కృష్ణస్వామి ముఖమండపంలో పద్మావతిఅమ్మవారి ఉత్సవమూర్తికి పాలు,పెరుగు, తేనె ,చందనం, కొబ్బరినీళ్ళతో విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అక్టోబర్ 2వతేదీ విజయదశమిరోజు పద్మావతిఅమ్మ రాత్రి 7.45గంటలకు విశేషమైన గజవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కారణంగా 10రోజులు కల్యాణోత్సవం రద్దుచేశారు. సెప్టెంబర్ 26న లక్ష్మీపూజ సేవలు రద్దయ్యాయి.

## శ్రీవారి ఆలయం మినీహుండీలో చోరీ

### తమిళనాడు వ్యక్తి పట్టివేత



**తిరుమల,సెప్టెంబర్12ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్యభక్తులతోబాటు నిందితుడుగా ఉన్న తమిళనాడు వాసి శ్రీవారిని దర్శించుకున్న తరువాత బంగారుబావివద్ద ఉన్న స్టీల్‌హుండీలో చోరీచేశాడు. ఈ సంఘటనను సిసికెమెరా కమాండ్ రూమ్‌నుండి భద్రత సిబ్బంది గమనించేలోపు అతను తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఆలయం వెలుపలకు వచ్చేసమయంలో భద్రత సిబ్బంది పట్టుకున్నారు. గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. తమిళనాడు తిరువణ్ణేలికి చెందిన వేణు భక్తుల్లాగే ఆలయంలోనికి వచ్చాడు. ఆనందనిలయం పక్కనే ఉన్న బంగారుబావి వద్ద స్టీల్‌హుండీలో సాధారణ భక్తుడిలా కానుకలు వేసేలా నటిస్తూ అందులోంచి 4వేల రూపాయలు నగదును చోరీ చేశాడు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిశితంగా గమనించిన భద్రత సిబ్బంది వెంటనే ఆలయంలోని విజిలెన్స్ కు సమాచారం అందించారు. అతనిని పట్టుకుని తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను జేబుదొంగ తనాలకు అలవాటుపడి ఇప్పుడు ఏకంగా ఆలయంలోపల మినీహుండీలోనే చోరీచేయడంతో ఆలయంలో భద్రతపై మరింత పటిష్టంగా ఉండాలని భక్తులు కోరుతున్నారు.

## మెడికల్ కాలేజీలపై మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం :హోం మంత్రి అనిత



శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి


**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 12:** 2027 నాటికి కళాశాలల నిర్మాణాన్ని పూర్తి చేసి వైద్య విద్యను యువతకు అందించే లక్ష్యం తో పీ3 మోడల్‌ను అనుసరిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మెడికల్ కాలేజీల నిర్మాణంపై జగన్మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..."ఫుల్ టైమ్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని, పార్ట్ టైమ్‌గా తాడేపల్లికి వచ్చి రాష్ట్రంపై బురద జల్లే జగన్‌కు ఈ రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. లండన్ మెడిసిన్ మానేసి మెడికల్ కళాశాలల నిర్మాణంపై ఏదేదో మాట్లాడుతున్నారని, ప్రజలను భయపెట్టి రాజకీయ లాభం పొందడమే జగన్ లక్ష్యం" అని స్పష్టం చేశారు. 17 మెడికల్ కాలేజీలు కట్టాం అని అబద్ధాలు అల్లుతున్న జగన్ రెడ్డి వాస్తవానికి శంకుస్థాపన రాళ్లు, బోర్డులు తప్ప జగన్ కట్టానని చెప్తున్న 17 మెడికల్ కాలేజీల్లో మరేమి లేవు. 17 మెడికల్ కాలేజీలు కట్టడానికి అయ్యే రూ.8,500 కోట్లలో ఐదేళ్లలో జగన్ ఖర్చు పెట్టింది కేవలం 1,450 కోట్లు మాత్రమే. జగన్ కట్టిన మెడికల్ కాలేజీలను చూసి ప్రజలు ఆహా అంటున్నారు అని వైసీపీ నేతలు అనడం హాస్యాస్పదం అన్నారు. మదనపల్లి, మార్కాపురం, బాపట్ల, పాలకొల్లు, నర్సీపట్నం, మచిలీపట్నం, ఏలూరు ఇలా ఎక్కడ చూసినా జగన్ స్థాపించిన మెడికల్ కాలేజీలు అంటే మసిపూసిన మారేడుకాయలే.అని అన్నారు. ఈ కాలేజీల్లో బోర్డును చూసి జనం ఆహా అనుకుంటున్నారు. వీటన్నింటిలో జగన్ ఏదైనా పర్ఫెక్ట్ గా కట్టింది మాత్రం శిలాఫలకాలే.

ఎటువంటి మోలిక సదుపాయాలు అభివృద్ధి చేయలేదన్నారు. పునాదులకే మెడికల్ కాలేజీలను పరిమితం చేశారన్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, బోధన సిబ్బందులు ఇలా ఏమి లేకుండా కేవలం బోర్డులు పెడితే మెడికల్ కాలేజీలు నిర్మించడం అయిపోదు.. అవి పూర్తి చేసి యువతకు వైద్య విద్యను అందించాలి. జగన్ హయాంలో కట్టానంటున్న మెడికల్ కాలేజీల పరిశీలనకు 2024 జూన్‌లో వచ్చిన విలీది ప్రతినిధులు తన ఆహా కట్టడాలు చూసి సీట్లు ఇవ్వడానికి నిరాకరించింది. మీరు చేసిన పాపానికి నేడు యువతకు వైద్య విద్య దూరం అయ్యింది" అని మండిపడ్డారు.పీపీపీ అంటే జగన్ ప్రైవేట్ పార్టనర్షిప్ కాదు పీపీపీ మోడల్‌ను జగన్ తప్పుగా చిత్రీకరిస్తూ ప్రజల్లో భయం పుట్టిస్తున్నారన్నారు. పీపీపీ విధానం అంటే జగన్ ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావట్లేదన్నారు. పీపీపీ విధానంలో కళాశాల యాజమాన్య హక్కులు అంతా ప్రభుత్వానిదే అని అన్నారు. నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివి ప్రైవేట్ భాగస్వామ్యంతో జరుగుతాయన్నారు. జీరో ప్రాఫిట్‌తో ప్రైవేట్ సంస్థలు ఈ కళాశాలలను అభివృద్ధి చేస్తాయని, 33 సంవత్సరాల తర్వాత మెడికల్ కాలేజీలు ప్రభుత్వ అధీనంలోకి వస్తాయని, కానీ జగన్ మాత్రం పుకార్ల వ్యాపారం చేస్తున్నారన్నారు.

## గణనాధునికి ఘనంగా విమానోత్సవం

**కాణిపాకం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుడు విమాన వాహనంపై కాణిపాకం గ్రామ పురవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఐరాలకు చెందిన కీ॥శే॥ కె.రామకృష్ణ పిళ్ళై కుటుంబీకులు, దేవస్థానం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు పగలు మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి మరోమారు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేసి దూదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన విమానవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులు సమర్పించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఎస్వీడబ్ల్యూలో గుజరాత్ అధ్యాపకులు



**తిరుపతి విద్య సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను గుజరాత్ రాష్ట్రంలోని వడాలి ప్రభుత్వ కామర్స్ కళాశాల అధ్యాపకుల బృందం శుక్రవారం సందర్శించింది. పద్మావతి కళాశాల అటానమస్ సాధించిన తీరు,మోళిక వసతుల కల్పనపై వారు కళాశాల అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ గుజరాత్ అధ్యాపక బృందాన్ని సాదరంగా స్వాగతించి కళాశాలలో నడుస్తున్న కోర్సులు,మోళిక వసతులపై సమాచారాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఉమాదేవి, గుజరాత్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ డాక్టర్ కేసరిసింగ్ ఎస్ పర్మార్, అధ్యాపకులు పారేశ్ ఎస్ ఖేతల్,గురుప్రకాష్ సింగ్, శైలేష్ కుమార్ ఎస్ బారియా పాల్గొన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.24/VMC/CDB/2025-26, Dt.12-09-2025
Roads, Drain, Culvert, Water supply, Lights, repairs (Total 57 works)-Est. Amount Rs.1147.00 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.
S/d-
For COMMISSIONER

# 'కూటమి' ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల తరఫున ధన్యవాదాలు : పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 12:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్ సోదరుల కోసం మనసున్న ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆర్థిక సాయం ప్రకటించడం సంతోషంగా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో కార్మిక, కర్షక ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆటో డ్రైవర్ల తరఫున ధన్యవాదాలు తెలుపు కుంటున్నానని పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇస్తే రూ.20 వేలు లాక్కున్నారని, రూ.10 వేలు వచ్చాయనే లోపే పోలీసుల రూపంలో అధిక ఫైన్లు విధించి ఆటో డ్రైవర్లను పీడించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో రూ.1,400 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో ఉన్న గుంతల రహదారులను బాగు చేసిందని, కూటమి ప్రభుత్వ సమర్థవంతమైన పాలనతో జగన్ రెడ్డి ఫస్ట్రేషన్ లో ఎ ి చ్చి ఎ ా డ ి ల ా మాట్లాడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలని చంద్రబాబు ప్రకటించడం తప్పాఅని అన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వొద్దని జగన్ అంటున్నారని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామన్నారు., 15 నెలల పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేశామని, గతంలో అమ్మఒడి ఒక బిడ్డకి... మిగిలిన బిడ్డలకు కంటతడి ఉండేది. నేడు తల్లికి వందనం పథకం పిల్లలందరికీ వర్తింపజేస్తున్నా మన్నారు.. అన్నంపెట్టే అన్న క్యాంటీన్లు పున: ప్రారంభించామని తెలిపారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని,. రాష్ట్ర మహిళలు సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటికే ఐదున్నర కోట్ల మంది పేద మధ్య తరగతి మహిళలకు, విద్యార్థినులు ఉచిత బస్సు పథకం ద్వారా ప్రయాణం సాగించారు. వీటిని తప్పు అని జగన్ అంటున్నారన్నారు. . పేదలకు ఉపయోగపడే పథకాలకు రాక్షసుడిలా జగన్ అడ్డుపడుతున్నారని,. అన్నదాతను ఆదుకుంటున్నామన్నారు. . నీటి సంఘాలను నియమించి రైతులను భాగస్వామ్యం చేసి కాలువల పునరుద్దరణ చేశామని, అన్నదాత సుఖీభవ పథకం విజయవంతంగా అమలు చేశాం. క్రమశిక్షణ, పట్టుదలకు పెట్టింది పేరు నారా లోకేష్ అని అన్నారు. నేపాల్ లో తెలుగు వారు చిక్కుకుపోతే దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ముందుగానే స్పందించి తెలుగు వారిని రాష్ట్రానికి క్షేమంగా తీసుకొచ్చారని, దేశం మొత్తం నారా లోకేష్ సేవలను ప్రశంసిస్తున్నారని అన్నారు.. పీ4 ద్వారా పేదరికం లేని సమాజ నిర్మాణానికి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఇవన్ని తప్పని జగన్ రెడ్డి మాట్లాడే పరిస్థితికి వచ్చారన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పరిసరాల్లో సర్వే!

## మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు సర్వే నిర్వహణ



రెవెన్యూ, సర్వే అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** తాడిపత్రి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులు శుక్రవారం వాటర్‌ట్యాంక్ వీధిలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పరిసరాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 639, 640, 641లలోని ఎల్పీ నం.151-83కు సంబంధించిన ఫ్లాట్ నంబర్లు 2, 15ల లోని స్థలాన్ని కేతిరెడ్డి పెద్దారెడ్డి తన భార్య కేతిరెడ్డి రమాదేవి పేరున 2020లో కొనుగోలు చేసి ఆ తర్వాత ఇళ్లు నిర్మించారు. ఏప్రెల్ 2021లో అప్పటి మున్సిపాలిటి పట్టణ సర్వేయర్ 2, 15 ఫ్లాట్లలోని స్థల విస్తీర్ణం 577.55 చ.గ.లు(11.93 సెంట్లు) ఉన్నట్లు నిర్ధారించడంతో సదరు స్థలం పరిధిలోనే తాము ఇంటిని నిర్మించుకున్నామని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారులతో పేర్కొన్నారు. అయితే ఆయన ఇంటికి ఉత్తరం వైపున ఆరు బయలుగా ఉన్న ఫ్లాట్ నంబర్లు 1, 16లలోని విస్తీర్ణం తక్కువగా ఉందని, సదరు స్థలం కొలతలు ఎల్పీ నం. 151-83లో సూచించిన మాదిరిగా ఉండేలా సర్వే చేయాలని ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి కోరిందని అధికారులు ఆయనకు వివరించారు. ఆ మేరకు 1 నుంచి 16 ఫ్లాట్లను సర్వే చేసి మున్సిపల్ బయలు స్థలం ఉండాల్సిన మేరకు ఉందా లేదా అని నిర్ధారించాలని కౌన్సిల్ కోరడంతో శుక్రవారం తహసీల్దార్ సోమశేఖర్, పట్టణ ప్రణాళిక అధికారిణి సుజాత, ఏడీ నాగరాజు, మున్సిపాలిటీ సర్వేయర్ కౌసల్య సాయి, మండల సర్వేయర్ రామమోహన్‌ల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తిమ్మంపల్లి నుంచి 11.30 గంటలకు తాడిపత్రిలోని తన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వే అనంతరం అధికారులు మీడియాతో మాట్లాడుతూ రికార్డుల్లో ఉన్న కొలతల మేరకు సర్వే నిర్వహించామని, కొంత తేడా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని తెలిపారు. తమ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు, కోర్టుకు సమర్పిస్తామని టీపీవో తెలిపారు. అనంతరం సర్వే అధికారులు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఆమోదయోగ్యం కోసం సంతకాలు చేయాలని కోరగా ఆయన సదరు సర్వే తనకు ఆమోదయోగ్యంగా లేదని సంతకాలు చేయడానికి నిరాకరించడంతో వారు వెనుదిరిగారు. దీంతో సర్వే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లైంది.

# ఇంద్రకీలాద్రిలో దసరా ఏర్పాట్లు ముమ్మరం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇఓ వికె శీనా నాయక్ ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారు.

- కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమావేశం:

దసరా ఏర్పాట్లకోసం పనిచేస్తున్న కాంట్రాక్టర్లతో శుక్రవారం కలెక్టర్ లక్ష్మీషా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి నిర్ణయించిన మేరకు కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో పనిచేయాలని ఆదేశించారు. సామాన్యభక్తులకు సంతృప్తికర దర్శనం ధ్యేయంగా కాంట్రాక్టర్లు పనులు వేగంగా జరపాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఏవైనా ఫిర్యాదులుంటే కలెక్టర్, ఇఓ, దేవదాయ శాఖ కమీషనర్ లకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

- వేదపాఠశాలలో వైద్యసేవలు:

దుర్గమ్మవారి ఆలయ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఎ ో ం ొ ం క ి ల ో ని వేదపాఠశాలలో వైద్యులు సేవలందించారు. శుక్రవారం నాడు వైద్యులు అక్కడున్న విద్యార్థులకు వైరల్ వ్యాధుల భారినుండి రక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డా కనకారావు అవసరమైన వారికి వైద్య సేవలందించారు.

- నాణ్యతతో రుచి ధ్యేయంగా అన్నప్రసాదం:

దుర్గమ్మ వారి ఆలయంలో భక్తులకు అందించే నిత్యాన్నదానంలో అందించే బోజనంపై భక్తులు తమ అభిప్రాయాలు తెలుపుతూ చాలా రుచితో పాటు నాణ్యంగా వుందంటూ ప్రశంసించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇఓ అన్నప్రసాదం వద్ద ఏఇఓ వుండి స్వయంగా పర్యవేక్షిస్తుండగా ఇఓ ప్రతిరోజూ అన్నప్రసాదం నాణ్యత, రుచిలను పరిశీలిస్తున్నారు.



నెల్లూరు కలెక్టర్ దంపతులకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఇఓ

- దుర్గమ్మ సేవలో నెల్లూరుకలెక్టర్:

దుర్గమ్మవారిని నెల్లూరు కలెక్టర్ హిమాన్షుశుక్లా దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు ఇఓ అందించగా వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తమిళనాడు పోలీసులను పరుగులు తీయించిన ఘనుడు

## చెన్నై కోయంబేడు వద్ద టిఎన్ ఆర్టీసి బస్సును దొంగిలించిన జిరంజన్ సాహు

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జిరంజన్ సాహూ అనే వ్యక్తి చెన్నై పట్టణంలోని ప్రభుత్వ బస్సుల సముదాయం కోయంబేడు వద్ద నిలిపి ఉన్న తమిళనాడు ఆర్టీసి బస్సును డిపో నుండి గురువారం దొంగిలించి డ్రైవింగ్ చేసుకుంటూ రాష్ట్రం దాటుకొని ఆంధ్రాకు వచ్చేశాడు. డిపోలో బస్సు కనిపించకపోవడంతో తమిళనాడు అధికారులు బస్సులో అమర్చిన జిపిఎస్ ఆధారంగా నెల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తమిళనాడు పోలీసుల సమాచారంతో అప్రమత్తమైన జిల్లా పోలీసు అధికారులు బస్సు నెల్లూరు జిల్లా నెల్లూరు-ముంబాయి రహదారిపై ఆత్మకూరు వైపుకు వెళుతున్నట్లు గుర్తించి ఆత్మకూరు స్టేషన్ వారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆత్మకూరు సిఐ గంగాధర్ వెంటనే తమ సిబ్బందిని అప్రమత్తం చేసి ఈ వాహనాన్ని ఆత్మకూరు ఎస్ఐ జిలాని, సాయి, వారి సిబ్బంది ద్వారా నెల్లూరుపాళెం వద్ద పట్టుకున్నారు. ఆ బస్సును స్వాధీనం చేసుకొని ఆత్మకూరు ఆర్టీసి డిపోకు తరలించారు. తమిళనాడు బస్సును ఆత్మకూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న సమాచారంతో చెన్నై నుండి శుక్రవారం ఆర్టీసి అధికారులు , పోలీసులు ఆత్మకూరు చేరుకొని ఆత్మకూరు పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని , ఆర్టీసి అధికారుల సహకారంతో బస్సును చెన్నైకి తీసుకు వెళ్ళారు. ఆత్మకూరు సిఐ గంగాధర్ సారధ్యంలో స్థానిక ఎస్ఐలు జిలాని, సాయి, వారి సిబ్బంది చాకచక్యంగా బస్సును పట్టుకోవడంతో చెన్నై ఆర్టీసి సిబ్బంది, అధికారులు వీరికి అభినందనలు తెలిపారు. ఈ బస్సును దొంగిలించిన వ్యక్తి పూర్తి వివరాలు తెలుసుకొని తమిళనాడులో కేసు నమోదు చేస్తామని తమిళనాడు పోలీసులు అధికారులు తెలిపారు.




# టిడిపిపై వైఎస్సార్సీ అసత్య ప్రచారాలకు అంతులేకుండా పోతోంది

## - రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్



**గుంటూరు -ప్రభాత వార్త ప్రతినిధి, సెప్టెంబర్ 12:** తిరుమల తిరుపతి దేవస్థానంపై వైసీపీ నిరంతరం అసత్య ప్రచారాలు చేస్తోం దని బ్రాహ్మణ కార్పొ రేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ ముఠా ఆలయాల పవిత్రతను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చంద్రగ్రహణం సమయంలో ఆలయ మహాద్వారానికి తాళం వేయడం ఆనవాయితీ అని, అయితే ఈ సందర్భాన్ని వైసీపీ దుష్ప్రచారానికి వాడుకుంటోందని రాంప్రసాద్ ఆరోపించారు. చంద్రగ్రహణం సందర్భం కొంతమంది విలేఖరులు సరదాగా తాళం వేస్తున్నట్లు ఫోటోలు తీశారు. వీరిలో వైకాపా మీడియాకు సంబంధించిన వ్యక్తి కూడా ఉన్నారని తెలిపారు. సరదా ఫోటోలను టీటీడీ భ్రష్టుపట్టినట్లు చిత్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారు అని అన్నారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు నిబంధనలకు విరుద్ధంగా స్వామివారి ఏకాంత సేవలో బయటి వ్యక్తులతో పాల్గొని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. తిరుపతిలో కొండపై నల్ల రాయి ఉందని, దాన్ని పాత చెప్పుతో కొడితే ఏమవుతుందని ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజలు మరిచిపోలేదు అని గుర్తు చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందని, అధికారం కోల్పోయిన తర్వాత కూడా కొత్త కుట్రలతో దుష్ప్రచారం చేస్తున్నారని రాంప్రసాద్ విమర్శించారు. జరగని సంఘటనలను జరిగినట్లు, లేని అవమానాలను ఉన్నట్లు చూపించి సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తున్నారు. ఇది ఆలయాలపై దాడి మాత్రమే కాదు, కోట్లాది భక్తుల విశ్వాసంపై దాడి అని అన్నారు. శ్రీవారి ప్రసాదాల కల్తీ విషయంలో వైసీపీకి టీటీడీ పవిత్రత గుర్తుకు రాలేదని, అసత్య ఆరోపణలతో పార్టీని బతికించుకోవడానికి జగన్ ఆరాటపడుతున్నారని విమర్శించారు.

# రుషికొండ రిసార్ట్స్‌ను సైన్స్, ఆర్ట్స్, హెరిటేజ్ మ్యూజియంగా ఏర్పాటు చేయాలి

## - సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాత వార్తప్రతినిధి:** రుషికొండ రిసార్ట్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సైన్సు, ఆర్ట్స్, హెరిటేజ్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి వినియోగించాలి అని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం సిఎంకు లేఖ రాశారు. ప్రధానంగా రాష్ట్రంలోని బాలబాలికల మనోవిజ్ఞాన వికాసాలకు, టూరిజం అభివృద్ధికి, ఇటవంటి మ్యూజియం ఉపయోగపడుతుంది. అన్ని ప్రముఖ నగరాలలో ప్రసిద్ధిగాంచిన సైన్సు మ్యూజియంలు ఉన్నాయన్న విషయాన్ని కూటమి ప్రభుత్వం గమనించాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. అలాగే కొత్త రాష్ట్రానికి అన్ని హంగులు కలిగిన గొప్ప నగరంగా రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మిస్తామని సిఎం చంద్రబాబు పలుమార్లు ప్రకటించారు. రాజధాని నగరంలో ఉండాల్సిన ఇతర హంగులతోపాటు, భవిష్యత్తు తరాల విద్యా విజ్ఞాన, వినోద సాధనాలుగా సైన్సు మ్యూజియం, జంతు ప్రదర్శనశాల, బొటానికల్ గార్డెన్స్ కూడా ముఖ్యం. ఈ మూడు సౌకర్యాల గురించి కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి అని సిఎంకు రాసిన లేఖలో రాఘవులు కోరారు.

# అనధికార లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలి

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు (నెల్లూరు), సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలో నుడా నిబంధనలు పాటించకుండా అనధికార లేఅవుట్లు 123 ఉన్నాయని, వాటిని ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని పీవీఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం నుడా అధికారులతో కలిసి లేఅవుట్ రెగ్యులేషన్స్ స్కీమ్‌పై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి అనధికార లేఅవుట్లు కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడడమే కాకుండా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనధికారంగా వేసిన లేఅవుట్లలో ప్రజా ప్రయోజనం కోసం వదలాల్సిన 10 శాతం స్థలాన్ని వదలలేదన్నారు. ఇటువంటి వారిలో అవగాహన కల్పించి 7 శాతం అపరాధ రుసుము కట్టించుకోవడంతో సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ఇటువంటి అక్రమ లేఅవుట్ల విషయంలో ఆదిలోనే అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి రాదన్నారు. ప్రస్తుతం కోవూరు నియోజకవర్గంలో గుర్తించిన 123 అనధికార లేఅవుట్లు 90 శాతానికి పైగా గత ప్రభుత్వంలో వేసినవే అన్నారు. ఈ అక్రమ లేఅవుట్ల నుంచి వసూలు చేసిన అపరాధ రుసుము ద్వారా స్థానికంగా రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని రియల్ ఎస్టేట్ యాజమానులతో పాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో 14 శాతం ఉన్న అక్రమ లేఅవుట్ల రెగ్యులైజేషన్ ఫీజును కూటమి ప్రభుత్వం 7 శాతానికి తగ్గించిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు నుడా అనుమతులు ఉన్న లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. 2025 అక్టోబర్ 30వ తేది లోపల ఎల్ఆర్ఎస్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లతో పాటు జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట విజయలక్ష్మి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి, జొన్నవాడ ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, ఏఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, నుడా అధికారులు అల్లంపాటి పెంచలరెడ్డి, హిమబిందు, ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# ప్రభుత్వ రంగసంస్థల బలోపేతంపై దృష్టి సారించాలి

## ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.టి.జీవన్

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి, కొత్త ఉద్యోగ నియామకాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్య దర్శి జీ.టి.జీవన్ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పడి పుష్కర కాలం గడుస్తుందని, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగుల క్రమబ ద్ధికీకరణపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న కార్పోరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు, కొత్త నియమాకాలపై సీఏంకు వినతి పత్రం అందించి పరిస్థితిని వివరిస్తామ న్నారు. తెలంగాణలో 93 ప్రభుత్వ రంగ కార్పోరేషన్లు నడుస్తాయని, 32 కార్పోరేషన్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంతో పాటు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారిధిగా పని చేస్తున్నాన్నారు. ప్రభుత్వానికి ఎన్నో లాభాలని అర్జించి పెడుతున్న సంస్థల్లో కొత్త ఉద్యోగ నియామాలపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణఏర్పడి చాల కాలం గడుస్తున్నా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న కార్పోరేషన్ల సమస్య లను చాలవరకు పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్పోరేషన్లకు ఛైర్మన్లకు, పరిపాలన అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తూ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పోరేషన్లలో అవసరమైన ఉద్యోగులు లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. కొన్ని సంస్థలకు ఎండీలు లేక పోవడంతో ఇంచార్జులతో కొనసాగిస్తూడటంతో కార్పోరేషన్లలో పురోగతి సాధించడం లేదన్నారు. కార్పోరేషన్ల రీ అర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేయడం, ఈ బాధ్యతలను మాజీ సీఎస్ శాంతి కుమారికి అప్పగించడం పై హర్షం వ్యక్తం చేశారు. వారి దృష్టికి కూడ కార్పోరేషన్లలోని సమస్యలను తీసుకెళ్లి వివరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమా పథాకాలను వారికి చేరవేయడంలో కార్పోరేషన్ల ఎంతో కృషీ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి ఆదాయన్ని సమకూర్చే సంస్థలతో పాటు, వ్యవసాయ రంగం లో5 విభాగాల్లో రైతులకు సేవలు అందించడం చేస్తున్నాయన్నారు.

# గ్లోబల్ స్థాయికి తెలుగు సినిమా

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని సందర్శిస్తున్న పవన్

**విజయవాడ, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సినిమా ఇప్పుడు గ్లోబల్ సినిమాగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన శుక్రవారం నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌డీ క్యాంపస్ చూస్తుంటే మినీ ఇండియాను చూసినట్టు అనిపించింది. నాకు నటనలో శిక్షణ ఇచ్చిన గురువు సత్యానంద్ ఎన్ఎస్‌డీ గురించి తరచుగా చెప్పేవారు. కళలు లేని సమాజంలో హింస ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, కళా రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చిస్తానని ఆయన తెలిపారు.

# సి ఆర్ మీడియా అకాడమీ లో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పదవి బాధ్యతలు చేపట్టిన ఎం. భాస్కర నారాయణ

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సమాచార కేంద్రం( విజయవాడ), లో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తూ న్న ఎం.భాస్కర నారాయణ పదోన్నతి పై సి ఆర్ మీడియా అకాడమీ లో శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టారు.. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం భాస్కర్ నారాయణ ను సి ఆర్ మీడియా సెక్రెటరీ వి. మణిరాం, అకౌంట్ ఆఫీసర్ శాంతారాం, లైబ్రేరియన్ వి. శేఖర్, జూనియర్ అసిస్టెంట్ ఎం. లోవ రాజు, ఆదిత్య అభినందించారు.

# 2047 నాటికి సువర్ణ ఆంధ్ర నిర్మాణం

## ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయవాడ, సెప్టెంబర్ 12,ప్రభాతవార్తప్రతినిధి: ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త లక్ష్యంతో 2027 నాటికి ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పుతున్నామని ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. హైదరాబాద్‌లో ఏఎస్ఎంఈ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మెకానికల్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ ఎక్స్‌పోసిషన్ 2025లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 166 బిలియన్ అమెరికన్ డాలర్ల జీఎస్‌డీపీ, ఆరు పోర్టులు, మూడు అంతర్జాతీయ విమానాశ్రయాలతో తూర్పు దేశాలకు గేట్వేగా ఎదుగుతోందని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీ 4.0లో పెట్టుబడి సబ్సిడీలు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, పన్ను రాయితీలు వంటి అనేక ప్రోత్సాహాలు ఉన్నాయని వివరించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అలాగే విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 9.2 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ఆమోదమయ్యాయని, సెమీ కండక్టర్, ఐటి, క్వాంటం టెక్నాలజీలలో రాష్ట్రం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. 2047 నాటికి సువర్ణ ఆంధ్ర నిర్మాణం లక్ష్యమని, నవంబర్ 14-15న విశాఖపట్నంలో జరిగే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025కు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, ఎంఎస్ఎంఈల వృద్ధి, క్లస్టర్ అభివృద్ధి, మార్కెట్ లింకేజీలపై ప్రభుత్వ ప్రయత్నాలను వివరించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వం వల్ల హైదరాబాదు టెక్‌హబ్‌గా ఎదిగిందని, అదే దిశలో నూతన ఆంధ్రప్రదేశ్ కూడా బలమైన తయారీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని అన్నారు.

# దేశంలో మోడీ పాలనలో ప్రతి రంగం వేగంగా అభివృద్ధి

## టిఎస్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశంలోని రైతులు, వ్యాపారులు, మౌలిక సదుపాయాతోపాటు ప్రతి రంగంలోనూ వేగంగా అభివృద్ధి చెందు తుందని ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడారు.

ఈ నెల 17వ తేదీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా నిర్వహించబోయే సేవాపక్షం అభియాన్ దేశ వ్యాప్తం గా నిర్వహించడం జరుగుతుందన్నారు.

తెలంగాణలో సైతం సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిం చుకుంటున్నామని, 15 రోజులపాటు నిర్వహించే సేవా పక్వాడ్ కార్యక్రమం సమాజం పట్ల మన బాధ్యతను సేవ ఆవశ్యకతను తెలియ జేయడంతోపాటు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో మార్గనిర్దేశం చేస్తుంద న్నారు. సేవా పక్షం అభియాన్ సందర్భంగా ఈ 15 రోజుల పాటు ప్రజల కు అభివృద్ధి,

సామాజిక సేవ, ఆత్మనిర్భరత, ఎన్విరాన్మెంట్ కేర్, యువత భాగస్వామ్యమయ్యేలా వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

ముఖ్యంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

12-09pg 12 ONG_12-09pg10.qxd 9/12/2025 10:17 PM Page 1



# ఆసియా కప్‌లో.. మహాపోరు





## హై వోల్టేజ్ మ్యాచ్‌పై దృష్టి
## పాకిస్థాన్‌తో టీమిండియా ఢీ

**న్యూఢిల్లీ:** యుఎఇపై టీమిండియా ఘన విజయం సాధించిన తర్వాత, ఇప్పుడు అందరి దృష్టి పాకిస్థాన్‌తో జరగబోయే హైవోల్టేజ్ మ్యాచ్‌పై పడింది. ఈ నెల 14 సూపర్ సండే రోజున జరిగే ఈ మహా పోరులో భారత జట్టులో ఏయే ఆటగాళ్లు ఉంటారో అనేదానిపై బిసిసిఐ సెలక్టర్ల కమిటీ కసరత్తు చేస్తోంది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఐదుగురు బ్యాట్స్ మెన్లు, ముగ్గురు ఆల్ రౌండర్లు, ముగ్గురు బౌలర్లు ఈ 11 మందితోనే టీమిండియా బరిలోకి దిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. యూఎఇతో ఆడిన జట్టునే పాకిస్థాన్‌తో కూడా ఆడనుంది.

భారత ప్లేయింగ్ ఎలెవన్ బ్యాట్స్‌మెన్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్) ఇక ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, బౌలర్లుగా కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా ఉండనున్నారు. మరోపక్క భారత్‌తో తలపడే పాకిస్థాన్ జట్టులో సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, హ్యారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ టలట్, ఖుష్దిల్ షా, మహమ్మద్ హారీస్(కీపర్), మహమ్మద్ నవాజ్, మహమ్మద్ వసీం జూనియర్, సహిబ్జాదా ఫర్హాన్, సయీమ్ అయుబ్, సల్మాన్ మిర్జా, షాహిన్ షా అఫ్రిది, సుఫ్యన్ మోఖిమ్ ఉన్నారు. ఇక ప్రస్తుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకున్నా టీమిండియానే హాట్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. టీ20ల్లో టీమిండియా వరల్డ్ ఛాంపియన్‌గా ఉండగా, పాకిస్థాన్ 8వ స్థానంలో ఉంది. అంతేకాకుండా పాక్‌లో సీనియర్ ఆటగాళ్లు ఎవరూ లేరు. ఆ జట్టు పూర్తిగా కుర్రాళ్లతో ఉంది. మరోవైపు భారత్ వరల్డ్ బెస్ట్ టి20 ప్లేయర్లతో భీకరంగా కనిపిస్తోంది.

అయితే టి20 ఫార్మాట్‌లో ఏజట్టును తక్కువ అంచనావేయలేం. అంతేకాకుండా భారత్-పాక్ మ్యాచ్ అంటే ఒత్తిడితో కూడినపోరు. ఎవరు ఈ ఒత్తిడిని అధిగమిస్తే ఆ జట్టునే విజయం వరిస్తుంది. కాగా ఆసియా కప్‌లో భారత్‌దే పూర్తి ఆధిపత్యం. 1984లో ఈ టోర్నీ మొదలవ్వగా ఇప్పటి వరకు 16 ఎడిషన్స్ జరిగాయి. ఇందులోభారత్, పాకిస్థాన్ 15 ఎడిషన్స్ ఆడాయి. అత్యధికంగా భారత్ 8 సార్లు విజేతగా నిలిస్తే పాకిస్థాన్ కేవలం రెండు సార్లు మాత్రమే గెలుపొందింది. శ్రీలంక 6సార్లు గెలిచింది. భారత్, పాకిస్థాన్ ఆడిన 15 ఎడిషన్లలో ఇరు జట్లు ఒక్కసారి కూడా ఫైనల్లో తలపడలేదు.



## హాంకాంగ్ ఓపెన్.. సెమీఫైనల్లో
## సాత్విక్, చిరాగ్ జోడీ

**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో సాత్విక్ చిరాగ్ జోడీ అద్భుతమైన విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో భారత ద్వయం మలేషియాకు చెందిన జునైదియాప్‌ను ఓడించింది. శుక్రవారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి మలేషియాకు చెందిన ఆరిఫ్ జునైది-రాయ్ కింగ్ యాప్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇటీవలి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత ప్రపంచ 9వ ర్యాంక్‌లో ఉన్న ఈ జంట, సమన్వయం, అవిశ్రాంతమైన దాడి ప్రదర్శించి, 64 నిమిషాల ఉత్కంఠభరితమైన టోర్నీలో మలేషియా ప్రత్యర్థులను 21-14, 20-22, 21-16 తేడాతో ఓడించారు. ఎనిమిదో సీడ్ జట్టు ఆట మొదలుపెట్టినప్పటికీ, తొలి గేమ్‌లో 12 పాయింట్లను నమోదుచేసుకుంది. రెండవ గేమ్‌లో జునైది-యాప్ భారత్‌తో హోరాహోరీగా నిలిచారు. 6-ఆల్‌తో సమం చేశారు. సాత్విక్-చిరాగ్ 20-ఆల్‌తో సమంచేయడానికి పోరాడినప్పటికీ, మలేషియన్లు అడ్డుకున్నారు. అయితే, మూడవ గేమ్‌లో, భారత ఆటగాళ్లు తమస్థాయిని గణనీయంగాపెంచుకుని చివరినాలుగులో తమస్థానాన్ని పదిలం చేసుకున్నారు.

## గ్రాండ్ స్విస్‌లో నిహాల్, వైశాలి విజయం
### గుకేష్ వరుసగా మూడో ఓటమి



**న్యూఢిల్లీ:** గ్రాండ్ స్విస్ 2025లో నిహాల్ సరిన్, వైశాలి విజయాలు సాధించి ఆధిక్యాన్ని సాధించారు. ఇదే సమయంలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ టోర్నమెంట్‌లో వరుసగా మూడో ఓటమిని ఎదుర్కొన్నాడు. ఉజ్బెకిస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ నిహాల్ సరిన్, గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు తమ తమ విభాగాలలోని 7వ రౌండ్‌లో విజయాలు నమోదు చేసి మంచి ఫామ్‌ను కొనసాగించారు. నిహాల్ సరిన్ అప్పటి ఛాంపియన్ ఇరాన్‌కు చెందిన పర్హామ్ మాగ్‌సూద్లూపై విజయం సాధించాడు.

ఇప్పుడు 5.5/7 పాయింట్లతో జర్మనీకి చెందిన మాథియాస్ బ్లూబామ్‌తో కలిసి ఓపెన్ విభాగంలో టోర్నమెంట్‌లో జాయింట్ లీడర్‌గా ఉన్నాడు. మథియాస్ అర్జున్ ఎరిగైసిని ఓడించి నిహాల్‌తో సమం చేశాడు. దీంతో ఏడు ఆటలలో అతని ప్రస్తుత 4.5 పాయింట్లతో అర్జున్ లీడర్‌బోర్డ్‌లోని టాప్ 10 నుండి పడిపోయాడు. ఇక మహిళల గ్రాండ్ స్విస్‌లో వైశాలి ఏకైక ఆధిక్యంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ వైశాలి, చైనాకు చెందిన గువో క్విపై ఏడో రౌండ్ విజయంతో మహిళల విభాగంలో మరోసారి ఏకైక ఆధిక్యాన్ని సాధించి టైటిల్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆమె ఇప్పుడు ఏడు ఆటల నుండి 6 పాయింట్లను కలిగి ఉంది. అలాగే ఓపెన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ విదిత్ గుజరాతీ వరుసగా రెండు విజయాలతో టోర్నీలోకి తిరిగి వచ్చాడు. మరోవైపు ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు పోరాటం కొనసాగింది. అతను ఈ టోర్నీలో వరుసగా మూడో ఓటమిని ఎదుర్కొన్నాడు. లీడర్‌బోర్డ్‌లో టాప్ 80 నుండి బయటపడ్డాడు.

## భారత్, ఆసీస్‌ల మధ్య
## 14 నుంచి వన్డే సిరీస్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా, భారత మహిళల జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. తొలి రెండు మ్యాచ్‌లు న్యూ చండీగఢ్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియంలో జరగనున్నాయి. మూడో వన్డేకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఇప్పటి వరకు భారత్, ఆస్ట్రేలియా జట్లు వన్డే క్రికెట్‌లో 56 సార్లు ముఖాముఖిగా తలపడ్డాయి. ఇందులో 46 మ్యాచ్‌ల్లో ఆసీస్ విజయం సాధించింది. టీమ్‌ఇండియా కేవలం 10 మ్యాచ్‌ల్లోనే గెలిచింది. చివరి ఐదు వన్డేల్లోనూ ఆసీస్ గెలవడం గమనార్హం. సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఈ మెగాటోర్నీకి భారత్, శ్రీలంక దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ క్రమంలో ఈ మెగాటోర్నీకి సన్నాహకంగా వన్డే సిరీస్‌ను ఉపయోగించుకోవాలని ఇటు భారత్, అటు ఆస్ట్రేలియాలు భావిస్తున్నాయి. భారత్, ఆస్ట్రేలియా మహిళల వన్డే సిరీస్ షెడ్యూల్ ప్రకారం తొలి వన్డే ఈ నెల 14న, రెండో వన్డే 17న, మూడో వన్డే 20న జరగనుంది. భారత జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి , రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, సయాలీ సత్‌ఘరే, రాధా యాదవ్, శ్రీ చరణి, స్నేహ రాణా, ఉమా చెత్రీ (వికెట్ కీపర్). ఇక ఆస్ట్రేలియా జట్టులో అలిస్సా హీలీ (కెప్టెన్), నికోల్ ఫాల్టమ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, జార్జియా వోల్, తహ్లియా మెక్‌గ్రాత్ (వైస్ కెప్టెన్), ఆష్లీ గార్డనర్, కిమ్ గార్త్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, చార్లీ నాట్, ఎల్లీస్ పెర్రీ, అన్నాబెల్ సదర్లాండ్, డార్సీ బ్రౌన్, సోఫీ మోలినెక్స్, మేగాన్ షట్, జార్జియా వేర్‌హామ్ ఉన్నారు.

## వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో..
## ఒకే ఒక్క ఆశాకిరణం గాథా ఓటమి
### పతకం లేకుండా ముగిసిన భారత్ ప్రచారం



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్, ఆర్‌ఒ16లో ఒకే ఒక్క ఆశాకిరణం గాథా ఖడకే నిష్క్రమణతో భారత్ రికర్వ్ ఆర్చరీ ప్రచారం పతకం లేకుండా ముగిసింది. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో 15 ఏళ్ల గాథా ఖడకే యొక్క ఆశాజనక ప్రదర్శన 16వ రౌండ్‌లో ముగిసింది. ఆమె దక్షిణ కొరియాకు చెందిన పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ లిమ్ సిహియోన్ చేతిలో 0-6 తేడాతో వరుస సెట్ల ఓటమిని ఎదుర్కొంది. అనుభవజ్ఞురాలైన లిమ్ సిహియోన్ ముందు గాథాకు ఎలాంటి అవకాశం దక్కలేదు. ఆమె మ్యాచ్‌ను 30 పరుగులతో ప్రారంభించి, తొలి సెట్‌ను 4 పాయింట్ల తేడాతో గెలుచుకుంది. గాథాకు ఎటువంటి లయతో పాటుగా, 10-రింగ్‌లో ఒక్క షాట్ కూడా దొరకలేదు, అలాగే 8-రింగ్‌లో రెండు షాట్లు కూడా వేసింది. ఇది లిమ్‌కు మరింత అవకాశంగా మారింది. దీంతో గాథా చివరి 8 స్థానాల్లోకి చేరుకోలేకపోయింది. ఆమె నిష్క్రమణతో భారత్‌వరుసగా మూడవ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో రికర్వ్ విభాగంలో పతకం లేకుండా పోయింది. ఈ ఛాంపియన్‌షిప్‌లలో భారతదేశం కేవలం రెండు పతకాలను మాత్రమే సాధించింది.


**ముంబయి,సెప్టెంబరు 12:** దేశీయ ఈక్విటీమార్కెట్ల బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా ఎనిమిదోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. ప్రత్యేకించి వారాంతంరోజున నిఫ్టీ 50 సూచీ 25,100వద్ద నమోదుచేసింది. ఇండోఅమెరికా ఉద్రిక్తతలు కొంతమేర సడలుతాయన్న అంచనాలు, అమెరికా కార్మికగణాంకాల విడుదల కూడా సెంటిమెంట్‌కు తోడయింది. ఫెడ్‌రిజర్వు రేట్‌కట్ కూడా ఉండవచ్చన్న అంచనాలు సూచీలకు మద్దతునిచ్చాయి. అలాగే భారత్‌పై సుంకాలు వేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఈయూ దేశాలు తిరస్కరించవచ్చని ఇన్వెస్టర్లు బలంగా నమ్మారు.



## ఎనిమిదోరోజూ లాభాల్లోనే సెన్సెక్స్,నిఫ్టీ!

అలాగే రిటైల్‌ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలయినా మార్కెట్ల తర్వాతే రావడంతో ప్రభావం కనిపించలేదు. ఇక ఖనిజవనరుల కంపెనీలు, ఆర్థికసేవల కంపెనీలు లాభాల్లో ముగిస్తే ఎఫ్‌ఎంసిజి, పిఎస్‌యు బ్యాంకులు క్షీణించాయి. రక్షణరంగ షేర్లు భారీగాపెరిగాయి. ఆరు భావితరం సబ్‌మెరైన్ల తయారీకి చర్చలు ప్రారంభించడమే ఇందుకు కారణం, బిఎస్‌ఇ సెన్సెక్స్ 355.97 పాయింట్లుపెరిగి 81,904.70 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 108.50 పాయింట్లుపెరిగి 25,114వద్ద ముగిసింది. ఎనిమిది సెషన్లలో నిఫ్టీసూచీ 2.17శాతం పెరిగింది. ఇక బెల్ 3.67శాతం, బజాజ్‌ఫైనాన్స్ 3.41శాతం, ఐసిసిఐబ్యాంకు 1.13శాతం నిఫ్టీలోపెరిగాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.09పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.27శాతం క్షీణించాయి. 2061 కంపెనీల షేర్లు పెరిగితే 2082 షేర్లు క్షీణించాయి. 168 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 88.25వద్ద ముగిసాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్‌ఫ్యూచర్స్ అక్టోబరు మూడోతేదీనాటికి 0.34శాతంపెరిగి 1,09,354గా నిలిచింది. బ్రెంట్‌ముడిచమురు నవంబరునెలకకుగాను 30 సెంట్లు తగ్గి బ్యారెల్ ఒకటీ66.6డాలర్లుగా నడిచింది.

## 3.2 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణలో 'అలీబాబా'



వాణిజ్యం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** అంతర్జాతీయంగా ఈకామర్స్ విస్తరణతోపాటు క్లౌడ్ బిజినెస్‌ను మరింతగా పెంచుకునేందుకుగాను చైనాకు చెందిన అలీబాబా గ్రూప్ హోల్డింగ్స్ 3.2 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించాలని చూస్తోంది. కన్వర్టిబుల్ సీనియర్‌నోట్స్, జీరోకూపన్ పద్ధతిలో ఈనిధులు సమీకరించనున్నట్లు చైనాసంస్థచెపుతోంది. 2032 నాటికి ఈనోట్స్ విముక్తికి అంటే కాలపరిమితి తీరిపోతుంటాయి. ప్రైవేటు ఆఫరింగ్ ద్వారా అమెరికాయేతర ఇన్వెస్టర్లుకు మాత్రమే ఈ బాండ్లను విక్రయిస్తుంది. ఎలాంటి వడ్డీ చెల్లించదు కాని బాండ్ హోల్డర్లు వీటిని ఆలిబాబా అమెరికా లిస్టింగ్ ఉన్న షేర్లుగా మార్చుకునే వెసులుబాటు ఉంది. అయితే బదలీ తర్వాత కంపెనీ షేర్లరూపంలోకానీ, నగదు రూపంలోకానీ లేదా రెండుపద్ధతుల్లోకూడా చెల్లించే వీలుంది. ఈ నిధుల్లో 80శాతం క్లౌడ్ ఇన్‌ఫ్రాకోసం, డేటా సెంటర్లను విస్తరించాలని, టెక్నాలజీ మెరుగుదల, సేవల్లో మరింత మెరుగుదలను చూపించేందుకు వాడతామని చెపుతోంది. ఇక 20 శాతం మాత్రం అంతర్జాతీయ ఈకామర్స్ రంగాల్లో వినియోగిస్తామని చెపుతోంది. అంతర్జాతీయంగా మార్కెట్ విస్తరణ, మనుగడ, ఉనికి, సామర్థ్యం మరింతపెంచుకోవాలని అలీబాబా నిర్ణయించింది. హాంకాంగ్ లిస్ట్ అయిన షేర్లు 0.4శాతంపెరిగి హాంకాంగ్ డాలర్స్‌లో 143.30గా నడిచాయి. హ్యాంగ్‌సెంగ్ సూచీ 0.4శాతం క్షీణించినా కంపెనీషేర్లుపెరిగాయి. ఈ ఏడాదిలోనే కంపెనీ షేర్లు 72శాతంపెరిగాయి. హ్యాంగ్‌సెంగ్ 30శాతం పెరిగితే కంపెనీ షేర్లు 72శాతం పెరగడం గమనార్హం. అంతకుముందే కంపెనీ 12 బిలియన్ హాంకాంగ్ డాలర్ల నిధులను బదలీకి సానుకూలమైన బాండ్లరూపంలో సమీకరించింది. 29 రీజియన్లలో 89 జోన్లలో ఆలిబాబా క్లౌడ్ కొనసాగుతోంది. అంతేకాకుండా ఆలిబాబా కొత్త ఎఐచిప్‌ను కూడా డెవలప్‌చేస్తోంది.

## పసిడి తులం రూ.1.11 లక్షలు!
### మళ్లీ నింగిని తాకుతున్న బంగారం

**ముంబయి, సెప్టెంబరు 12:** బంగారం ధరలు మళ్లీ జోరందుకున్నాయి. ఒకరోజు స్వల్పంగా తగ్గినా మరుసటిరోజు నింగిని తాకుతున్నాయి. ముందురోజు స్వల్పంగా తగ్గిన ధరలు శుక్రవారం మళ్లీ నింగికి ఎగిసాయి. పండగ సీజన్ సమీపిస్తుండటంతో బంగారం కొనుగోలు చేయాలనుకు మహిళలకు షాకిస్తూ నేడు పసిడి ధరలు భారీగా పెరిగాయి. ఈ పెరుగుదల ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది బంగారం ధర 4,500 డాలర్ల వరకు వెళ్లే అవకాశం ఉందని గోల్డ్‌మాన్‌శాక్స్ సూచించింది. భారతదేశంలో రూ. 1.45 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసింది. నిపుణుల ప్రకారం దీపావళి నాడు 10 గ్రాముల ధర 1.25 లక్షలకు చేరవచ్చని అంచనా.



శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాములు బంగారం ధర రూ.1,11,280 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 100 గ్రాములు బంగారం ధర రూ.7,700 పెరిగి రూ. 11,12,800 వద్ద ట్రేడ్ అవుతోంది. సెప్టెంబర్ 12, శుక్రవారం బంగారం ధరలను పరిశీలిస్తే..24 క్యారట్ల గ్రాము ధర రూ.77 పైసలు పెరిగింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.11,128 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 10,200 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.8,346 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.7,700 పెరిగి రూ. 11,12,800 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ. 10,20,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.8,34,600 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది. విజయవాడ విషయానికి వస్తే.. 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది. చెన్నైలో బంగారం ధరలను చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,710 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,400 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.84,550 గా నమోదైంది. బంగారం ధరలపై గోల్డ్‌మన్ సాచ్స్ షాకింగ్ నివేదిక ధంతేరస్, దీపావళికి పసిడి కొనుగోలు చేసేవారికి బిగ్ అలర్ట్ ముంబైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,430 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బ్ని ధర రూ. రూ. రూ.1,02, 150 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,610 గా నమోదైంది. ఇక అహమ్మదాబాద్ లో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,330 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల ధర రూ.1,02,050 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,510 గా నమోదైంది. బెంగుళూరులో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది. కలకత్తా విషయానికి వస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది. విశాఖపట్నం విషయానికి వస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,02,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,460 గా నమోదైంది.

## 10% విక్రయానికి బాలాజి వాఫర్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** గుజరాత్‌కేంద్రంగా పనిచేస్తున్న బాలాజి వాఫర్స్ నాలుగువేల కోట్ల విలువైన వాటాలను విక్రయించేందుకు నిర్ణయించింది. వచ్చే ఐపిఒలోనే ఈ వాటాల విక్రయం జరుగుతుందని అంచనా. పదిశాతం వాటా విలువలు సుమారు 40 వేల కోట్లుగా కంపెనీల విలువలున్నట్లు వెల్లడి అయింది. ఎఫ్‌ఎంసిజి రంగంలో ఇదే పెద్ద డీల్ అవుతుందని నిపుణుల అంచనాగా ఉంది. ఐటిసి, పెప్సికో వంటిప్రముఖ సంస్థలు కొనుగోలుకు ఆసక్తిచూపిస్తున్నట్లు మార్కెట్ వర్గాల సమాచారం. చందుబాయ్ విరాని స్థాపించిన ఈ కంపెనీ నేడు బహుముఖంగావిస్తరించింది. ఆలు చిప్స్, నమ్‌కీన్స్ ఇతర ఉత్పత్తులు యుకె, యుఎస్, పశ్చిమాసియాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. రెండు,మూడోశ్రేణి మార్కెట్లలో లీడర్‌గా మారుతోంది. పెప్సికో, లేస్, ఐటిసి బింగో వంటి వాటిని కూడా అధిగమిస్తోంది. ఇపుడు 10% వాటా విక్రయంతో నాలుగువేలకోట్ల నిధులు సమీకరించాలని ప్రైవేటు ఈక్విటీ, సంస్థాగత ఇన్వెస్టర్లనుంచే నిధులు సమీకరణకు నిర్ణయించింది.

## నెక్స్‌జెన్ సెమికండక్టర్స్ రూ.1500 కోట్ల నిధుల సమీకరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** నెక్స్‌జెన్ సమికండక్టర్స్ కంపెనీ గుజరాత్‌లో ఏర్పాటుచేయనున్న చిప్ ఫ్యాక్టరీకోసం రూ.1000 నుంచి 1500 కోట్లు నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ఈక్విటీ ఇతర మార్గాల్లో వచ్చే 12నెలల్లోనే ఈనిధులను సమీకరిస్తామని కంపెనీ ప్రకటించింది. నెక్స్‌జెన్ దశలవారీగా 8800 కోట్లు నిధులు సమీకరించి భారత్‌లో పూర్తిస్థాయి సమీకృత సిలికాన్, సిలికాన్ కార్బైడ్ పవర్ సెమికండక్టర్ ప్లాట్‌ఫామ్‌గా గుజరాత్‌లోని ధోలేరాలో నిర్మిస్తామని చెపుతోంది. నెక్స్‌జెన్‌ప్రస్తుతం వేఫర్‌లనుంచి పవర్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాలకు విస్తరిస్తోంది. సెమికండక్టర్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి దిశగా విస్తరించేందుకువీలుగా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలకుతోడు ప్రైవేటు ఈక్విటీనిధుల సమీకరణతో కంపెనీలు విస్తరణ బాటపట్టాయి. ఇందులోభాగంగానే నెక్స్‌జెన్ కంపెనీ కూడా ఇపుడు 1500 కోట్లు సమీకరిస్తోంది. మొత్తంగా దశలవారీగా భారత్‌లో కీలక పరిశ్రమగా ఎదిగేందుకు కంపెనీని బహుముఖంగా విస్తరించాలని మొత్తం 8800కోట్లునిధులు సమీకరిస్తామని చెపుతోంది. భారత్‌లో ఇపుడు సెమికండక్టర్లయుగం నడుస్తోంది.మలేసియా కంపెనీఐవిపి, మాల్వికా అగర్వాల్, హర్ష్‌అగర్వాల్, ఆయుష్ గోయల్‌లకు చెందిన ట్రాన్స్‌వరల్డ్,మైయోటిక్ వంటి సంస్థలు ముందుకువస్తున్నాయి.

## 2.07%గా రిటైల్ ద్రవ్యోల్బణం!

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** భారత్ రిటైల్‌ద్రవ్యోల్బణం ఆగస్టునెలలో 2.07శాతంగానమోదయింది. అంతకుముందు నెలలో 1.61 శాతంనుంచి స్వల్పంగా పెరుగుదలనమోదయింది. కేంద్ర అర్థగణాంకశాఖ విడుదలచేసిన వివరాలప్రనకారం తొమ్మిదినెలలపాటు ధరల్లో సడలింపులు కనిపించాయి. అందువల్లనే జులై వరకూ ద్రవ్యోల్బణం రిజర్వుబ్యాంకు అంచనాలకు అనుగుణంగానే నడిచింది. ఇపుడు ఆగస్టులో కూడా అంచనాలకు అనుగుణంగానే ఉన్నప్పటికీ గతనెలతో పోలిస్తే కొంతమేర పెరిగింది. ఆహారద్రవ్యోల్బణం ఆగస్టునెలలో మైనస్ 0.69శాతంగా ఉంది. 107 బేసిస్‌పాయింట్లుపెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ద్రవ్యోల్బణం మైనస్ 0.70గా న,మైనస్ 0.58 శాతంగానే ఉన్నాయి. రాష్ట్రాలవారీగాచూస్తే కేరళలో అత్యధిక ద్రవ్యోల్బణం నమోదయింది. 9.04శాతంగా నిలిస్తే అస్సాంలో మాత్రం కనిష్టంగా అదికూడా ప్రతికూలంగా నమోదయింది. మైనస్ 0.66శాతంగా ఉన్నట్లు ప్రకటించింది. గత ఏడాది గణాంకాలనుచూస్తే అక్టోబరులో 6.21శాతంగాఉంది. అప్పటినుంచి తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత 2.82శాతం, 2.1శాతం, 1.55 శాతంగా నమోదయ్యాయి. ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడంవల్ల ఆగస్టునెలలో కొంతమేర ద్రవ్యోల్బణం పెరుగుతుందని రాయిటర్స్ వంటి సంస్థలు అంచనా వేసాయి. జులైలో అయితే ఎనిమిదేళ్ల కనిష్టానికి అంటే 1.55శాతం నమోదయింది. ఇక పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 2.47శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం వరకూ మైనస్ 1.90శాతంగాఉంది. అదే 2025 ఆగస్టులో మైనస్ 0.58 శాతంగా నమోదయింది. గ్రామీణప్రాంతాల్లో కీలక ద్రవ్యోల్బణం ఆహార ద్రవ్యోల్బణం పరంగా ఆగస్టునెలలో 1.69శాతంగా ఉంది. అదే గతనెలలో 1.18శాతంగా ఉంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps